మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 22 అక్టోబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 286 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

యమునా ఒడ్డున బర్త్ డే జరుపుకోండి

2

నగరంలో వింటేజ్ కార్ల ప్రదర్శన



2

పోలీసు అమరవీరుల కుటుంబాల

సంక్షేమానికి ప్రాధాన్యం

శాంతిభద్రతలు బాగుంటేనే వేగంగా అభివృద్ధి

కొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీసు శాఖలో మార్పులు

డ్రగ్స్ కట్టడిలో మీ శాఖ పనితీరు బాగుంది

2028లోగా పోలీసు శాఖలో ఖాళీలన్నీ భర్తీ చేస్తం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 21 (మనం బ్యూరో) : ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను కోల్పోయిన అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. గోషామహల్ పరేడ్ మైదానంలో బుధవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. అమరవీరుల స్థూపం వద్ద డీజీపీ సీవీ ఆనంద్‌తో కలిసి సీఎం నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సమాజం కోసం ప్రాణాలర్పించిన వారిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని సీఎం అన్నారు. ఈ ఏడాది 155 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవటం బాధాకరమన్నారు. శాంతిభద్రతలు బాగుంటేనే రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. కొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీసుశాఖ మార్పులు చేసుకుంటోందని చెప్పారు. 'పోలీసు శాఖను బలోపేతం చేసేందుకు మా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 4,773 కానిస్టేబుల్ సహా మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం. 2028 నాటికి పోలీసు శాఖలో అన్ని ఖాళీలను విడతల వారీగా భర్తీ చేస్తాం. 112 మంది డీఎస్పీలను డైరెక్ట్ రిక్రూట్ మెంట్ చేశాం. ఈ శాఖలో ఎక్స్‌గ్రేషియాను హోదాను బట్టి రూ.కోటికి పైగా పెంచాం. దేశానికి సేవ చేసిన వారిని గుర్తించడంతో పాటు వారి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. పోలీసు ఉద్యోగుల పిల్లల కోసం ప్రత్యేకంగా అంతర్జాతీయ స్థాయిలో స్కూల్ను ఏర్పాటు చేశాం. హోంగార్డుల కుటుంబాలకు వైద్య భద్రత కల్పించే చర్యలు చేపట్టాం. పోలీసు శాఖలో టెక్నాలజీ ఎంత

...మిగతా 2లో

మైసూరు దసరా ఉత్సవాల్లో రేవంత్

చాముండేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

హైదరాబాద్, అక్టోబర్ 21 (మనం బ్యూరో) : కర్ణాటక రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించిన మైసూరు దసరా ఉత్సవాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. మైసూరు దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం అత్యంత ముఖ్యమైన ఘట్టం జంబూ సవారీలో అందంగా అలంకరించిన ఏనుగుపై బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని ముఖ్యమంత్రి దర్శించుకున్నారు. కన్నడ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళాకారులు, సంగీత బృందాలు, నృత్య బృందాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఈ ఊరేగింపులో పాల్గొన్నాయి. కర్ణాటక నాడ హబ్బ (రాష్ట్ర పండుగ) ఉత్సవాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, భక్తి, కళలు, చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తాయి. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీశన్ గారితో పాటు ఎంతోమంది దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులతో కలిసి ఉత్సవాలను వీక్షించారు. మైసూరు రాజభవనం ముందు నిర్వహించిన ఈ దసరా వేడుకల్లో పాల్గొనడానికి ముందు ముఖ్యమంత్రి మైసూరు ప్రజల ఆరాధ్య దైవమైన చాముండేశ్వరి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సొంతూళ్లో సీఎం దసరా వేడుకలు

కొండారెడ్డిపల్లి గ్రామస్తులతో కలిసి శమీ పూజ

హైదరాబాద్, అక్టోబర్ 21, (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ జిల్లాలోని తన సొంత ఊరు కొండారెడ్డిపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి దసరా వేడుకలు జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. వేద పండితుల సమక్షంలో మంత్రోచ్చరణల మధ్య జమ్మిచెట్టుకు సీఎం రేవంత్ పూజలు చేశారు. శమీ పూజ చేసి కోరిక రాశారు. అనంతరం కొండారెడ్డి పల్లి గ్రామస్తులతో సీఎం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దసరా వేడుకలలో భాగంగా రావణ దహనం కార్యక్రమాన్ని వీక్షించిన సీఎం

...మిగతా 2లో

ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

– ఎడిటర్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక..

రక్షణ సేన అభ్యర్థి శ్రీకాంత్ గౌడ్

క్యాండిడేట్‌ను ప్రకటించిన టీఆర్ఎస్ చీఫ్ కవిత

హైదరాబాద్, అక్టోబర్ 21 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిని ఖరారు చేసింది. డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ను తమ అభ్యర్థిగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీకాంత్ గౌడ్ పేరు ప్రకటించడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు, ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ప్రచార వ్యూహాల సమన్వయం కోసం సయ్యద్ ఇస్మాయిల్ను ఎన్నికల కోఆర్డినేటర్, అబ్జర్వర్ గా నియమించారు. ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, ప్రచార కార్యక్రమాల పర్యవేక్షణలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.

రేపు కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల

అత్యవసర భేటీ

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులతో సహా కీలక నేతలంతా హాజరు కావాలె

ఆదేశించిన కాంగ్రెస్ హై కమాండ్

రాజకీయ కార్యాచరణలపై సమాలోచనలు!

హైదరాబాద్, అక్టోబర్ 21 : హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో రేపు కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలకమైన ప్రజాప్రతినిధుల సమావేశాన్ని నిర్వహించనుంది. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కుల ఉమ్మడి నాయకత్వంలో ఈ భేటీ జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు కీలక నేతలంతా తప్పనిసరిగా హాజరుకావాలని అధిష్టానం ఆదేశించింది.

రాష్ట్రంలో అమలవుతున్న ఆరు గ్యారెంటీల పురోగతి, నియోజకవర్గాల వారీగా పెండింగ్లో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతంపై కూడా సమగ్రంగా సమీక్షించనున్నారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ భేటీలో రాష్ట్రంలో మారుతున్న వాతావరణ పరిస్థితులు, ప్రత్యేకించి ఎల్నినో ప్రభావం వల్ల తలెత్తుతున్న సవాళ్లపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. తీవ్ర వర్షాభావం లేదా అకాల వర్షాల వల్ల వ్యవసాయ రంగం, తాగునీటి ఎద్దడి, విద్యుత్ సరఫరాపై పడే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శనం చేయనున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

వైసీపీ నామినేషన్ల దాఖలు గడువు పొడిగింపు 2

అభ్యర్థనపై సుప్రీం కోర్టు

ఏపీ మున్సిపల్ ఎన్నికలు..

నో పొడిగింపు

కోడ్‌ను పాటించాల్సిందే.. రూల్స్ ఉల్లంఘిస్తే కత్తిరింపే 2

వలసలపై ట్రంప్ ఉక్కు పాదం.. 3 లక్షల వీసాల రద్దు 9

అమల్లోకి భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

ఢిల్లీ, అక్టోబర్ 21 : భారత్ - న్యూజిలాండ్‌మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చింది. దీని ద్వారా భారతీయ ఉత్పత్తులపై న్యూజిలాండ్ 100 శాతం దిగుమతి సుంకాలను పూర్తిగా ఎత్తివేసి, సుంకం రహిత ప్రవేశాన్ని కల్పించింది. 2030 నాటికి ఇరుదేశాల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రూ.35 వేల కోట్లకు పెంచడమే లక్ష్యమని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. అదనంగా, ఐటీ, ఇంజనీరింగ్, యోగా, ఆయుష్ నిపుణులు, చెఫ్‌ల కోసం న్యూజిలాండ్ ఐదు వేల ప్రత్యేక వీసాలను కేటాయించింది. దీంతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సరికొత్త పుంతలు తొక్కనుంది.

రూబియో పర్యటన వేళ జైశంకర్ స్మార్ట్ థింకింగ్

పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని బట్టబయలు చేసిన విదేశాంగ మంత్రి

ఢిల్లీ, అక్టోబర్ 21 : అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పర్యటన వేళ మన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పాక్ ఉగ్రవాద వైఖరిని మరో సారి ప్రపంచానికి చాటి చెప్పారు. 2008లో ముంబయిలో జరిగిన మారణహోమానికి ప్రత్యక్ష సాక్షి అయిన సునీల్ కుడ్యాదీని రూబియో ముందుకు తీసుకువచ్చారు. నాటి ఉగ్రఘటనను సునీల్ కళ్లకు కట్టినట్లు వివరించి.. పాక్ కుటిలనీతిని ప్రపంచానికి చాటిచెప్పారు. దీని ఫలితంగా ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే దేశానికి తాము వ్యతిరేకమని రూబియో ప్రకటించాల్సి వచ్చింది. ఇదంతా జైశంకర్-రూబియో భేటీ సందర్భంగా జరిగింది. దీంతో సునీల్ కుడ్యాదీ పేరు నెట్టింట్లో వైరల్ అవుతోంది.

ఎవరీ సునీల్..

ముంబయిలో మార్కో రూబియో 26/11 ఉగ్రదాడి స్మారకాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అప్పట్లో తాజ్ హోటల్ సెక్యూరిటీ చీఫ్‌గా ఉన్న

...మిగతా 2లో

ధోబాల్ వ్యూహంతోనే

అస్థిరత

నోరు పారేసుకున్న పాకిస్థాన్

లండన్, అక్టోబర్ 21 : భారత్ ప్రత్యర్థుల కుయుక్తులను ముందుగానే గుర్తించి వాటికి చెక్ పెట్టడంలో అజిత్ డోభాల్ దిట్ట. అందుకే ఆయన వ్యూహాలు పాకిస్థాన్‌కు నిద్రలేకుండా చేస్తుంటాయి. ఈ అసహనమంతా పాకిస్థాన్ నేషనల్ కమాండ్ అథారిటీ సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ (విశ్రాంత) మజహర్ జమీల్ నోట బయటపడింది. కొన్ని రోజుల క్రితం లండన్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్

...మిగతా 2లో

నగరంలో వింటేజ్ కార్ల ప్రదర్శన

హైదరాబాద్, అక్టోబర్ 21 : హైదరాబాద్‌లో గోల్కొండ, చార్మినార్ తో పాటు ఎక్కడ చూసినా నిజాం కాలం నాటి గుర్తులే దర్శనమిస్తాయి. ఒక్క సారి చౌమొహల్లా ప్యాలెస్‌కు వెళితే నిజాం నాటి కార్లను చూడొచ్చు. అయితే, కేవలం నిజాములు వాడినవే కాకుండా ఆ కాలంనాటి కార్లు చూస్తే ఆశ్చర్యానుభూతులు కలుగుతాయి. నగరంలోని అబిడ్స్ వద్ద గల చాపల్ రోడ్డులో చర్మాస్ సంస్థ నిర్వహించిన వింటేజ్ కార్ల ప్రదర్శన చూసినా అలాంటి ఫీలింగే కలుగుతుంది. ఏటా నిర్వహిస్తున్న ఈ వింటేజ్ కార్ల ప్రదర్శన ఈ ఏడాదీ నిర్వహించారు. ఇందులో క్లాసిక్ ఆటోమొబైల్స్, వాటి కాలాతీతమైన డిజైన్లతో సందర్శకులను ఆకర్షిస్తున్నాయి.

యమునా ఒడ్డున బర్త్ డే జరుపుకోండి

ఢిల్లీ, అక్టోబర్ 21 : దేశ రాజధాని ప్రజలకు ఢిల్లీ మంత్రి పర్వేశ్ వర్మ వినూత్న అభ్యర్థన చేశారు. పుట్టినరోజు వంటి ప్రత్యేకమైన రోజుల్ని యమునానది ఒడ్డున చేసుకోవాలని కోరారు. నదిని శుభ్రంగా ఉంచే ప్రణాళికల్లో భాగంగా ఈ ఆలోచన చేశారు.

'యమునా నది చెంత పుట్టినరోజు వేడుకలు చేసుకోవాలని ఢిల్లీ ప్రజలను కోరుతున్నా. నవంబరు 7న నా పుట్టినరోజును అక్కడే చేసుకోబోతున్నాను. నది ఒడ్డున ప్రజలు తమ సంతోష క్షణాలను ఆస్వాదించినప్పుడు.. అది మురికిగా ఉంటే చూడలేరు. కుటుంబాలు ఒక దగ్గర చేరి, వేడుకలు చేసుకునేందుకు నదీ తీరాల్లో కొన్ని ప్రత్యేక కుటీరాలను ఏర్పాటు చేస్తాం. అలాగే ఘాట్లను శుభ్రం చేయడం వంటి స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొనేవారు అక్కడ ఉండొచ్చు' అని ఢిల్లీ జలవనరుల శాఖ మంత్రి పర్వేశ్ అభిప్రాయడ్డారు.

ఆదివారం జరిగిన 'చలో యమున' కార్యక్రమంలో 35వేలమంది పాల్గొన్నారు. వారంతా నదికి ఇరువైపులా ఉన్న 70 ప్రదేశాలను శుభ్రం చేశారు. ఈ నేపథ్యంలోనే మంత్రి ప్రకటన వచ్చింది. నదితో వ్యక్తిగత బంధం ఏర్పడినప్పుడు.. దానిని శుభ్రంగా ఉంచే బాధ్యతను ప్రజలు తీసుకుంటారనేది ఆయన ఆలోచన వెనక ఉద్దేశం. అలాగే యమునానది ప్రక్షాళన, అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలను వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లోపు నదిని శుభ్రం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని నట్టేట నిలబెట్టిన విదేశాంగ మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

సునీల్ కుడ్యాదీ నాటి భయానక పరిస్థితులను వివరించారు. లష్కరే తయ్యిబా ఉగ్రవాదులు దాదాపు 60 గంటల పాటు హోటల్లో ఎంతటి బీభత్సాన్ని సృష్టించారో వెల్లడించారు. అజిత్ ధోబాల్ వ్యూహంతోనే పాక్ లో అస్థిరత.. నోరు పారేసుకున్న దాయాది

దేశం కోసం తమవంతుగా పోరాడిన ఎంతో మంది అన్సంగ్ హీరోల్లో కుడ్యాదీ ఒకరు. 2008, నవంబర్ 26న జరిగిన దాడిలో ఇతరులను అప్రమత్తం చేయడంలో కీలక పాత్ర పోషించారు. హోటల్ భద్రతా బాధ్యతలు చూస్తుండటంతో ఆ భవనం గురించి పూర్తి పట్టు ఆయనకుంది. అదే భద్రతా సిబ్బంది ఆపరేషన్లో కీలకమైంది. పోలీసులు, కమాండోలకు దారిచూపించారు. రెండు రాత్రుళ్లు మూడు పగళ్లు మొత్తంగా 60 గంటలపాటు ఉగ్రవాదుల ముట్టడిలో ఉన్న హోటల్లోపలే ఉండి సహాయక చర్యలకు తోడ్పడ్డారు. ఆయన అనుభవం భారీ ప్రాణనష్టాన్ని నివారించారు.

ధోబాల్ వ్యూహంతోనే అస్థిరత

(మొదటి పేజీ తరువాయి)

ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్‌లో ఆయన మాట్లాడిన మాటలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. పాకిస్తాన్‌లో అశాంతిని సృష్టించడానికి భారత్ ఉగ్రవాదాన్ని ఒక సాధనంగా వాడుతోందని జమీల్ ఆరోపించారు. టీటీపీ, బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ ఉగ్ర సంస్థలకు మద్దతు ఇవ్వడం అందులో భాగమేనంటూ చిత్ర విచిత్ర వ్యాఖ్యలు చేశారు. పాక్‌లో అస్థిరతను సృష్టించడానికి అజిత్ డోభాల్ సిద్ధాంతాన్ని అమలు చేస్తోందన్నారు. 1971లో ముక్తి వాహిని, 1980ల్లో ఎల్టీటీఈకి భారత్ మద్దతు ఇచ్చిందని తన ప్రసంగంలో నోరు పారేసుకున్నారు. 2001 నుంచి 2014 మధ్య అఫ్గాన్ - పాకిస్తాన్‌కు మధ్య ఉన్న సరిహద్దు సమీపంలో భారత్ ఆరు కాన్సులేట్లు నడిపిందన్నారు. ఇవన్నీ ఉగ్రవాదానికి భారత్ మద్దతు ఇస్తుందనడానికి నిదర్శనమంటూ హాస్యాస్పద వ్యాఖ్యలు చేశారు.

అలాగే గతేడాది జరిగిన ఆపరేషన్ సిందూర్లో అణు, సంప్రదాయ ఆయుధాలను మోసుకెళ్లగల బ్రహ్మోస్ క్షిపణులను భారత్ ఉపయోగించిందని ఆరోపించారు. భారత్ అనుసరిస్తున్న 'నో ఫస్ట్ యూజ్' (ముందుగా అణ్వాయుధాలు ప్రయోగించబోం) విధానం ఒక దౌత్యపరమైన వ్యూహం మాత్రమేనని, మొదటిసారే దాడి చేసేలా భారత్ వద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయని మరో చిత్రమైన వాదన వినిపించారు. పాక్‌లోని అంతర్గత అస్థిరతలను ఎలా కట్టడి చేయాలో అర్థం కాక తల పట్టుకుంటున్న షహబాజ్ షరీఫ్ ప్రభుత్వం.. ఆ నెపాన్ని భారత్‌పై నెట్టేయడమే ఈ ప్రసంగం ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది.

ఆపరేషన్ సిందూర్ సమయంలో దక్షిణాసియా మొత్తాన్ని భారత్ అణు విపత్తు అంచు వరకు తీసుకెళ్లిందని, అయితే పాకిస్తాన్ వ్యూహాత్మక సంయమనం వల్లే పరిస్థితి చక్కబడిందని జమీల్ సొంత డబ్బా కొట్టుకున్నారు. అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని, అణువ్యాప్తి నిరోధక ఒప్పందం కింద భారత్‌కు ఉన్న మినహాయింపులను తొలగించాలన్న లక్ష్యంతో ఈ ఆరోపణలు చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్‌పీటీపై సంతకం చేయకపోయినా.. అణు ఇంధనం, రియాక్టర్లను కొనుగోలు చేయడానికి భారత్‌కు మినహాయింపులు ఉన్నాయి..శత్రువుల కదలికల గమనిస్తూ ఉండిపోకుండా.. అవసరమైతే ఆ దేశ భూభాగాల్లోకి వెళ్లి దెబ్బ కొట్టడాన్ని డోభాల్ డాక్ట్రిన్‌గా చెప్తుంటారు. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వైమానిక దాడులు అందులో భాగమే...బ్రహ్మోస్ క్షిపణికి టాక్టికల్ న్యూక్లియర్ వెపన్స్‌ను మోసుకెళ్లే సామర్థ్యం ఉంది. అయితే భారత్ ఆ క్షిపణిని సంప్రదాయ ఆయుధాల కోసమే ఉపయోగిస్తోంది. అణ్వాయుధాలను ప్రయోగించడానికి భారత్ వద్ద అగ్ని, పృథ్వి వంటి క్షిపణులు ఉన్నాయి.

హెదరాబాద్‌లో

ఫిజి గౌరవ కాన్సుల్‌గా డా. బొడ్డపాటి నియామకం

హైదరాబాద్, అక్టోబర్ 21, (మనం బ్యూరో) : ఫిజీ గణతంత్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో గౌరవ కాన్సుల్‌గా డాక్టర్ సీతా రామయ్య బొడ్డపాటిని నియమించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు ఆయన కాన్సులర్ పరిధిలోకి వస్తాయి. ఫిజీ ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి సిటివేని ఎల్. రబుకా ఆయన నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ సైతం ఈ నియామకానికి ఆమోదం తెలిపింది. భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలను, వాణిజ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలన్న ఫిజీ లక్ష్యంలో భాగంగా ఈ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. దక్షిణ భారతదేశంతో ఫిజీ సంబంధాలను విస్తరించేందుకు ఇది దోహదపడనుంది. గౌరవ కాన్సుల్గా డాక్టర్ బొడ్డపాటి ఫిజీకి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు, సంస్థలకు, వ్యాపార వర్గాలకు మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించనున్నారు. ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధి, పరస్పర సంప్రదింపులు, తగిన కాన్సులర్ సహాయం అందించడం వంటి అంశాల్లో తన పరిధికి అనుగుణంగా సేవలందించనున్నారు. సమాచార సాంకేతిక రంగం, లైఫ్ సైన్సెస్, వైద్య సేవలు, విద్య, వాణిజ్య రంగాల్లో హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. ఈ నేపథ్యంలో ఫిజీకి, దక్షిణ భారత రాష్ట్రాలకు మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, పర్యాటకం, విద్య, సంస్కృతి, వ్యాపార భాగస్వామ్యాల అభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయి. భారత్-ఫిజీ మధ్య చిరకాల స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు, మూడు రాష్ట్రాల్లో ఆర్థిక, సాంస్కృతిక, ప్రజా సంబంధాలను విస్తరించేందుకు ఆయన కృషి చేయనున్నారు.

పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

పెరిగినా మానవీయ దృక్పథం తగ్గకూడదని పేర్కొన్నారు. యువత మత్తుకు బానిసలు కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందనీ, డ్రగ్స్ కట్టడిలో రాష్ట్ర పోలీసుశాఖ పనితీరు బాగుందనీ, ఉత్తమ పనితీరుతో జాతీయ స్థాయిలో తొలిస్థానం దక్కించుకుందని అభినందించిన సీఎం ఆహార కల్తీ కట్టడికి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుందని తెలిపారు. టీజీ సేఫ్ ద్వారా కల్తీపై ఉక్కుపాదం మోపుతున్నామనీ, ట్రాన్స్ జెండర్లకు ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలు అప్పగించి సాహసోపేత నిర్ణయం తీసుకున్నాం. బాధితులు, సామాన్యులు, అమాయకుల పట్ల మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ చేయాలి. నేరస్థులు, కబ్జాదారులు, డగ్స్ దందా చేసేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలి''అని పేర్కొన్నారు.

ఆధునిక సాంకేతికతను వినియోగించాలని నిర్ణయం తీసుకున్నామనీ, సాంకేతికత ఎంత పెరిగినా పోలీసులు మానవీయ దృక్పథం మారకూడదని సూచించారు. షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ మహిళల భద్రతను మరింత బలోపేతం

చేస్తున్నాం. మహిళలకు అండగా నిలిచే సామాజిక బాధ్యతను పెంచడానికి స్టాండ్ విత్ హర్ కార్యక్రమాన్ని ఈ ఏడాది మార్చిలో ప్రారంభించామని గుర్తు చేశారు..మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలి. బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదనీ, మహిళల భద్రత కేవలం పోలీసు శాఖ బాధ్యత కాదు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని స్పష్టం చేశారు. చివరిగా పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా ఒక మాట చెప్పాలనుకుంటున్నా. మీరు కోల్పోయిన వ్యక్తిని ఎవరూ తిరిగి తీసుకురాలేరు. మీ కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ పూర్తిగా భర్తీ చేయలేరు... కానీ మీ బాధలో మీరు ఒంటరివారు కాదు.. మీకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది. పోలీసు శాఖ అండగా ఉంటుంది. తెలంగాణ సమాజం అండగా ఉంటుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

ఏపీ మున్సిపల్ ఎన్నికలు.. నో పొడిగింపు

- వైసీపీ నామినేషన్ల దాఖలు గడువు పొడిగింపు అభ్యర్థనపై సుప్రీం కోర్టు

ఢిల్లీ, అక్టోబర్ 21 : నామినేషన్ల దాఖలుకు గడువు పొడిగించాలన్న వైసీపీ పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. 19 చోట్ల తమను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని ఆ పార్టీ తన పిటిషన్లో పేర్కొంది. దీనిపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. నామినేషన్ల గడువు మొత్తంగా వాయిదాకు, పొడిగింపునకు నిరాకరించింది. నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని ఫిర్యాదు చేసిన చోటే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది.

నామినేషన్లపై ఇప్పటికే ఫిర్యాదులు అందిన చోటే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నామినేషన్లకు అవకాశం కల్పిస్తే జిల్లా కలెక్టర్ వద్ద కూడా దాఖలుకు పరిశీలించాలని, దీనిపై గురువారంలోపు నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీకి సూచించింది. మరోవైపు అభ్యర్థుల తుది జాబితా ప్రకటన గడువును ఈనెల 25 వరకు సుప్రీంకోర్టు పొడిగించింది. కోర్టుల్లో కేసులు వేయడం తప్ప..

ఎక్కడా ఫిర్యాదులు చేయలేదని ఎస్ఈసీ తెలిపింది. తమ ఆదేశాలపై తీసుకున్న చర్యలపై ఈనెల 27న నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

విచారణ సందర్భంగా వైసీపీ ఎంపీలు, నేతలు పలుచోట్ల వ్యవహరించిన తీరును రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నామినేషన్ కేంద్రంలో ఎంపీ మిథున్ రెడ్డి, ఆయన అనుచరులు చేసిన అరాచకాలను వివరించారు. నామినేషన్ కేంద్రంలో ఉన్న వారిని కారుతో ఢీ కొట్టించిన అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 15, 16వ తేదీల్లో దురుద్దేశంతో తీవ్ర హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారని.. రాజకీయ కుట్రకు తెరలేపారని ఎస్ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తెలిపారు. వైకాపా అరాచకంతో భద్రత మధ్య ప్రజలను తరలించాల్సి వచ్చిందన్నారు. పంజాబ్లోని పఠాన్‌కోట్ ప్రాంతం నుంచి మారణాయుధాలతో దుండగులను వైకాపా దిగుమతి చేసుకుందని.. వారిని పోలీసులు అరెస్ట్ చేశారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పంజాబ్ నుంచి వచ్చిన అంతర్రాష్ట్ర ముఠాల దగ్గర ఆయుధాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. శాంతి భద్రతలను పరిరక్షించడంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడలేదని ప్రభుత్వం తరపు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు.

సొంతూళ్లో సీఎం దసరా వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా మన సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు. ఈ పండుగ ధైర్యం, ధర్మం, సత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. మనలోని అహంకారం, అసూయలను తొలగించుకుని, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జమ్మిచెట్టును పూజించి, ఆకులను బంగారంగా భావించి పెద్దల ఆశీర్వాదం తీసుకునే మన సంప్రదాయం ప్రకృతిని, పెద్దలను గౌరవించాలని చాటిచెబుతుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

నిత్యావసరాల ధరల నియంత్రణ

వేగంగా పీఎం సూర్యఘర్

ఆర్టీజీఎస్ సమీక్షలో ఏపి సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 21(మనం న్యూస్): ఎల్ నినో ప్రభావంతో దేశ వ్యాప్తంగా ధరల పెరుగుదల కన్పిస్తోందని, ఆ ప్రభావం నిత్యవసరాలపై పడకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆర్టీజీఎస్ సమీక్షలో భాగంగా వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బియ్యం, కందిపప్పు, ఉల్లి, వంటనూనె, పంచదార వంటి నిత్యవసరాల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుబజార్లలో ప్రభుత్వం తరపున అందిస్తున్న బియ్యం అమ్మకాలపై సీఎం ఆరా తీశారు. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని... కొనుగోళ్లు బాగా జరుగుతున్నాయని అధికారులు వివరించారు. అలాగే దీపావళి, సంక్రాంతి వంటి పండుగల సమయంలో కూడా రైతు బజార్లల్లో తక్కువ ధరకు ఫైన్ రకం బియ్యాన్ని అందుబటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలన్నారు. అలాగే ఉల్లిపాయల సరఫరాను మరింత పెంచి, సామాన్యులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటంకం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటులో మరింత పురోగతి సాధించాలని, ప్రస్తుతం జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్నామని... దీన్ని మరింత మెరుగుపరుచుకోవాలన్నారు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇంకా తొమ్మిది లక్షల కనెక్షన్లను ఏర్పాటు చేయాలని... వీటిని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసేలా కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇసుక సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పాలనలో టెక్నాలజీని పూర్తిగా ఉపయోగించుకుని ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని సీఎం పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగ్గా జరగాలన్నారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బలపరీక్ష రేపు పెట్టినా..

275మంది ఎమ్మెల్యేలు మావైపే

విశ్వాసంతో చెబుతున్న సీఎం సువేందు

కొల్‌కతా, అక్టోబర్ 21 : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహిస్తే మొత్తం 294 మందిలో 275మంది ఎమ్మెల్యేల మద్దతు భాజపాకే లభిస్తుందన్నారు. తృణమూల్ కాంగ్రెస్ టికెట్ పై గెలుపొందిన 64 మంది ఎమ్మెల్యేల మద్దతూ బీజేపీకేనని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా లేదా టీవీ చర్చా కార్యక్రమాల వల్ల బీజేపీ గెలవలేదన్న ఆయన.. భవానీపుర్లో తాను మాజీ సీఎం మమతా బెనర్జీని ఓడించానన్నారు. ప్రజలతో ఎన్నికైన తమది ఓ సనాతన ప్రభుత్వమని తెలిపారు. ఇటీవల దుర్గ పూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో బాధిత కుటుంబాలను పరామర్శించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

ఒకవేళ అసెంబ్లీలో రేపు విశ్వాస పరీక్ష పెట్టినా తమ సంఖ్యా బలం 275కు చేరుకుంటుందన్నారు. గతంలో లెఫ్ట్రంట్, ఆ తర్వాత టీఎంసీ పాలనపై విమర్శలు గుప్పించారు. గత 49 ఏళ్లుగా పేరుకుపోయిన మురికిని తమ భాజపా ప్రభుత్వం ఆరు నెలలుగా శుభ్రం చేస్తోందన్నారు. బెంగాల్లో ప్రజల మద్దతు ఏమాత్రం లేకపోవడంతో మమతా బెనర్జీకి చెందిన టీఎంసీ తన గుర్తింపును, సంఖ్యా బలాన్ని.. చివరకు జెండాను సైతం కోల్పోయే పరిస్థితికి చేరుకుంటుంద

ఈ ఏడాది ఏప్రిల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా 208 స్థానాలు గెలుచుకొని బెంగాల్లో అపూర్వ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత టీఎంసీలో చీలికలు రావడం, ఆ పార్టీ చీఫ్ మమతా బెనర్జీపై ఒక వర్గం తిరుగుబాటు చేయడమే కాకుండా పార్టీ పేరు, గుర్తు సైతం తమదేనంటూ క్లెయిమ్ చేసుకోవడం వంటి పరిణామాల బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం రేపాయి.

కోడ్‌ను పాటించాల్సిందే.. రూల్స్ ఉల్లంఘిస్తే కత్తిరింపే

ఢిల్లీ, అక్టోబర్ 21 : దేశంలోని ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానళ్లకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కీలక సూచనలు జారీ చేసింది. కార్యక్రమాల ప్రసారంలో కేబుల్ టెలివిజన్ నెట్వర్క్స్ (రెగ్యులేషన్) చట్టం-1995 కింద నిర్దేశించిన ప్రోగ్రామ్ కోడ్ ను కచ్చితంగా పాటించాలని హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు టీవీ ఛానెళ్లు మరింత బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ విధానాన్ని పాటించాలని సూచిస్తూ పలు ఆదేశాలు జారీ చేసింది.

మతాల విషయంలో జాగ్రత్త...

వార్తల ప్రసారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లను ప్రత్యక్ష ప్రసారం చేయకూడదని సూచించింది. హింసాత్మక దృశ్యాలను ప్రసారం చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, లైంగిక నేరాల బాధితుల గుర్తింపును బయటపెట్టకూడదని ఆదేశించింది. భారతదేశానికి సంబంధించిన మ్యాప్లను ప్రసారం చేసేటప్పుడు ప్రామాణికమైన మ్యాప్లనే ఉపయోగించాలని మంత్రిత్వ శాఖ సూచించింది. మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టే లేదా దేశ వ్యతిరేక భావాలను ప్రోత్సహించే కంటెంట్ ప్రసారం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది.

జర్నలిజం ప్రమాణాలను పాటించాలి:

అలాగే వార్తలు, కార్యక్రమాల తయారీలో కృత్రిమ మేధ (అఐ) సాధనాలను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ప్రసారమయ్యే కంటెంట్ విశ్వసనీయతను నిర్ధారించేందుకు ఎడిటోరియల్ పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని పేర్కొంది. ఈ మార్గదర్శకాల ద్వారా టీవీ ఛానళ్లు బాధ్యతాయుతమైన జర్నలిజం ప్రమాణాలను పాటించాలని కేంద్రం స్పష్టం చేసింది. టెలివిజన్ ప్రసారాల నాణ్యత, సామాజిక బాధ్యత మరియు దేశ భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రసార సంస్థలు ఈ మార్గదర్శకాలను తక్షణమే అమలు చేయాలని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

సీజేపీకి ఊరట..

సౌరవ్, అశుతోష్ విడుదలకు కోర్టు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 21 : కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా విడుదలకు ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆదేశించారు. జంతర్ మంతర్లో నిరసనలు చేపట్టినందుకు గానూ విధించిన జ్యుడీషియల్ కస్టడీ నేటితో ముగియడంతో వారిద్దరినీ పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా పూచీకత్తుపై విడుదలకు ఎస్ఈఎం ఆదేశించారు.

జంతర్ మంతర్ను డీనోటిపై చేసిన అనంతరం అక్టోబర్ 14న నిరసనలు తెలియజేయడంతో సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను అరెస్టు చేసిన పోలీసులు.. వారిని కోర్టులో హాజరు పరచగా 5 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. అనంతరం కస్టడీని ఈ నెల 19న మరో రెండు రోజుల పాటు పొడిగించారు. ఆ గడువు బుధవారంతో ముగిసింది. దీనిపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా.. కస్టడీ విషయంలో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు వెలువడే వరకు వేచి చూడాలని, లేదంటే పైకోర్టుకు వెళ్లాలని సూచించింది. ఈ క్రమంలోనే నేతలిద్దరికీ ఈ సాయంత్రానికి ఊరట లభించింది.

అమెరికా శాటిలైట్‌ను ఢీకొట్టబోయిన రష్యా ఉపగ్రహం..!

వాషింగ్టన్, అక్టోబర్ 21 : అంతరిక్షంలో అమెరికా-రష్యా మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇటీవల రష్యాకు చెందిన సైనిక ఉపగ్రహం 'కాస్మోస్ 2612' అమెరికాకు చెందిన ఐసీఈవైఈ-ఎక్స్36 అనే నిఘా రాడార్ ఉపగ్రహాన్ని ఢీకొట్టబోయింది. చివరి నిమిషంలో రష్యా ఉపగ్రహం నాటకీయంగా వెనక్కి తగ్గడంతో ఉద్రిక్తతలు శాంతించాయి. వాస్తవానికి ఐసీఈవైఈ-ఎక్స్36 శాటిలైట్ ఉక్రెయిన్‌కు అవసరమైన సైనిక నిఘా సమాచారం, చిత్రాలను అందిస్తుండటం విశేషం.

ఈ ఏడాది ఏప్రిల్లో రష్యా సోయజ్ రాకెట్ సాయంతో ఆరు ఉపగ్రహాలను ప్రయోగించింది. వీటికి సైనిక శ్రేణి ఉపగ్రహాలకు పెట్టే కాస్మోస్ పేరును పెట్టి.. 2609 నుంచి 2614 వరకు నంబర్లు కేటాయించింది. అయితే.. ఇవి కచ్చితంగా అంతరిక్షంలో ఏ పనిచేస్తాయో మాత్రం వెల్లడించలేదు.

ఇక ఐఇఢ్గఉ సంస్థ పోలాండ్ కేంద్రంగా పనిచేస్తోంది. అమెరికాలో అనుబంధ సంస్థ ఉంది. ఐసీఈవైఈ-ఎక్స్36 ను అమెరికా ఉపగ్రహంగా నమోదు చేశారు. ఈ సంస్థ 2022 ఆగస్టులో ఒక ఉపగ్రహాన్ని ఉక్రెయిన్‌కు బదిలీ చేసినట్లు ప్రకటించింది. అయితే దేనిని చేసిందో వివరాలు మాత్రం వెల్లడించలేదు. రష్యాపై యుద్ధంలో ఇది ఉక్రెయిన్కు ఉపయోగపడుతుందని పేర్కొంది.

ఇటీవల సెప్టెంబర్ 30వ తేదీన రష్యాకు చెందిన కాస్మోస్ 2612 తమ శాటిలైట్ కక్ష్యలోకి రావడం మొదలుపెట్టిందని ఐఇఢ్గఉ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల రష్యా ఉపగ్రహం దాదాపు కొన్ని వందల మీటర్ల సమీపానికి వచ్చేసిందని పేర్కొంది. రష్యా ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యకు పాల్పడినట్లు వెల్లడించింది. దానిలో ఆయుధాలు ఉండే అవకాశం ఉందని పేర్కొంది.

అయితే ఆదివారం రాత్రి నుంచి రష్యా ఉపగ్రహం మెల్లగా దూరం జరగడం మొదలుపెట్టింది. సోమవారం సాయంత్రానికి 250 మైళ్ల దూరం జరిగింది. అయితే చివరి నిమిషంలో ఇది ఎందుకు వెనక్కి తగ్గిందో మాత్రం తెలియరాలేదు. రష్యా విధించిన కొన్ని ఆంక్షలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల కొంత సడలించారు. దాదాపు అదే సమయంలో ఈ ఉపగ్రహం వెనక్కి జరగడం మొదలుపెట్టింది. ఈ రెండు పరిణామాలకూ మధ్య సంబంధం ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు.

విశ్వ వేదికపై తెలంగాణ సాంస్కృతిక వైభవం

ఘనంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'!

తెలంగాణ కళా సంపదను ప్రపంచానికి చాటాలె

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

పెట్టుబడులతో పాటు మన సంస్కృతిని సమున్నతంగా ప్రదర్శించేలా ఏర్పాట్లు

హైదరాబాద్, అక్టోబర్ 21(మనం న్యూస్): తెలంగాణ గడ్డపై పుట్టిన కళలు, మన సంస్కృతి గొప్పతనం విశ్వవ్యాప్తం కావాలని,కేవలం పారిశ్రామిక అభివృద్ధి కోసమే కాకుండా, మన చారిత్రక సాంస్కృతిక వైభవాన్ని యావత్ ప్రపంచానికి చాటిచెప్పే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. డిసెంబర్ 7, 8, 9 తేదీలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' సందర్భంగా జానపద, శాస్త్రీయ సంగీత నృత్యాలు, అద్భుతమైన సాంస్కృతిక కళారూపాలను విస్తృతంగా ప్రదర్శించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సమ్మిట్ ఏర్పాట్లపై బుధవారం ఆయన ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ప్రత్యేక కల్చరల్ కార్నివాల్..

జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, దిగ్గజ ప్రతినిధులు హాజరుకానున్న ఈ సమ్మిట్ ద్వారా రాష్ట్ర పెట్టుబడుల అవకాశాలతో పాటు మన జీవన విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ప్రారంభోత్సవం రోజున విచ్చేసే అతిథులకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల సంప్రదాయ కళారూపాలతో అపూర్వ స్వాగతం పలకాలని సీఎస్ అధికారులకు సూచించారు. ఇక సమ్మిట్లో భాగంగా డిసెంబర్ 9న జరిగే రక్షా ఎక్స్పో ముగింపు సందర్భంగా ఏర్పాటయ్యే ఎయిర్ షోను వీక్షించేందుకు భారీగా తరలివచ్చే ప్రజల కోసం, అదే రోజున ప్రత్యేక 'కల్చరల్ కార్నివాల్' నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం..

ఈ గ్లోబల్ సమ్మిట్కు అపూర్వ స్పందన వచ్చేలా ప్రచార హోరును పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ నెల 24న హైదరాబాద్లో, 29న న్యూఢిల్లీలో 'కర్టెన్ రైజర్' కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరుతో పాటు శంషాబాద్ విమానాశ్రయం, హైదరాబాద్లోని ప్రధాన రహదారులు, ప్రముఖ స్టార్ హోటళ్ల వద్ద ఆకర్షణీయమైన హోర్డింగులను ఏర్పాటు చేసి సమ్మిట్ ప్రాధాన్యతను కళ్లకు కట్టేలా చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. జాతీయ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, సినీ ప్రముఖులు, ఇతర సెలబ్రిటీలతో ప్రత్యేక షార్ట్ ఫిల్మ్ రూపొందించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

సమన్వయంతో విజయవంతం చేద్దాం..

ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శులు హరిచందన, శశాంక, ముకుంద్ రెడ్డి, అజిత్ రెడ్డి, సీఎం కార్యాలయం సీపీఆర్ఓ మల్సూర్, డిజిటల్ విభాగం డైరెక్టర్ కర్రి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలు దాటించే ఈ మహా యజ్ఞాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే ఈ వేదిక అందరి భాగస్వామ్యంతో దిగ్విజయం కావాలని సీఎస్ అధికారులకు వెల్లడించారు.

యువతకు సువర్ణావకాశం

టి3... టెక్రోప్రెన్యూర్ ట్రైబ్ ట్రైనింగ్

మూడు నెలల పాటు ప్రత్యేక వారాంతపు శిక్షణా కార్యక్రమం

ఆవిష్కర్తలకు అండగా నిలవడమే మన లక్ష్యం: కల్నల్ హర్పాల్ సింగ్ గ్రేవాల్



హైదరాబాద్, అక్టోబర్ 21(మనం న్యూస్): దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని,కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే తరం కాకుండా, పది మందికి ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా యువత ఎదిగే దిశగా అడుగులు వేయిస్తూ, అత్యాధునిక సాంకేతిక రంగంలో నూతన ఆవిష్కరణలకు పదునుపెట్టేందుకు హైదరాబాద్లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) ఒక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీఈజెడ్ సొల్యూషన్స్ సంస్థతో కలిసి 'టి 3 టెక్నోప్రెన్యూర్ ట్రైబ్' పేరుతో మూడు నెలల వారాంతపు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కల్నల్ హెర్పాల్ సింగ్ గ్రేవాల్ వెల్లడించారు.

భవిష్యత్ తరానికి దిక్సూచిగా శిక్షణ..

రేపటి పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడమే ధ్యేయంగా రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం వచ్చే నవంబర్ 30 నుంచి 2027 ఫిబ్రవరి 13 వరకు కొనసాగనుంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, వ్యాపార అవసరాలకు ఎలా అన్వయించాలనే కోణంలో యువతకు ఇక్కడ దిశానిర్దేశం చేయనున్నారు. స్టార్టప్ల నిర్వహణలో మెలకువలు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై నిపుణుల చేత ప్రత్యేక శిక్షణ ఇప్పించడం విశేషం.

పోస్టర్ ఆవిష్కరణ..

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను మంగళవారం ఎస్కీ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ కల్నల్ హర్పాల్ సింగ్ గ్రేవాల్, టీఈజెడ్ సొల్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ నందితా సేథి సంయుక్తంగా ఆవిష్కరించారు. సాంకేతిక ఆధారిత స్టార్టప్లను ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను, పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయవచ్చని ఈ సందర్భంగా కల్నల్ హర్పాల్ సింగ్ గ్రేవాల్ పిలుపునిచ్చారు. వినూత్న ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా మలచుకోవడానికి ఔత్సాహికులకు ఇది సరికొత్త వేదిక కానుందని ఆయన స్పష్టం చేశారు.

ఎవరు అర్హులు? అవకాశాన్ని ఎలా వినియోగించుకోవాలి?

డిగ్రీ, పీజీ అభ్యసిస్తున్న విద్యార్థులు, యువ నిపుణులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు,సాంకేతిక రంగంపై మక్కువ ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావచ్చునని కేవలం శిక్షణ మాత్రమే కాకుండా సరైన మార్గదర్శకత్వం, పరిశ్రమల ప్రముఖులతో అనుసంధానం వంటి అపురూపమైన అవకాశాలను ఈ వేదిక ద్వారా యువత అందిపుచ్చుకోవాలని నిర్వాహకులు కోరారు. సాంకేతికతకు, ఆచరణాత్మక వ్యాపారానికి మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చడంలో ఈ 'టి 3' కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని టీఈజెడ్ సొల్యూషన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ నందితా సేథి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఈజెడ్ సొల్యూషన్స్ మెంటర్ కె.ఎ.ఎస్. మీనన్, ఎస్కీ ఫ్యాకల్టీ ప్రతినిధులు సాయి కిషోర్, ఎన్.వి.ఎస్.ఎస్. సాగర్, డిజైన్ అండ్ ప్రోటోటైపింగ్ సెంటర్ ప్రతినిధి అలిగే రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎన్నికల్లో ఈయూ ఘన విజయం

హైదరాబాద్, అక్టోబర్ 21 : తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ)ఘన విజయం సాధించింది. కాంగ్రెస్ ప్రభుత్వ అనుబంధ సంఘం టీడబ్ల్యూయూ గెలుపు కోసం చేసిన కుట్రలను తిప్పికొట్టిన ఆర్టీసీ కార్మికులు ఎంప్లాయీస్ యూనియన్ కు భారీ విజయాన్ని అందించారు.

ఈ నెల 9న జరిగిన తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో మొత్తం 34,421 ఓట్లు పోల్ అవ్వగా.. 18,276 ఓట్లు ఎంప్లాయీస్ యూనియన్ సాధించింది.ఎంప్లాయీస్ యూనియన్ను ఆర్టీసీ కార్మికులు భారీ మెజారిటీ కట్టబెట్టడంతో యూనియన్ నేతలు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకుంటున్నారు.

జవహర్ నగర్ డంప్ యార్డు తరలింపే లక్ష్యం..

27 నుంచి ఎంపీ ఈటల పాదయాత్ర

హైదరాబాద్, అక్టోబర్ 21 : మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని జవహర్ నగర్ డంప్ యార్డును తక్షణమే వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర తలపెట్టారు. ఈ నెల 27 నుంచి ఈ పాదయాత్ర ప్రారంభం కానుంది. ఏళ్లుగా జవహర్నగర్ డంప్ యార్డు కారణంగా ఎదురవుతున్న దుర్వాసన, కాలుష్యం, ఆరోగ్య సమస్యలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, డంప్ యార్డును అక్కడి నుంచి ఖాళీ చేయించాలని డిమాండ్ చేస్తూ ఈటల రాజేందర్ పోరాటానికి సిద్ధమయ్యారు. ఈ పాదయాత్రకు సంబంధించి కార్యాచరణను రూపొందించేందుకు, బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఆయన ఎల్లుండి డంప్ యార్డ్ బాధితులు, స్థానికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. స్థానికుల అభిప్రాయాలు, సమస్యలను స్వీకరించిన అనంతరం పాదయాత్ర రూట్ మ్యాప్, తదితర వివరాలను వెల్లడించనున్నారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

యాదాద్రి పవర్ ప్లాంట్..

5వ యూనిట్ సింక్రనైజేషన్ సక్సెస్

ప్రాజెక్టు పూర్తయిందన్న టీజీజెన్కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్

హైదరాబాద్, అక్టోబర్ 21 : నల్లగొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) 5వ యూనిట్ (800 మెగావాట్లు) గ్రిడ్ కు విజయవంతంగా అనుసంధానమైంది. తదుపరి వాణిజ్య ఉత్పత్తి (సీవోడీ) చర్యల కోసం హ్యాండ్ ట్రిప్ చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 4000 మెగావాట్ల సామర్థ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటికే నాలుగు యూనిట్లు అందుబాటులోకి రాగా, చివరిదైన 5వ యూనిట్ కూడా గ్రిడ్కు కనెక్ట్ కావడంతో ప్రాజెక్ట్ పూర్తయినట్లేనని టీజీజెన్కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ పేర్కొన్నారు. ఈ మైలురాయిని సాధించిన జెన్కో, బీహెచ్ఈఎల్ బృందాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

సీఎం ఆదేశాలతో కదిలిన యంత్రాంగం...

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం భారీగా నెలకొన్న విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో వైటీపీఎస్లో సామర్థ్యం మేరకు విద్యుత్ ఉత్పాదన జరగకపోవడంపై విమర్శలు వచ్చాయి. అయితే కాగా బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పాదన జరగకపోవడంపై ఇటీవల సంబంధిత అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. అలసత్వం వహించే అధికారులపై వేటు తప్పదని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. వారంలోగా యూనిట్-5 సింక్రనైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జెన్ కో సీఎండీ ఎస్. హరీశ్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్మిట్టల్ వైటీపీఎస్ వద్ద పనులు వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ పెట్టారు. అలాగే నాలుగు యూనిట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందా? లేదా? ఉత్పాదనకు అవసరమైన బొగ్గు అందుతుందా? ప్లాంట్కు అవసరమైన బొగ్గును తరలించే రేకులు అన్లోడ్ అవుతున్నాయా? లేదా? వంటి అంశాలను పరిశీలించేందుకు ప్రభుత్వం ఐదుగురు ఐఏఎస్లను నియమించింది. ఈ పరిణామాల మధ్య ఇవాళ 5వ యూనిట్ (800 మెగావాట్లు) గ్రిడ్ కు విజయవంతంగా అనుసంధానమైనట్లు అధికారులు వెల్లడించారు.

19 రోజులు.. రూ.2,054 కోట్ల అమ్మకాలు

పండుగ సీజన్లో లిక్కర్ కిక్కు

హైదరాబాద్, అక్టోబర్ 21 : తెలంగాణలో దసరా పండుగ సీజన్లో సందర్భంగా మద్యం ఏరులై పారింది. అక్టోబర్ మొదటి 19 రోజుల్లో రాష్ట్రంలో ఊహించని విధంగా మద్యం విక్రయాలు భారీగా నమోదయ్యాయి. ఎక్సైజ్ శాఖ గణాంకాల ప్రకారం.. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత ఏడాదితో పోలిస్తే ఇది 37.02 శాతం వృద్ధిని నమోదు చేసింది.

మునుపటి కంటే మించి..

అయితే, ఈసారి ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) కంటే బీర్ల అమ్మకాలు అత్యధికంగా పెరిగాయి. ఈ కాలంలో బీర్ల విక్రయాలు దాదాపు 41 శాతానికి పైగా ఎగబాకాయి. గత ఏడాది ఇదే కాలంలో 21.55 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, ఈసారి అది 30.37 లక్షల కేసులకు చేరుకుంది. ఇక ఐఎంఎఫ్ఎల్ (ఐఎంఎఫ్ఎల్) విక్రయాలు గత ఏడాది 14.16 లక్షల కేసులు ఉండగా, ఈ ఏడాది 18.38 లక్షల కేసులకు పెరిగాయి.

ఆ ఒక్కరోజే రూ.303 కోట్లు..

ఎక్సైజ్ శాఖ రోజువారీ నివేదికల ప్రకారం.. అక్టోబర్ 19న ఒక్కరోజే రాష్ట్రంలో రూ.303.40

కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. గత ఏడాది ఇదే రోజుతో పోలిస్తే అమ్మకాల్లో భారీగా పెరుగుదల నమోదైంది. పండుగ సీజన్ ప్రారంభంలో అమ్మకాలు మందకొడిగా సాగినప్పటికీ, రెండో వారం నుంచి అమ్మకాలు ఒక్కసారిగా పుంజుకున్నట్లుగా ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అక్టోబర్ 16 నాటికి రూ.1,527.85 కోట్లకు చేరిన క్యుమ్యులేటివ్ సేల్స్.. అక్టోబర్ 19 నాటికి రూ.2,000 కోట్లకు పైగా మార్కు దాటేశాయి. పండుగ వేళ బీర్లకు డిమాండ్ విపరీతంగా పెరగడం విశేషమని, ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన ఈ నివేదిక కేవలం అక్టోబర్ 19 వరకు మాత్రమే నమోదైన లెక్కల ఆధారంగానే రూపొందించామని ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు.

సాయుధ పోరాట స్ఫూర్తితో రైతు సభలు

- నవంబర్ 15 నుండి 18 వరకు నల్గొండలో నిర్వహణ
- 37 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రైతు జాతీయ సభలు
- మోదీ రైతు వ్యతిరేక విధానాలపై సమరభేరి
- సభల్లో రైతు సంక్షేమానికి ఉద్యమ కార్యాచరణ!
- కార్పొరేట్ కొమ్ముకాసే కేంద్ర ఒప్పందాలు రద్దు చేయాలి
- పంటలకు చట్టబద్ధ మద్దతు ధరల చట్టం తేవాలి
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్రావు

ఖమ్మం, అక్టోబర్ 21(మనం బ్యూరో): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పురిటిగడ్డ అయిన ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలో అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను అత్యంత ఉద్యమ స్ఫూర్తి తో నిర్వహించబోతున్నామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ వెల్లడించారు. నవంబర్ 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ చారిత్రాత్మక మహాసభల వివరాలను ఆయన బుధవారం ఖమ్మం లోని సుందరయ్య భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతంలో ఖమ్మం జిల్లాలో 26వ మహాసభలు జరిగాయని, సరిగ్గా 37 సంవత్సరాల తర్వాత మళ్లీ 1979లో ఖమ్మంలోనే జరిగాయని గుర్తుచేశారు.

ఇప్పుడు 37 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత స్వతంత్ర తెలంగాణ గడ్డపై ఈ జాతీయ మహాసభలు జరగడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందని ఆయన పేర్కొన్నారు . నవంబర్ 15న మహాసభల ప్రారంభం సందర్భంగా 15 వేల మంది క్రమశిక్షణ కలిగిన రెడ్షర్ట్ వాలంటీర్లతో భారీ ప్రదర్శన, కవాతు నిర్వహిస్తున్నామని, అలాగే లక్ష మందికి పైగా రైతులతో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

మహాసభల్లో పోరాట కార్యాచరణ

నల్లగొండలో జరగబోయే జాతీయ మహాసభల్లో భారత వ్యవసాయ రంగం, రైతాంగ భవిష్యత్తుపై లోతైన చర్చలు జరిపి, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేసే కార్యాచరణను రూపొందిస్తామని పోతినేని సుదర్శన్ వెల్లడించారు. పేద రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ. 10,000 పెన్షన్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'కనీస మద్దతు ధరల చట్టం' తీసుకురావాలని స్పష్టం చేశారు. అఖిల భారత రైతు సంఘం ఆవిర్భవించి దాదాపు 90 సంవత్సరాలు పూర్తి కావస్తోందని, దేశ స్వాతంత్ర్యం, రైతాంగ హక్కులు, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం చారిత్రాత్మక ఉద్యమాలు నడిపిన ఘనత ఈ సంఘానికే దక్కుతుందని అన్నారు.

కార్పొరేట్ కొమ్ముకాసే ఒప్పందాలు రద్దు చేయాలి

కేంద్రంలో అధికారంలోకి రావడానికి ముందు నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన అనేక వాగ్దానాలను పూర్తిగా విస్మరించిందని పోతినేని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పక్కాగా అమలు చేస్తామని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ మాటలన్నింటినీ తుంగలో తొక్కిందని విమర్శించారు. దేశ వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తూ, కార్పొరేట్ శక్తులకు, బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేసే కుట్రలకు కేంద్రం పాల్పడుతోందన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా 2020లో తీసుకొచ్చిన మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 440 సంఘాలను ఏకం చేసి, ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాది పాటు చారిత్రాత్మక పోరాటం నడిపి కేంద్ర ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేసిన ఘనత ఏఐకేఎస్కు ఉందన్నారు. ప్రస్తుతం అమెరికా వంటి విదేశీ బహుళజాతి సంస్థలు, కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం భారతీయ రైతాంగాన్ని, వ్యవసాయాన్ని మోదీ ప్రభుత్వం బలిపెడుతోందని, వివిధ దేశాలతో చేసుకుంటున్న ఒప్పందాలు దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్నాయని మండిపడ్డారు.

కనీస మద్దతు ధరల నిర్ణయంలో తీవ్ర అన్యాయం

దేశంలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత తగ్గిపోవడమే కాకుండా పంటలకు కనీస మద్దతు ధరలు నిర్ణయించే పద్ధతి అత్యంత అన్యాయంగా ఉందనడానికి ప్రస్తుత పరిస్థితులే నిదర్శనమని సుదర్శన్ ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించడంలోనూ, ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలను నియంత్రించడంలోనూ ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైందన్నారు. వరి, బియ్యం, రసాయన ఎరువులు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో, ఈ సంవత్సరం మొక్కజొన్న పంటకు కేవలం 10 రూపాయలు మాత్రమే పెంచడం రైతులను తీవ్రంగా మోసం చేయడమేనని ఎత్తిచూపారు. ఒకవైపు రైతులను ప్రత్యామ్నాయ పంటలు వేయాలని ప్రభుత్వం చెబుతూనే, మరోవైపు రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయంలో నిరంతరం పెరుగుతున్న పెట్టుబడి వ్యయంతో పోలిస్తే వస్తున్న ఆదాయం చాలా స్వల్పంగా ఉండటంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ఈ రైతాంగ అప్పుల భారాన్ని తగ్గించి వ్యవసాయ సంక్షోభానికి శాశ్వత పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన విద్యుత్ విధానం, విద్యుత్ సవరణ బిల్లులు దేశ రైతాంగం పాలిట మరణశాసనంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్, సరసమైన ధరలకు విద్యుత్ లభించే హక్కులను లాక్కొని, విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ రంగానికి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా ప్రశ్నార్థకంగా మారుతుందని విమర్శించారు.

పంట నష్టపోయిన ప్రతి రైతుకు సరైన భద్రత కల్పించేలా రైతు బీమా చట్టంలో సమూల మార్పులు చేసి మెరుగైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉచిత విద్యుత్ హక్కుతో పాటు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరాను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లేని శెర్ల

అరె సిన్నప్పుడు సూసిన
గాడ బతుకమ్మలు వాలిన
సెట్టులాగ... బండ వుండెడిది
బండమీద బుర్ద మట్టిల
ఎంపల్ సెట్టు గుచ్చి ఎంత భక్తిగ
సూసెటోడో నాయిన
గప్పుడు గూడ బతుకమ్మ
మా కులపోళ్ల పాటే..మా రోటికాడ బాడేది
మా బండ ఏరే...ఆళ్ల బండ ఏరే
మా బతుకమ్మలా
తంగెడు పూలు..గునుగు పూలూ
రోకలి బండ పూలు..కావంచపూలు
సోంపూలు
గా కులపోళ్లది గూడా
మాలెక్కనే వుండె...
మరెగాళ్లు గాడెందుకాడాలె
మనం గీడెందుకు
నాయననెన్నిసార్లడిగినా
ఆరోతరగతి తెలుగుపుస్తకం
గదంతేరా అనెటోడు.. నాయిన..
గిప్పుడు పి.హెచ్‌డీ పట్టా పుచ్చుకుని
మల్లా ఆడికే బోతే ....

బతుకమ్మల గుంపులు
మరిన్ని బెరిగినయ్
కులానికో గుంపు..బజారుకో గుంపు
అందరూ ఒకే గుంపై
ఆడేరోజెప్పుడొస్తదాని
బతుకమ్మకేసి సూస్తే
రంగులు పాలిపోయి
తెల్లగా కనిపించింది
నీళ్లేని శెర్ల..దుఃఖంగా దూకేసింది.!

- చిత్తలూరి సత్య
9133832246

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

జెన్ జీ కి ఒక లేఖ

ఆగు యువతా నీ అడుగులు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. నేటి భారత దేశం యువతరపు ఉత్సాహంతో, సాంకేతిక పరిజ్ఞానంతో, కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా జెన్ జీ యువతలో కనిపిస్తున్న చైతన్యం, ప్రశ్నించే తత్వం, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం ప్రజాస్వామ్యానికి కొత్త ఆశలను కలిగిస్తున్నాయి. అయితే జంతర్ మంతర్‌లో నిరసనలు, సుప్రీంకోర్టు వద్ద ఆందోళనలు, ఢిల్లీ దిగ్బంధం వంటి పరిణామాల నేపథ్యంలో యువతరం ఆవేశం, ఆలోచన, బాధ్యతల మధ్య సమతుల్యతను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిరసన తెలిపే హక్కు ప్రజాస్వామ్యం ప్రసాదించిన విలువైన ఆయుధం. కానీ ఆ హక్కును వినియోగించే విధానం కూడా అంతే విలువైనది. మన గొంతు వినిపించాలనే తపనలో మన మాటకు ఉన్న బాధ్యతను, మన అడుగులకు ఉన్న పరిణామాలను మరచిపోకూడదు.

జెన్‌జీ అంటే హద్దులన్నీ దాటేసి ఉరక లేయడం, ఫలితాల గురించి ఆలోచించకుండా దూకుడుగా ముందుకు దూసుకెళ్లడం అని భావిస్తున్నట్లు కనిపిస్తోంది. వేగంగా స్పందించడం, వెంటనే నిర్ణయం తీసుకోవడం, క్షణాల్లో సమాచారాన్ని వేల మందికి చేరవేయడం ఈ తరానికి ఉన్న గొప్ప బలాలు. కానీ ఆ వేగానికి వివేకం తోడు కాకపోతే అదే బలం బలహీనతగా మారే ప్రమాదం ఉంది. కాళ్లలో ఎంత సత్తువ ఉన్నా ప్రతి పరుగూ గమ్యాన్ని చేరవేయదు. దారిలో ఎత్తుపల్లాలు ఉంటాయి, కనిపించని గోతులు ఉంటాయి. ఊహించని మలుపులు ఎదురవుతాయి. వాటిని గమనించకుండా దూకితే గమ్యం చేరకముందే గాయపడాల్సి వస్తుంది. మన పెద్దలు అనుభవసారంగా ఆచితూచి అడుగు వేయాలన్నారు.

జెన్ జీ ఉడుకు నెత్తురుకు, ఉత్సాహభరితమైన ఆలోచనలకు, స్వేచ్ఛను కోరుకునే మనస్తత్వానికి కొన్ని మాటలు నచ్చక పోవచ్చు. వాటిలో 'ఆగు' అనే మాట ఒకటి. ఆగమని చెప్పడం అంటే నీ వేగాన్ని అడ్డుకోవడం కాదు. నీ ప్రయాణం సురక్షితంగా సాగాలని కోరుకోవడం. ఆలోచించమని చెప్పడం అంటే నీ స్వేచ్ఛను కట్టడి చేయడం కాదు. నీ నిర్ణయానికి బలమైన పునాది వేయడం. ప్రశ్నించవద్దని చెప్పడం కాదు. ప్రశ్నించేటప్పుడు వాస్తవాలను తెలుసుకోమని చెప్పడం. ఇది గద్దింపు కాదు, తరాల మధ్య ఆధిపత్య పోరు కాదు. అనుభవం అనే దీపాన్ని మీ చేతుల్లో పెట్టాలని కోరుకునే పెద్దల ఆప్యాయమైన ప్రయత్నం మాత్రమే. మీ వెనుక మేమున్నాం. మీరు మా ముందున్నారు మీతోనే ఈ దేశం ఉంది! యువతను ఉద్దేశించి పెద్దలు చెప్పాల్సిన అత్యంత ముఖ్యమైన మాట ఇదే. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. మీ కలలు దేశానికి కొత్త దారులు చూపగలవు. మీ ఆలోచనలు సమాజాన్ని మార్చగలవు. మీ పోరాటాలు అణగారిన గొంతులకు బలాన్నివ్వగలవు. మీ శక్తి విధ్వంసానికి కాదు, నిర్మాణానికి ఉపయోగపడాలి. మీ ఆవేశం ద్వేషాన్ని పెంచడానికి కాదు, అన్యాయాన్ని ప్రశ్నించడానికి ఉపయోగపడాలి. మీ నిరసన ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడానికి కాదు, దానిని మరింత బలోపేతం చేయడానికి దోహదపడాలి.

సోషల్ మీడియా యుగంలో ఒక వార్త క్షణాల్లో దేశమంతటా వ్యాపిస్తోంది. ఒక వీడియో, ఒక సందేశం, ఒక నినాదం వేల మందిని ప్రభావితం చేయగలుగుతున్నాయి. కానీ ప్రతి వైరల్ వార్త నిజం కాదు. ప్రతి ప్రచారం వెనుక ప్రజాహితం ఉండక పోవచ్చు. అందుకే ఏ విషయాన్నైనా నమ్మే ముందు దాని నిజానిజాలను పరిశీలించాలి. భావోద్వేగాలకులోనై స్పందించే ముందు ఆధారాలను చూడాలి. మీ ఒక్క పోస్ట్ మరొకరి జీవితాన్ని ప్రభావితం చేయవచ్చు. బాధ్యతారహితమైన వ్యాఖ్యలు, రెచ్చగొట్టే ప్రచారం, వ్యక్తులపై ద్వేషపూరిత దాడులు చివరికి మీ భవిష్యత్తుకే అడ్డంకులు సృష్టించవచ్చు. స్వేచ్ఛగా మాట్లాడటం మీ హక్కు. హక్కులను గౌరవిస్తూ మాట్లాడటం మీ బాధ్యత.

ప్రజాస్వామ్యంలో నిరసనలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, అన్యాయాన్ని వ్యతిరేకించడం, తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడం పౌరుల హక్కు. జంతర్ మంతర్ వంటి నిరసన వేదికలు ప్రజల గొంతును వినిపించడానికి ఉపయోగపడతాయి. అయితే నిరసన శాంతియుతంగా, చట్టబద్ధంగా, ప్రజల జీవనానికి అనవసరమైన ఇబ్బందులు కలగకుండా సాగినప్పుడే దాని నైతిక బలం పెరుగుతుంది.

సుప్రీంకోర్టు వంటి రాజ్యాంగ సంస్థల పట్ల గౌరవం, న్యాయవ్యవస్థ స్వతంత్రత పట్ల విశ్వాసం ప్రజాస్వామ్యానికి అవసరం. మన డిమాండ్లు ఎంత న్యాయమైనవైనా, వాటిని సాధించడానికి అనుసరించే మార్గాలు కూడా బాధ్యతా యుతంగా ఉండాలి. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. అనేక

భాషలు, మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు కలిసిన ఈ దేశాన్ని ఐక్యంగా నిలబెట్టేది మన రాజ్యాంగం. దేశ సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. ఇతర దేశాల్లో కనిపించే నియంతృత్వ ధోరణులను చూసి మనమూ అదే దారిలో నడ వాలని అనుకోవడం ఎంతటి పొరపాటో, ప్రజాస్వామ్య స్వేచ్ఛను ఉపయోగించుకుంటూ రాజ్యాంగ విలువలను విస్మరించడం కూడా అంతే ప్రమాదకరం. మనకు నచ్చని అభిప్రాయాలను వినడం, వాటిని తర్కంతో ఎదుర్కోవడం, చట్టబద్ధమైన మార్గాల్లో మన వాదనను వినిపించడం నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతి. దేశభక్తి అంటే ప్రశ్నించకపోవడం కాదు. దేశాన్ని మరింత న్యాయంగా, సమానత్వంతో, అభివృద్ధి పథంలో నడిపించాలనే బాధ్యతతో వ్యవహరించడం.

యువ మిత్రులారా! జీవితంలో ప్రతి క్షణం పరుగెత్తాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు ఆగి ఆలోచించడం కూడా విజయంలో భాగమే. ఒక ఉద్యమంలో పాల్గొనే ముందు దాని లక్ష్యాలను, పద్ధతులను అర్థం చేసుకోండి. మీ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోండి. కుటుంబ సంబంధాలను, స్నేహాలను, చదువును, వృత్తిపరమైన భవిష్యత్తును నిర్లక్ష్యం చేయకండి. మీ జీవితాన్ని మార్చే నిర్ణయాలు తీసుకునేటప్పుడు క్షణికావేశం కంటే దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వండి. గుర్తుంచుకోండి వేగం మీకు విజయాన్ని అందించవచ్చు, వివేకం ఆ విజయాన్ని నిలబెడుతుంది. ఆవేశం ఉద్యమాన్ని ప్రారంభించవచ్చు. ఆలోచన దానికి సరైన దిశను చూపుతుంది. ధైర్యం మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది. బాధ్యత మీ ప్రయాణాన్ని గౌరవప్రదంగా మారుస్తుంది.

జెన్ జీ యువతా! మీలోని అగ్నిని ఆర్పమని మేము చెప్పడం లేదు. ఆ అగ్ని అజ్ఞానాన్ని దహించాలి, అన్యాయాన్ని ప్రశ్నించాలి, అసమానతలను తొలగించాలి, సమాజంలో వెలుగులు నింపాలి. మీ గొంతు వినిపించాలి, మీ ప్రశ్నలు మార్పును తీసుకురావాలి, మీ ఆలోచనలు దేశానికి మార్గదర్శకం కావాలి. కానీ ఆ ప్రయాణంలో రాజ్యాంగాన్ని గౌరవించండి, చట్టాన్ని పాటించండి, భిన్నాభిప్రాయాలను సహించండి, మానవత్వాన్ని మరచిపోకండి. చివరిగా ఒక్క మాట 'ఆగు' అంటే వెనక్కి తగ్గమని కాదు. సరైన దిశలో ముందుకు సాగమని. 'ఆలోచించు' అంటే భయపడమని కాదు. మరింత ధైర్యంగా నిర్ణయం తీసుకోమని. 'బాధ్యతగా ఉండు' అంటే నీ స్వేచ్ఛను వదులుకోమని కాదు. నీ స్వేచ్ఛకు మరింత విలువ తీసుకురమ్మని. మీ ఆవేశం దేశానికి అవసరం మీ ఆలోచన దేశానికి ఆయుధం కావాలి మీ బాధ్యత దేశానికి బలమవ్వాలి మీ యువశక్తి భారత ప్రజాస్వామ్యానికి చిరస్థాయిగా నిలిచే ప్రేరణ కావాలి.

- డా. రవి కుమార్ చేగొని

ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, గిరిజన హక్కుల కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో మడమ తిప్పని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన పోరాట యోధుడు కొమురం భీం.

గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1901 అక్టోబర్ 22న అవిభక్త ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో జన్మించి, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబుపై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించి, కుర్దు పటేల్ అనే నమ్మక ద్రోహి ఇచ్చిన సమాచారంతో, అర్ధరాత్రి కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 27న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున వీరమరణం పొందాడు భీం.

కొమురం భీం స్ఫూర్తితో దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్లు, తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న

అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు.

జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు.

నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరా లుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది.

ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు.

మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్ ప్రాంతంలో 48శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారిపోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నడవడానికి రోడ్డు, తాగ టానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూము లకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో కేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది కూడా. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. అలా గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యం. అత్యవసరం.

అక్టోబర్ 22... కొమురం భీం జయంతి

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

మిణుగురులు

ఆరోగ్య బీమా
ఉద్యోగ పెన్షనర్లు
సాధన ధీమా

హైడ్రోజన్ రైలు
పర్యావరణ హితం
కాలుష్యం శూన్యం
భయం వీడాలి
జ్ఞానంతో ఎదగాలి
చేపలవ్వాలి

జ్ఞాన ప్రయాణం
డాలర్ల మోజులోన
మొదటి కే మోసం
నెల్సన్ మండేల
అతనిలా ఉండాలి
అస్తిత్వ పోరు

దృక్పథాలు

లీకుల జ్వాల
విద్యార్థుల విలయం
కాక్రోచ్ ల జయం

వాణిజ్యం పాడు
బొద్దింకల్ని తరమండి
వీధులు శుభ్రం

- రేడియమ్
9291527757

స్టార్‌లింక్ వివాదానికి అతీతంగా భారత్‌కు పారదర్శక స్పెక్ట్రమ్ అవసరం

స్టార్‌లింక్ ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలను ప్రారంభించడంలో జాప్యం, అసమాన పోటీ ఆరోపణలపై ప్రపంచ కుబేరుడు ఇలాన్‌మస్క్, భారతదేశాల మధ్య వివాదం నెలకొంది. ఇటీవల ప్రస్తుత టెలికామ్ గుత్తాధిపత్యాలను రక్షించడానికి పేరుతెలియని శక్తివంతమైన వ్యాపార ప్రయోజనాలు స్టార్‌లింక్‌ను అడ్డుకుంటున్నాయని మస్క్ ఆరోపించారు. ఆ తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేష్ అంబానీ ప్రభావంపై ఆయన నేరుగా ప్రశ్నించారు. ఈ వైరం కొంతవరకు స్పెక్ట్రమ్ కేటాయింపుపై వచ్చిన విభేదాల నుండి పుట్టుకొచ్చింది. మస్క్ పాలనా పరమైన కేటాయింపును సమర్థించగా, రిలయన్స్ జియో వేలం పాటలను సమర్థించింది. స్టార్‌లింక్ లైసెన్స్‌ను పొందినప్పటికీ, వాణిజ్య సేవలను ప్రారంభించే ముందు ఇది భద్రతా అవసరాలను పూర్తి చేసి, స్పెక్ట్రమ్ కేటాయింపును పొందాల్సి ఉంది. శాటిలైట్ ఆపరేటర్లు అంతా ఒకే రక మైన నిబంధనల చట్రాన్ని అనుసరించాలని, జాతీయ ప్రయోజనాలను కాపాడటానికి, భారతీయ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవడానికి భద్రతా మూల్యాంకనాలు అత్యవసరమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

మరోవైపు, స్టార్‌లింక్ సంస్థ రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌లతో పంపిణీ ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇరువర్గాల మధ్య వ్యాపార పోటీఉన్నప్పటికీ వాణిజ్యపరమైన సహకారం సాధ్యమేనని ఇది చూపిస్తోంది. భారత్ తన శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ విస్తరణకు సిద్ధమవు తున్న తరుణంలో విదేశీ పెట్టుబడులు, పోటీ, సరసమైన ధరల ఇంటర్నెట్‌సేవలు. జాతీయభద్ర తలను సమతుల్యం చేయడంలో ఉన్న సవాలును ఈ వివాదం స్పష్టంగా ఎత్తిచూపు తోంది.

భారతదేశంలో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ లైసెన్సింగ్ను టెలికమ్యూనికేషన్లశాఖ, భారత టెలికాం నియంత్రణ ప్రాధికార సంస్థ ('ట్రాయ్'), టెలికమ్యూనికేషన్స్ చట్టం (2023) పరిధిలోని సంబంధిత అంతరిక్ష రంగ నిబంధనలు నియంత్రిస్తాయి. ఉపగ్రహ సమాచార సేవల కోసం భారతదేశం 'యునిఫైడ్ లైసెన్స్' చట్రం కింద ఉపగ్రహం ద్వారా ప్రపంచవ్యాప్త మొబైల్ వ్యక్తిగత సమాచార సేవలు(జీఎంపీసీఎస్) అనుమతిని ఉపయోగిస్తుంది. టెలికమ్యూనికేషన్ల శాఖ పోర్టల్ ప్రకారం 10 జూన్ 2025 నాటికి మూడు సంస్థలకు అనుమతి ఉంది.

జియో శాటిలైట్ కమ్యూ నికేషన్స్, వన్‌వెబ్ ఇండియా కమ్యూనికేషన్స్, స్టార్‌లింక్ శాటిలైట్ కమ్యూనికేషన్. ప్రచురించ బడిన జీఎంపీసీఎస్ రుసుము నిర్మాణంలో1 కోటి వన్-టైమ్ ఎంట్రీ ఫీజు, సవరించిన మొత్తం రాబడి పై 8% వార్షిక లైసెన్స్ ఫీజుతో పాటు ఇతర వర్తించే ఛార్జీలు ఉంటాయి. ఈ అనుమతి 20 సంవత్సరాలపాటు చెల్లుబాటు అవుతుంది, అలాగే ఒకేసారి మరో 10 సంవత్సరాల వరకు పొడిగించే అవకాశం ఉంటుంది. స్పెక్ట్రమ్ కేటా యింపుకు ప్రత్యేక అనుమతి అవసరం. భారతదేశ స్పెక్ట్రమ్ విధానం ప్రధాన సమస్యగా మిగిలిపో యింది. ట్రాయ్ మే 2025లో సిఫార్సులను విడు దల చేయగా, ఏప్రిల్ 2026లో శాటిలైట్ నెట్‌వర్క్ అనుమతులు, స్పెక్ట్రమ్ కేటాయింపు లపై మరొక సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభిం చింది.

అమెరికాలో, ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ ఉపగ్రహ నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రమ్ వినియోగం, ఎర్త్ స్టేషన్లను నియంత్రిస్తుంది. జనవరి 2026లో, ఇది మరో 7,500 జెన్ 2 స్టార్‌లింక్ ఉపగ్రహాలను ప్రయోగించడానికి స్పేస్‌ఎక్స్‌కు అనుమతి ఇచ్చింది. దీంతో మొత్తం అనుమతించిన సంఖ్య 15,000కు చేరింది. యునైటెడ్ కింగ్డమ్ 'ఆఫ్‌కామ్' లైసెన్సింగ్ ద్వారా ఉపగ్రహ నెట్‌వర్క్‌లు, గేట్‌వే ఎర్త్ స్టేషన్లను నియంత్రిస్తుంది. యూరోపియన్ యూనియన్ జాతీయ టెలికామ్ అనుమతులను, ఎంపిక చేసిన శాటిలైట్ సేవలు, సమన్వయం చేసిన స్పెక్ట్రమ్ బ్యాండ్ల కోసం ఉమ్మడి నిబంధనలతో అనుసంధానిస్తుంది. ఆస్ట్రేలియాకు చెందిన 'ఆస్ట్రేలియన్ కమ్యూనికేషన్స్ అండ్ మీడియా అథారిటీ' ఉపగ్రహ నెట్‌వర్క్‌లు, ఎర్త్ స్టేషన్లు, ఫ్రీక్వెన్సీ వినియోగం, అంతర్జాతీయ సమన్వయ అవసరాల నిబంధనలను నియంత్రిస్తుంది. ఈ దేశాలతో పోలిస్తే, స్పెక్ట్రమ్ ధర నిర్ణయం, భద్రతా అనుమతులు, గేట్‌వే అవసరాలు, చట్టబద్ధమైన సమాచార నిఘా, శాటిలైట్ వర్సెస్ సాంప్రదాయ టెలికామ్ ఆపరేటర్ల మధ్య నిష్పాక్షికమైన పోటీ వంటివి భారతదేశంలోని ప్రధాన విధానపరమైన సవాళ్లు. పారదర్శకమైన లైసెన్సింగ్ సమయపరిమితులు, అంచనా వేయదగిన స్పెక్ట్రమ్ ఛార్జీలు, స్పష్టమైన భద్రతా నిబంధనలు పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు సేవలు సరిగ్గా అందని ప్రాంతాలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని విస్తరించడానికి దోహదపడతాయని అంతర్జాతీయ అనుభవాలు సూచిస్తున్నాయి.

స్పేస్‌ఎక్స్ ద్వారా నిర్వహించబడే ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవ స్టార్‌లింక్‌ను, 100 కోట్లకు పైగా ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్న భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టాలని ఇలాన్ మస్క్ భావిస్తున్నారు. స్టార్‌లింక్‌కు ప్రపంచవ్యాప్తంగా నూట అరవై ఐదుకు పైగా దేశాల్లో అనుమతులు ఉన్నాయి. ఫైబర్-ఆప్టిక్ కేబుళ్లు, మొబైల్ టవర్లు ఏర్పాటు చేయడం కష్టతరమైన సుదూర గ్రామాలు, పర్వత ప్రాంతాలు, దీవులు, ఇతర ప్రాంతాలలో బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడానికి స్టార్లింక్ తక్కువ ఎత్తులో ఉండే భూ కక్ష్య, ఉపగ్రహాలను ఉపయోగిస్తుంది. నెలవారీ ఇంటర్నెట్ సబ్‌స్క్రిప్షన్లు,యూజర్-టెర్మినల్‌విక్ర యాలు, వ్యాపారాలు, సంస్థలకు అందించే కనెక్టివిటీ సేవల ద్వారా ఇది రాబడిని పొందుతుంది. శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ గ్రామీణ కనెక్టివిటీని మెరుగు పరచడంతో పాటు సుదూర ప్రాంతాలలో విశ్వసనీయ ఇంటర్నెట్ అవసరమయ్యే సంస్థలు, రవాణా ఆపరేటర్లు, ఇతర వినియోగదారులకు ఉపయోగ పడుతుంది. కాబట్టి భారతదేశం ఇందులో గణనీయమైన వృద్ధి సామర్థ్యాన్ని అందిస్తుంది. అక్టోబర్ 8, 2026న, మస్క్ శక్తివంతమైన వ్యాపార ప్రయోజనాలు తమ మార్కెట్ స్థానాలను కాపాడుకోవడానికి స్టార్‌లింక్ ప్రవేశాన్ని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు, అయితే ఈ ఆరోపణకు మద్దతుగా ఆయన ఎలాంటి బహిరంగ ఆధారాలను అందించలేదు. అక్టోబర్ 9, 2026న, వార్తా ప్రసారాల శాఖమంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పందిస్తూ, 'భారతదేశం ఏ రంగం లోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదని ప్రభుత్వం సాంకేతికత పట్ల తటస్థ విధానాన్ని అనుసరిస్తుందని, స్పెక్ట్రమ్-ఛార్జీల విధానాన్ని ఖరారు చేస్తున్నట్లు సింధియా తెలిపారు. భారతదేశంలో స్టార్‌లింక్ ప్రవేశం వల్ల భారత ప్రభుత్వం, రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్ వంటి దేశీయ టెలికమ్యూనికేషన్ సంస్థలు అనేక సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. విస్తృతమైన భూగర్భ లేదా భూభాగ ఆధారిత మౌలిక సదుపాయాలు లేకుండానే ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలను అందించగలగడం వల్ల, గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో భారతీయ టెలికాం సంస్థలకు పోటీ పెరగవచ్చు. స్పెక్ట్రమ్ ఛార్జీలు, లైసెన్సింగ్ రుసుములు, నియంత్రణ నిబంధనల్లో వ్యత్యాసాలు ఉపగ్రహ ఇంటర్నెట్ సంస్థలకు, సంప్రదాయ టెలికాం సంస్థలకు మధ్య సమాన పోటీ వాతావరణంపై ఆందోళనలను కలిగించవచ్చు. సున్నితమైన సమాచారాన్ని రక్షించడానికి డేటా భద్రత, చట్ట బద్ధమైన సమాచార నిఘా, జాతీయ భద్రతలకు అనుగుణంగా సేవల నిర్వహణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలి. పోటీలో నిలదొక్కుకోవడానికి భారతీయ సంస్థలు ఉపగ్రహ సాంకేతికతలో పెట్టుబడులు పెంచడం, సేవల నాణ్యతను మెరుగుపరచడం, వినూత్న ధరల విధానాలను అవలంబించడం ద్వారా దేశ వ్యాప్తంగా అందుబాటు ధరల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించాల్సి ఉంటుంది.

ఇలాన్ మస్క్, ముకేష్ అంబానీ మరియు భారత ప్రభుత్వం మధ్య స్టార్‌లింక్ వివాదానికి అత్యుత్తమ పరిష్కారం పారదర్శకమైన, నిష్పాక్షికమైన మరియు సాంకేతికత పట్ల తటస్థమైన శాటిలైట్ ఇంటర్నెట్ విధానాన్ని ఏర్పాటు చేయడమే. శాటిలైట్ లైసెన్సులు, భద్రతా అనుమతులు, స్పెక్ట్రమ్ కేటాయింపులు, వాణిజ్య కార్యకలాపాల కోసం ప్రభుత్వం స్పష్టమైన సమయ పరిమితులను ప్రచురించాలి. శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్, సాంప్రదాయ టెలికామ్ సేవల మధ్య ఉన్న సాంకేతిక వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకునే పారదర్శకమైన, ఆధారపడదగిన సూత్రం ద్వారా స్పెక్ట్రమ్ ధరలను నిర్ణయించాలి. మస్క్ యొక్క స్టార్‌లింక్, అంబానీ యొక్క రిలయన్స్ జియో, ఇతర ఆపరేటర్లందరూ భద్రత, డేటారక్షణ, వినియోగదారుల రక్షణ, చట్టబద్ధమైన సమాచార నిఘా, నిబంధనలను ఒకే రీతిలో పాటించాలి. బహిరంగ వివాదాలు లేకుండా అభిప్రాయభేదాలను పరిష్కరించుకోవడానికి శాటిలైట్ ఆపరేటర్లు, టెలికామ్ కంపెనీలు, 'ట్రాయ్', టెలికమ్యూనికేషన్ల శాఖల మధ్య చర్చలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. నిబంధనల వెసులుబాట్ల కంటే సేవ నాణ్యత, సరసమైన ధరలు, ఆవిష్కరణలు, గ్రామీణ కనెక్టివిటీ ద్వారా శాటిలైట్ కంపెనీలు, టెలికామ్ ఆపరేటర్లు పోటీ పడాలి. సుదూర గ్రామాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రకృతి వైపరీత్యాల ప్రమాదం ఉన్న ప్రాంతాలకు ఇంటర్నెట్ అందించడానికి ప్రభుత్వం కొలవగల గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ లక్ష్యాలను, ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టవచ్చు.

అంతిమంగా, ఊహించ దగిన క్రమబద్ధమైన నిబంధన

బెల్ట్ షాప్ పెట్టిన పంచాయతీ

సిద్దిపేట, అక్టోబర్ 21 (మనం ప్రతినిధి): బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తి కుటుంబానికి మద్యం సేవించడానికి వచ్చిన మరో వ్యక్తి మధ్య ఏర్పడిన తగాదా గుడికందుల గ్రామంలో కేసుల వరకు వెళ్ళింది. అనుమతి లేకుండా మద్యం విక్రయించడం గ్రామాల్లో మామూలుగా మారగా, మద్యం సేవించిన తర్వాత అనేక పంచాయతీలు ఏర్పడడం కూడా గ్రామాలలో కూడా సాధారణ అంశంగా మారింది. అనేక పంచాయతీలు గ్రామస్థాయిలోనే సమసి పోతుండగా కొన్ని పోలీస్ స్టేషన్లు, కోర్టుల వరకు వెళ్తున్నాయి. ఇలాంటి సంఘటనే గుడికందుల గ్రామంలో జరిగింది. సిద్దిపేట ఏసిపి రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మిరుదొడ్డి మండలం గుడికందుల గ్రామంలో గోనెపల్లి నరసింహులు గౌడ్ అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారు. ఈనెల 20న అదే గ్రామానికి చెందిన సూకురి విజయ్ కుమార్ మద్యం కొనుగోలు చేసి సేవించాడు. ఆ సమయంలో షాప్ యజమాని కుమారులు గోనపల్లి యాదగిరి గౌడ్, గోనేపల్లి అనిల్ గౌడ్ లు విజయకుమార్ మధ్య తగాదా ఏర్పడింది. ఈ ఘర్షణలో విజయ్ కుమార్ కు తలపై తీవ్ర గాయం కావడం తో ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ తో సహా పల్ సెక్షన్ ల కింద కేసులు నమోదు చేశారు. కోర్టులో యాదగిరి గౌడ్ అనిల్ గౌడ్ లను హాజరు పరిచారు. ఇంకా కేసు పై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతుందని ఏసిపి తెలిపారు. అయితే ఈ సందర్భంగా గ్రామంలో పోలీసులు జరిపిన దాడుల్లో మరో రెండు బెల్ట్ షాపులను గుర్తించి వాటిపై కూడా కేసు నమోదు చేశారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలో పాల్గొన్న లావుడియా

హనుమకొండ , అక్టోబర్ 21(మనం న్యూస్): హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం ఇందిరమ్మ కాలనీలో దుర్గామాత పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో అయ్యగారు తో నిర్వహించారు. ఈ సందర్భంగా లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్ తన కుటుంబ సభ్యులతో కలిసి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ పూజా కార్యక్రమంలో లావుడియా పల్లవి రాజు నాయక్, జీవన శ్రీ, సెహ్వాగ్, లంబాడీల ఐక్యవేదిక లైవ్ జిల్లా యూత్ అధ్యక్షులు మరియు దుర్గ మాత కమిటీ అధ్యక్షులు తిరుపతి తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించు కున్నారు. కుటుంబ సమేతంగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం భక్తి వాతావరణంలో కొనసాగింది. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

కూటమి అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేయాలి

- ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి, ఎంపీ భాష్యం రామకృష్ణ

నరసాపురం, అక్టోబర్ 21 (మనం న్యూస్) : మునిసిపల్ మరియు పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని పశ్చిమ గోదావరి జిల్లా ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బుధవారం నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్, మాజీమంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణలతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న మున్సిపల్, పంచాయితీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ఘనవిజయమే లక్ష్యంగా అనుసరించాల్సిన ఎన్నికల వ్యూహాలు, ప్రచార కార్యాచరణపై సుదీర్ఘంగా సమీక్షించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేసి మున్సిపల్ చైర్పర్సన్, వార్డు కౌన్సిలర్లతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేయాలని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణలో ఆంధ్ర కల్చర్ - దసరా ఉత్సవాల పేరిట రికార్డింగ్ నృత్యాలు



- కాంగ్రెస్ నాయకుల సరికొత్త ఆలోచన
- తీవ్ర అసౌకర్యానికి గురైన మహిళా లోకం

మహదేవ్‌పూర్, అక్టోబర్ 21(మనంన్యూస్): మండల కేంద్రంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో తెలంగాణ సంప్రదాయన్ని, తెలంగాణ కళను, ఆంధ్ర రికార్డింగ్ నృత్యాలతో అవమాన పరిచి తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు మంట కలిపిన కాంగ్రెస్ నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలని టిఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు, మంగళవారం నాడు జరిగిన దసరా ఉత్సవాలపై స్పందించిన టిఆర్ఎస్ నాయకులు బుధవారం నాడు విలేకరులతో మాట్లా డారు , దసరా ఉత్సవాలను సరైన సమయంలో నిర్వహించకుండా కేవలం అధికారిక దాహంతో ఆలస్యం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు, సరైన సమయంలో జరగవలసిన రావణ వధ కార్యక్రమం మంత్రిగారి తమ్ముడి రాకకోసం ఆలస్యం చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేయటం జరిగిందని అంతటితో ఆగకుండా నిర్వహణ పేరుతో ఇసుక లారీలు తర్పలిన్ వేసుకునే కూలీల కూలి డబ్బులు తీసుకొని, బెల్టు షాపుల నుండి లక్షల రూపాయలు వసులు చేసి కార్యక్రమం నిర్వహించటం పండగ వేల ఆ కూలీలను ఇబ్బందుల పాలు చేయటం చాలా బాధకారం అని వారు ఆరోపించారు, ఇట్టి వసూలు లొ మంత్రి తమ్మునికి, ఉత్సవ కమిటీకి ఎంత వాటా ఉందొ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు రవీందర్ రెడ్డి, సతీష్, రాములు, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సర్పంచ్ శ్రీలత

ఏటూర్ నాగారం, అక్టోబర్ 21, మనం ప్రతినిధి: పర్యావరణ పరిరక్షణ, గ్రామంలో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని జంపన్న వాగు కరకట్ట వద్ద బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కాకులమ్మరి శ్రీలత లక్ష్మణ్బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి స్వయంగా మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత మాట్లాడుతూ జంపన్న వాగు కరకట్ట పరిసరాలను పచ్చదనంతో నింపేందుకు మొక్కలు నాటినట్లు తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని, నాటిన మొక్కలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

మొక్కలు నాటడంతో పాటు వాటిని క్రమం తప్పకుండా సంరక్షించినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాకులమ్మరి ప్రదీప్బాబు, కూనూరు అశోక్గౌడ్, తాడూరి రఘు, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి జనార్దన్, వార్డు సభ్యులు ఉమ్మనేని రమేష్, వావిలాల నర్సింగరావు, గండేపల్లి నాగరాజు, ఏంపెళ్లి రాజు, కొండాయి చిన్ని, గంప కిరణ్, కాళ్ల రామకృష్ణ, పెద్దబోయిన బాలకృష్ణ, బట్టు గోపి, ఎస్.కె.బాబా, ఫీల్ అసిస్టెంట్ సాంబశివరావు, రాంబాబు, పంచాయతీ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పాపం జొహ్రాగుల్.. ఎక్కడ ఉంది?

బీజింగ్, అక్టోబర్ 21 : అది 1986..చైనాలోని గైజు రాష్ట్రం.. పండ్లను విక్రయిస్తూ జీవనం సాగించే అబ్దుల్లా రోజూవారి విక్రయాలు ముగించి ఇంటికి బయలుదేరాడు. మధ్యలో ఒక చోట శిశువు ఏడుపు వినిపించి ఎక్కడా అని వెతికాడు.. దారి పక్కన డబ్బాలో రోజులు కూడా నిండని ఆడశిశువు ఏడుస్తోంది..ఆ పాపను ఎత్తుకొని ఎవరైనా వస్తారేమో అనిచూశాడు..ఎవరూ రాలేదు... పాపను ఇంటికి తీసుకువెళ్లాడు.. అప్పటికే అతనికి ఇద్దరు మగపిల్లలున్నారు...భార్య ఏమన్నా అంటుందా అన్న సంశయం అతనిది.. ఇంటికి చేరిన బిడ్డను చూసి ఆశ్చర్యపోయిన భార్య వెంటనే పాపకు పాలుపట్టింది.కొన్ని రోజుల అనంతరం పాపను ప్రభుత్వ వర్గాలకు అప్పజెప్పాలని అనుకున్నా పెంచిన అనురాగం ఆ దంపతులను ఆ పని చేయనీయలేదు. కొన్ని రోజుల తరువాత అబ్దుల్లా కుటుంబం తమ స్వస్థలమైన షిన్జియాంగ్ ప్రాంతానికి వెళ్లిపోయింది. చైనాలో మైనార్టీ వర్గానికి చెందినవారు వీగర్లు. ఆ పాపకు జొహ్రాగుల్ అని పేరు పెట్టారు. పెరుగుతున్న కొద్దీ ఆమె రూపం భిన్నంగా ఉండటంతో ఆ అమ్మాయే తన సోదరులకు తనకు ఎందుకు పోలికలు లేవని ప్రశ్నించింది. అయితే ఆమెకు ఆశించిన సమాధానం రాలేదు. ఆమెకు ప్రభుత్వ వర్గాలు జననధవీకరణ పత్రాన్ని కూడా మంజూరు చేశారు. 2010 నుంచి ఈ ప్రాంతంలోని మైనార్టీలపై చైనా పాలకులు ఉక్కుపాదం మోపారు. యువతను క్యాంపులకు తరలించారు. ఏ నేరం చేయకపోయినా అభియోగాలు మోపి శిక్షలు విధించారు. 2016లో అబ్దుల్ తన పెద్దకుమారుడు తుర్కీయేలోని ఇస్తాంబుల్లో ఉండటంతో అక్కడకు వెళ్లాడు. ఇక్కడ వీరు ఉంటున్న నివాసాన్ని పోలీసులు చుట్టుముట్టారు. జొహ్రాగుల్ను ఆమె సోదరుడ్ని అరెస్టు చేశారు. అబ్దుల్లాకి ఈ విషయం తెలిసి తల్లడిల్లిపోయాడు. చైనా నిఘావర్గాల నిబంధనల ప్రకారం టర్కీయే వెళ్లే వారి కుటుంబాలపై నిఘా ఉంటుంది. అబ్దుల్లా అక్కడ నుంచే చైనా అధికారవర్గాలతో చర్చలు జరిపారు. ఆమె తన సొంతకుమార్తె కాదని చైనాలో మెజార్టీ వర్గమైన హన్ చైనీస్కు చెందినదని తెలిపారు. చైనాలో హన్ వర్గానిదే ప్రాబల్యం. కనీసం ఆ అంశాన్నైనా పట్టించుకొని ఆమెను విడిచిపెడుతారని ఆశించాడు. కానీ చైనా వర్గాలు పట్టించుకోలేదు. ఒక అధికారి చెప్పిన సమాచారం ప్రకారం ఆమెకు 15 ఏళ్ల శిక్ష విధించినట్టు తెలుస్తోంది. మరో మూడేళ్లలో విడుదల కానున్నట్టు కొన్ని వర్గాలు వెల్లడించాయి. అయితే ఆమె జీవించివుందా లేదా అన్న విషయం కూడా తెలియలేదు. చైనాలో ప్రభుత్వవర్గాలు చెప్పిందే సమాచారం. అంతకు మించి మీడియాకు పెద్ద పనివుండదు. పరిశోధనాత్మక జర్నలిజం అంటూ ఎవరైనా రంగంలోకి దిగితే కటకటాలు లెక్కపెట్టవలసిందే. అప్పుడు డబ్బా నుంచి తీసుకువచ్చిన శిశువు ఇప్పుడు ఇనుప తెరల నుంచి ఎప్పుడు బయటకువస్తుందా అని అబ్దుల్లా ఎదురుచూస్తున్నాడు.

ప్రారంభం కానున్న అయ్యప్ప దీక్షలు

- మండల దీక్షకు, మకరజ్యోతికి ప్రత్యేక ఏర్పాట్లు

చిగురుమామిడి, అక్టోబర్ 21 (మనం న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా అయ్యప్ప భక్తులు ఎంతో భక్తితో ఎదురుచూసే అయ్యప్ప దీక్షలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ఆశ్వీయుజ మాసం కొనసాగుతుండగా, రాబోయే కార్తీక మాసం నుండి మండల దీక్షతో పాటు మకరజ్యోతి వరకు దీక్షలు కొనసాగనున్నాయి. హుస్నాబాద్ పట్టణంలోని సిద్దేశ్వర స్వామి కొండపై వెలసిన హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ దీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేయనున్నారు. కార్తీక మాసం మొదటి రోజు నుండే భక్తులకు మాలధారణ కార్యక్రమం ప్రారంభం కానుంది.

మండల దీక్ష - 41 రోజులు:

మండల దీక్ష అంటే 41 రోజుల పాటు కఠిన నియమాలతో సాగే దీక్ష. ఈ కాలంలో భక్తులు నల్లటి వస్త్రాలు ధరించి, రోజూ రెండు పూటలా చన్నీటి స్నానం చేస్తూ, బ్రహ్మచర్యం, నేలపై నిద్ర, సాత్విక ఆహారం వంటి నియమాలు పాటిస్తారు. మండల దీక్ష పూర్తి చేసుకున్న భక్తులు శబరిమలలో స్వామివారిని దర్శించుకుంటారు.

మకరజ్యోతి వరకు దీక్ష:

మండల దీక్షతో పాటు కొందరు భక్తులు మకరజ్యోతి వరకు దీక్షను కొనసాగిస్తారు. సంక్రాంతి పర్వదినాన శబరిమలలో కనిపించే మకరజ్యోతిని దర్శించుకోవడం అత్యంత పవిత్రంగా భావిస్తారు. మకరజ్యోతి దర్శనంతో దీక్ష పరిపూర్ణమవుతుందని భక్తుల నమ్మకం. హుస్నాబాద్ నియోజకవర్గంలో, కార్తీక మాసంలో మాల ధరించే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా సిద్దేశ్వర స్వామి కొండపై అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, డిసెంబర్ లో నిర్వహించే మహా పడిపూజ కార్యక్రమం, పంబా ఆరట్టు మహోత్సవం, అలాగే 41 రోజుల అన్నదాన కార్యక్రమాలకు ఆలయ కార్యనిర్వహణ చైర్మన్ మరియు కమిటీ సభ్యులు,ఏర్పాట్లు చేయనున్నారు. ఆలయ ప్రాంగణంలో తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కార్తీక మాసం రాగానే హుస్నాబాద్ పట్టణం మొత్తం 'స్వామియే శరణం అయ్యప్ప' నినాదాలతో మార్మోగనుంది.

దీక్ష నియమ నిబంధనలను వివరించిన అర్చకులు పాలోజు భానుమూర్తి: మాట్లాడుతూ,

అయ్యప్ప దీక్ష అంటే కేవలం మాల వేసుకోవడం కాదు, అది ఒక దివ్యమైన జీవన విధానం. మాల ధరించిన నాటి నుండి భక్తుడు సాక్షాత్తు అయ్యప్ప స్వరూపంగా భావించబడతాడు. అందుకే ప్రతి భక్తుడు 'స్వామి' అని పిలుచుకుంటారు' అని అన్నారు.

దీక్ష నియమాలు:

1. ఉదయం, సాయంత్రం చన్నీటితో స్నానం చేసి స్వామివారికి పూజ చేయాలి.
2. నల్లటి లేదా కాషాయ వస్త్రాలు మాత్రమే ధరించాలి. చెప్పులు లేకుండా నడవాలి.
3. మద్యం, మాంసాహారం, పొగాకు వంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలి.
4. బ్రహ్మచర్యం పాటిస్తూ, నేలపై నిద్రించాలి.
5. అబద్ధాలు, కోపం, ద్వేషం, అసూయ వంటి చెడు గుణాలను వదిలి, సత్యం, ధర్మం పాటించాలి.
6. రోజూ స్వామి శరణు ఘోష చేయాలి, భజనల్లో పాల్గొనాలి.

'ఈ 41 రోజులు ఎవరైతే నిష్ఠతో నియమాలు పాటిస్తారో, వారికి స్వామివారి సంపూర్ణ అనుగ్రహం లభిస్తుంది. కోరిన కోరికలు నెరవేరుతాయి, కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయి' అని అర్చకులు పాలోజు భానుమూర్తి తెలిపారు.

ముగిసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

కాటారం, అక్టోబర్ 21మనం న్యూస్: విజయదశమి పురస్కరించుకొని కాటారం మండల కేంద్రంలో నిర్వహించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం, ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయం, లక్ష్మీదేవి ఆలయంలో నవరాత్రులలో భాగంగా అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా నెలకొల్పారు. 9 రోజుల పాటు అమ్మవారిని వివిధ అవతారాలలో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, చండీ హోమాలు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం అమ్మవారి విగ్రహాలకు మండల కేంద్రంలో కన్నులవిందుగా శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులు పట్టి ఊరేగింపులో పాల్గొన్నారు. మహిళల కోలాట నృత్యాలు, డీజే చప్పుడుల మధ్య, భక్తుల జై దుర్గా.. జై భవానీ నినాదాల నడుమ అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికి నిమజ్జనం చేశారు. ఆలయ కమిటీలు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దుర్గా దేవి విగ్రహాల నిమజ్జనం

మంగపేట, అక్టోబర్ 21 మనం ప్రతినిధి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ములుగు జిల్లా మంగపేట మండలంలోని పలు గ్రామాలలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద ప్రతిష్టించిన దుర్గామాత విగ్రహాల వద్ద బుధవారం ఉదయం ఆయా ఆలయాలలోని, మండపాలలోని అమ్మవారి విగ్రహాల వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని పలు ఆలయాలలో, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గా మాత విగ్రహాలను బుధవారం ఆయా గ్రామాలలో ఊరేగించి అనంతరం పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. మండలంలో దుర్గ మాత విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా మంగపేట ఎస్సై టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు.

ఎడారిలో చేపల పెంపకం...

- ప్రతి బొట్టునీ ఒడిసిపట్టిన ఇజ్రాయెల్!



టెల్ అవీవ్, అక్టోబర్ 21 : ఆ దేశ విస్తీర్ణమే చాలా తక్కువ.. అందులోనూ నెగెవ్, జుడియన్, ఆరావా, జిన్ వంటి ఎడారులు 60శాతం భూభాగాన్ని ఆక్రమించాయి. అయితేనేం, వ్యవసాయంలో వండర్లు సృష్టిస్తోంది. ఏడారిలో ఏకంగా చేపల పెంపకాన్ని చేపట్టిందంటే ఆ సృజనాత్మకత స్థాయిని అర్థం చేసుకోవచ్చు. అదే ఇజ్రాయెల్ ! ప్రస్తుతం ప్రపంచం సూపర్ ఎల్నినో పిడికిట చిక్కింది. దీనికి భారత్ కూడా మినహాయింపేమీ కాదు. రానున్న నెలల్లో కరవు ఖాయమని కేంద్ర మంత్రులే చెబుతున్నారు. ఈ క్రమంలో ఇజ్రాయెల్ అగ్రికల్చర్ వండర్స్ ఎన్నోపాఠాలు చెబుతాయి.

ఇజ్రాయెల్ చట్టాల ప్రకారం నీటి వనరులపై పూర్తి హక్కులు ప్రభుత్వానికే ఉంటాయి. ఇష్టారాజ్యంగా బావులు, బోర్లు తవ్వడం నేరం. నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఏకంగా వాటర్ పోలీసులను ఏర్పాటు చేసింది. రైతులు తమకు కేటాయించిన నీటి కంటే తక్కువ వాడుకొంటే.. వారికి వాటర్ క్రెడిట్స్ లభిస్తాయి. వీటిని నగదుగా కూడా మార్చుకోచ్చు.

మరోవైపు గృహాల నుంచి వచ్చే మురుగునీటిలో 86 శాతం వరకు శుద్ధి చేస్తోంది. డీశాలినేషన్ కోసం రివర్స్ ఆస్మాసిస్ అనే పక్రియ వాడటంతో అత్యంత చౌకగా మంచినీటిని సిద్ధం చేసుకోగలుగుతోంది. పిల్లలకు పాఠశాల స్థాయిలోనే నీటి పొదుపు చర్యలను నేర్పిస్తారు. ఈ దేశంలో నీటిని ఆదా చేసే డ్యూయల్ ఫ్లష్ టాయిలెట్లను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. నీటి ప్లాంట్లపై శత్రు దేశాలు సైబర్ దాడులు చేయకుండా ఇజ్రాయెల్ భద్రతా దళాల్లోని సైబర్ ఇంటెలిజెన్స్ విభాగం 'యూనిట్ 8200' 24 గంటలూ రక్షణ కల్పిస్తుంది.

సముద్ర తీరాల్లో ఎడారులున్న అరుదైన భౌగోళిక పరిస్థితి ఇజ్రాయెల్ది. డెడ్సీ, ఎర్ర సముద్రం, మధ్యధరా సముద్రం ఉన్నాయి. సీ ఆఫ్ గాలిలీ కూడా ఉంది. డెడ్సీ తీరంలో జుడియన్ ఎడారి, ఎర్ర సముద్రం వద్ద నెగెవ్ ఎడారి ఉన్నాయి. ఇక్కడి నీరు వందల మీటర్ల లోతులో ఉండి దాదాపు 37 డిగ్రీలకు పైగా వేడి, స్వల్ప ఉప్పదనంతో ఉంటాయి. వీటిని పైపుల సాయంతో తోడి ట్యాంకుల్లో నింపి.. వీటిలో తిలాపియా, సీబాస్, బరముండి వంటి చేపలను, కొన్ని రకాల రొయ్యలను పెంచుతారు. ఆక్సిజన్ పంపిస్తూ.. వాటర్ సైక్లింగ్ చేస్తూ వాడుకొంటారు. చేపల విసర్జకాలతో ఉన్న నీటిని ఆలివ్ వంటి తోటలకు ఎరువుగా వాడతారు. ఇజ్రాయెల్ సంప్రదాయాల కారణంగా దేశీయంగా రొయ్యలకు డిమాండ్ తక్కువగా ఉండటంతో.. అంతర్జాతీయ మార్కెట్లో విక్రయిస్తున్నారు.

ఇజ్రాయెల్ తన భౌగోళిక పరిస్థితికి తగిన కింగ్ ఆఫ్ డేట్స్గా పిలిచే మెడ్జూల్ ఖర్జూర తోటలను ఎడారుల్లో పండిస్తోంది. ఈ రకం ఖర్జూరాల ఎగుమతిలో భారీ మార్కెట్ షేర్ను ఇజ్రాయెల్ సొంతం చేసుకొంది. తక్కువ నీటితో పండేలా చెర్రీ టమాటోలు, సుదీర్ఘకాలం నిల్వ ఉండే క్యాప్సికం పంటను జన్యుమార్పులతో సృష్టించింది. సూపర్ స్వీట్ మిరపకాయలను ఇజ్రాయెల్ కంపెనీ తయారు చేసింది. నీటి వినియోగం ఎక్కువగా ఉండే పామాయిల్ సాగును ఇజ్రాయెల్లో ఇష్టపడరు. అక్కడ ఆలివ్ సాగుకు డిమాండ్ ఎక్కువ. వ్యవసాయానికి అత్యధికశాతం రీసైక్లింగ్ నీటినే వినియోగిస్తారు. మట్టి కూడా వాడని ప్రత్యేక పద్ధతుల్లో డిజర్ట్ రోజ్లను సాగు చేసి.. వాటిని ఐరోపా దేశాలకు ఎక్స్పోర్ట్ చేస్తోంది. ఇక ఉప్పునీటిలో పండే క్యారెట్, నీటి వృథాను తగ్గించే కొన్ని రకాల పండ్ల రకాల సాగుకీ అక్కడ ప్రాధాన్యం అధికం.

ఇజ్రాయెల్ వ్యవసాయంలో ద్రాక్ష తోటలు మరో ఎత్తు. ఇక్కడి పండ్ల నుంచి ప్రపంచ స్థాయి నాణ్యతతో వైన్ ఉత్పత్తి చేస్తారు. నెగెవ్ ఎడారి మధ్యలో కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో సెన్సర్ల ద్వారా నీటి వృథాను అరికట్టి.. ద్రాక్ష తోటలను పెంచారు. ఈ ఎడారిలో 60కిపైగా వైన్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి.. ఏటా 10 లక్షలకుపైగా బాటిల్స్ను ఉత్పత్తి చేస్తున్నారు.

ప్రపంచంలోనే వైన్ నాణ్యతలో నెగెవ్ కూడా టాప్ ప్లేస్లో ఉంటుంది. ఇజ్రాయెల్ సాగు, నీటి సంరక్షణ పద్ధతులను మనం కూడా నేర్చుకోవచ్చు. ఇండో- ఇజ్రాయెల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్లను భారత్లోని 21 రాష్ట్రాల్లో 35 వరకు ఉన్నాయి. విశేష సేవలందిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కుప్పం, గుండ్లపల్లి, జీడిమెట్ల, ములుగు, గరమెళ్ల పాడుల్లో ఇవి ఉన్నాయి.

పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

- వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎస్పీ రాజేష్ చంద్ర
- కామారెడ్డి జిల్లా నుంచి ఏడుగురు పోలీసుల ప్రాణత్యాగం, కుటుంబాలకు అండగా ఉంటాం.
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఘనంగా నివాళులు
- ఈ ఏడాది దేశవ్యాప్తంగా 154 మంది పోలీసు సిబ్బంది వీరమరణం
- అమరవీరుల కుటుంబాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 21 (మనం బ్యూరో): దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అన్నారు. అమరవీరుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను స్మరించుకున్నారు. కామారెడ్డి జిల్లా నుంచి ఇప్పటివరకు ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బంది అమరులయ్యారని గుర్తుచేశారు. వారి త్యాగాలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత

ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ., 1959 అక్టోబరు 21న లడఖ్లోని అక్సాయ్చిన్ ప్రాంతంలో చైనా దళాల దాడిలో పది మంది కేంద్ర రిజర్వ్ పోలీసు దళ సిబ్బంది వీరమరణం పొందిన ఘటనకు గుర్తుగా ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశం, రాష్ట్రం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా అసాంఘిక శక్తులను ఎదుర్కొంటూ 154 మంది పోలీసు సిబ్బంది వీరమరణం పొందగా, తెలంగాణ రాష్ట్రం నుంచి నలుగురు అమరులయ్యారని తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని, అమరవీరుల స్ఫూర్తితో కర్తవ్య నిర్వహణలో ముందుకు సాగాలని సూచించారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ., విధి నిర్వహణలో అమరులైన పోలీసుల స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అన్నారు. సమాజ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరాలంటే శాంతిభద్రతలు కీలకమని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు, అంతర్గత భద్రతలో పోలీసులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తూ ప్రజల రక్షణకు అంకితమవుతున్నారని తెలిపారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన కలెక్టర్., వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ఏవైనా సమస్యలు ఉంటే ఎప్పుడైనా తనను కలవవచ్చని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసు శాఖ కూడా అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

- మానవత్వం చాటుకున్న రిటైర్డ్ ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్

జగిత్యాల, అక్టోబర్ 21:(మనం న్యూస్): జగిత్యాల పట్టణానికి చెందిన రిటైర్డ్ ఏఎస్ఐ రాజేశం శ్రీనివాస్ మరోసారి తన మానవత్వాన్ని సేవాభావాన్ని చాటుకున్నారు. గత తొమ్మిది నెలల క్రితం జగిత్యాల పట్టణంలో రోడ్లపై సరైన మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న శ్రీనివాస్ అనే వ్యక్తిని తనచే నిర్వహించబడుతున్న అనాధాశ్రమంలో చేర్పించి ఉచితంగా భోజనం వసతి కల్పించారు.అప్పటి నుండి ఆశ్రమంలోనే ఉంటున్నాడు బుధవారం ఉదయం లేచి ఆరోగ్యం బాగాలేదని, చలిగా ఉందని చెప్పి టీ తాగి బెడ్ షీట్ కప్పుకొని పడుకున్నాడు. ఆశ్రమ మేనేజర్ ఈమోటూరి నాగలింగంఈ డాక్టర్ ను తీసుకువచ్చి చూపించగా, అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఆశ్రమ నిర్వాహకులు వెంటనే వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేసి, చింతకుంట వద్ద గల శ్మశానంలో హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్వయంగా రాజేశుని శ్రీనివాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ ప్రధాన కార్యదర్శి రంగు రాజయ్య, కోశాధికారి

కప్పల చంద్రమౌళి, మేనేజర్ మోటూరి నాగలింగం, ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

పేగు బంధం లేకపోయినా అనాథ శవానికి అన్నీ తానై నిలిచిన రాజేశుని శ్రీనివాస్ సేవలను ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు కొనియాడారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ - ఇంకా ఎవరైనా అనాథ వృద్ధులు ఉంటే తమ ఆశ్రమంలో చేర్చుకుంటామని, అలాగే ప్రజలు తమ జన్మదినం, వివాహ వార్షికోత్సవం, పెద్దల జయంతి, వర్ధంతి రోజులను ఆశ్రమంలో వృద్ధుల సమక్షంలో జరుపుకొని వారికి భోజన సదుపాయం కల్పించవచ్చని తెలిపారు.

పోలీసులకు సలాం

- సంస్మరణ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, అక్టోబర్ 21 మనం న్యూస్ ప్రతినిధి : శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలకు సలాం వారి త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. విధి నిర్వహణలో భాగంగా సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి కుటుంబాల త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని గుర్తు చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ తో కలిసి పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన పోలీసు అమరవీరులు జంగయ్య (సిర్గాపూర్ పోలీస్ స్టేషన్), ఎల్లయ్య (సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్), సత్యనారాయణ (జిన్నారం పోలీస్ స్టేషన్), సురేష్ (కంగ్టి పోలీస్ స్టేషన్) ప్రజల రక్షణ కోసం చేసిన వారి ధైర్య సాహసాలను, సేవలను కొనియాడారు. పోలీస్ అమరుల కుటుంబాలకు ప్రభుత్వం జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడఖ్లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఎస్పీ అన్నారు . వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు పోలీసు సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అంతర్గత భద్రత, ప్రభుత్వ ఆస్తుల రక్షణతో పాటు ప్రజల్లో భద్రతాభావాన్ని కల్పించడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రథమ కర్తవ్యమని, అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రజల రక్షణకు అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో విధినిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబీకులకు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి

గజ్వేల్ అక్టోబర్ 21 మనం న్యూస్: ప్రజ్ఞాపూర్ నుండి శ్రీగిరిపల్లి వైపు వెళ్తున్న ఒక లారీని, శ్రీగిరిపల్లికి చెందిన అనిల్ చారి (19) అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై అత్యంత వేగంగా లారీని ఓవర్టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అనిల్ చారిని వెంటనే మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే, అక్కడ చికిత్స పొందుతూ ఆయన పరిస్థితి విషమించి మృతి చెందాడు.

సెంట్ మేరీస్ స్కూల్ సమీపంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేయడమైనది అని, పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, ప్రమాద సమయంలో మృతుడు మద్యం సేవించి వాహనం నడిపి ఉంటాడని అనుమానిస్తున్నామని, దానికి సంబంధించి

విసర నమూనాలు సేకరించి ల్యాబ్కు పంపించామని ఏ సిపి పేర్కొన్నారు. దీనిపై తదుపరి విచారణ జరుపుతున్నామని గజ్వేల్ ఏసీపీ నరసింహులు తెలిపారు. వాహనదారులు ప్రయాణాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలు పాటించాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు ఏసిపి నరసింహులు విజ్ఞప్తి చేశారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- వారి స్ఫూర్తి, కర్తవ్యనిష్ఠను ఆదర్శంగా తీసుకోవాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.
- కామారెడ్డి జిల్లాలో ఏడుగురు పోలీసు అమరవీరులు. అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులు.
- కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసు శాఖ అండగా ఉంటాయని కలెక్టర్ భరోసా.

కామారెడ్డి, అక్టోబర్ 21 (మనం బ్యూరో): దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. వారు చూపిన ధైర్యం, కర్తవ్యనిష్ఠ, సేవాభావాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.

పోలీసు ఫ్లాగ్ డే.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీసు ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద ఎస్పీ ఎం. రాజేష్ చంద్రతో కలిసి కలెక్టర్ పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసు అధికారులు, సిబ్బంది సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., సమాజ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందాలంటే శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు, అంతర్గత భద్రతలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించే పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు.

జిల్లా నుంచి ఏడుగురు అమరులు.

కామారెడ్డి జిల్లా నుంచి ఇప్పటివరకు ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని కలెక్టర్ గుర్తుచేశారు. వారి త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, దేశం పట్ల అంకితభావం, ప్రజాసేవ పట్ల నిబద్ధతను పెంపొందిస్తాయని అన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

కుటుంబాలకు అండగా ఉంటాం.

అమరవీరుల కుటుంబ సభ్యులకు ఏవైనా సమస్యలు ఎదురైతే ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకునే కార్యక్రమాలు ప్రజల్లో దేశభక్తి, సేవాభావం, విధి పట్ల నిబద్ధతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అదనపు ఎస్పీలు, డిఎస్పీలు

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. నర్సింహారెడ్డి, డీఎస్పీలు ఎస్. మధుసూదన్, పి. విట్టల్ రెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, గట్టుమల్లు, ఉదయ్ భాస్కర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శాంతియుత సమాజమే పోలీసులు లక్ష్యం

- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్.
- విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం;జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.
- అమరుల త్యాగాలు, ఆశయాల సాధన దిశగా ముందుకు సాగాలి
- పోలీస్ అమరుల త్యాగాన్ని స్మరిస్తూ నివాళులు, కుటుంబ సభ్యులకు పరామర్శ.

జగిత్యాల అక్టోబర్ 21(మనం ప్రతినిధి): విధి నిర్వహణలో, దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల సంస్మరణ పోలీస్ ఫ్లాగ్ డే ను జిల్లా లో ఘనంగా నిర్వహించారు. పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీస్ అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు'శోక్ శ్రస్త్' చేసి మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు,సిబ్బంది అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరుల త్యాగాలు, ధైర్యసాహసాలు, విధి పట్ల అంకితభావం ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. దేశ సరిహద్దు రక్షణలో భాగంగా 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా నేరాల నియంత్రణ, ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని తెలిపారు.

ప్రతి పోలీస్ సిబ్బంది కష్టపడి, ఎన్నో వ్యక్తిగత త్యాగాలు చేస్తూ ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయని, వారి ఆశయాలకు అనుగుణంగా మరింత బాధ్యతాయుతంగా, వృత్తి నైపుణ్యంతో, మానవీయ దృక్పథంతో ప్రజలకు సేవలందించాలని పోలీస్ సిబ్బందికి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను కూడా స్మరించుకోవడం మన బాధ్యత అని తమ కుటుంబ సభ్యులను కోల్పోయినప్పటికీ ధైర్యంగా ముందుకు సాగుతున్న అమరవీరుల కుటుంబాల త్యాగం, సహనం, మనోధైర్యం ఎంతో గొప్పవని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

తెలంగాణ పోలీస్ శాఖ ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల త్యాగాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు వ్యాసరచన పోటీలు, పోలీస్ స్టేషన్ల ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశాలు వంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పోలీస్ శాఖకు, ప్రజలకు మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ధైర్యసాహసాలు, సేవాభావం, అంకితభావం జిల్లా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజల భద్రతకు, శాంతిభద్రతల పరిరక్షణకు, సమాజ సేవకు పోలీస్ శాఖ నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.... పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పోలీసులు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, పండుగలు, సెలవు రోజుల్లోనూ ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. అమరవీరుల కుటుంబ సభ్యుల సంక్షేమం, పిల్లల విద్య, వారికి అందాల్సిన ప్రభుత్వ సహాయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. వారి సమస్యలను సానుభూతితో పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

పోలీస్ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పోలీసులపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పారదర్శకత, జవాబుదారీతనం, మానవీయ దృక్పథంతో విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ అమరవీరుల ధైర్యసాహసాలు, త్యాగాలను మాటల్లోనే కాకుండా, వారి స్ఫూర్తితో నిజాయితీగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించడం ద్వారా గౌరవించాలని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు.

ఇట్టి కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు వారి యొక్క సమస్యలను అడిగి వారు చెప్పిన సమస్యలను సాధ్యమైనొత తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందించడం జరిగింది.

ఈ కార్యక్రమాలలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డిఎస్పీ లు పురుషోత్తం రెడ్డి, రాములు, రవికుమార్,సి.ఐ లు ఎస్.ఐ లు, పోలీస్ అమర వీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యువత తల్లిదండ్రులను గౌరవించి వారి ఆరోగ్యాలను కాపాడుకోవాలి

- దసరా వేడుకల సందర్భంగా ప్రజలను కోరిన జగ్గారెడ్డి

సంగారెడ్డి అక్టోబర్ 21 మనం న్యూస్ ప్రతినిధి. : యువత వారి తల్లిదండ్రులను గౌరవించి వారి ఆరోగ్యాలను కాపాడుకోవాలని జగ్గారెడ్డి యువతకు పిలుపునిచ్చారు . ప్రతి రోజూ దేవుడిని మొక్కే ముందే బీపీ, షుగర్ ఉన్నవారు వైద్యులు సూచించిన విధంగా మందులు వేసుకోవాలి. ఇంట్లో బీపీ, షుగర్తో బాధపడుతున్న తల్లిదండ్రులు ఉంటే వారు క్రమం తప్పకుండా మందులు తీసుకునేలా కుటుంబ సభ్యులు శ్రద్ధ పెట్టాలి'' అని జగ్గారెడ్డి ప్రజలకు సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కొడుకులు, కుమార్తెలు, కోడళ్లపై ఉందన్నారు. సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ కుటుంబ బంధాలు, పెద్దల ఆరోగ్యం, సంగారెడ్డి ప్రజలతో తనకున్న అనుబంధం గురించి భావోద్వేగంగా మాట్లాడారు.

అంబరాన్నంటిన దసరా సంబురాలు

సంగారెడ్డిలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఏటా అంబేద్కర్ స్టేడియం వేదికగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా వేడుకలు ఈసారి కూడా అత్యంత వైభవంగా సాగాయి. పట్టణంలోని రామమందిరంలో ప్రత్యేక భజన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రామమందిరం భజన మండలి సభ్యులు, భక్తులతో కలిసి జగ్గారెడ్డి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శామీను తీసుకుని రామమందిరం నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. అంబేద్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. వేదికపై మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా జమ్మిపూజ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రావణ దహన కార్యక్రమం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీగా తరలివచ్చిన ప్రజలు రావణ దహనాన్ని ఆసక్తిగా తిలకించారు. ఆకాశంలో వెలుగులు విరజిమ్మిన బాణసంచా మెరుపులు, ఆకట్టుకునే డ్రోన్ల ప్రదర్శన ప్రేక్షకులను కనువిందు చేశాయి.ప్రముఖ సినీ నేపథ్య గాయకులచే ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆహూతులను మంత్ర ముగ్ధులను చేసింది.

సంగారెడ్డి ప్రజలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చారు

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానాన్ని, సంగారెడ్డి ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ''నా దగ్గర చాలా డబ్బులు ఉన్నాయని అందరూ అనుకుంటారు. కానీ నాకు వచ్చిన డబ్బును ప్రతి ఏటా సంగారెడ్డి ప్రజల కోసం పండుగలు నిర్వహించడానికి ఖర్చు చేస్తున్నాను. నలభై ఏళ్ల క్రితం చిన్న వయసులో ఉన్నప్పుడు ఇదే మైదానంలో నా స్నేహితులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నాను. ఆనాటి నుంచి ఈనాటి వరకు సంగారెడ్డితో నా అనుబంధం కొనసాగుతోంది. నన్ను కౌన్సిలర్ స్థాయి నుంచి ఈ స్థాయికి తీసుకొచ్చింది సంగారెడ్డి ప్రజలే'' అని పేర్కొన్నారు. దసరా వేదికను తాను ఎన్నడూ రాజకీయాల కోసం ఉపయోగించుకోలేదన్నారు. ''ఈ వేదికపై నుంచి నేను ఎప్పుడూ రాజకీయాలు మాట్లాడలేదు. ఓట్లు అడగలేదు. కానీ నా మనసులో ఉన్న మాటలను మాత్రం ప్రజలతో పంచుకుంటాను'' అని చెప్పారు.

సంగారెడ్డి ప్రజలంతా నా కుటుంబమే

''కుటుంబం అంటే కేవలం నా భార్య, పిల్లలు మాత్రమే కాదు. సంగారెడ్డి ప్రజలందరినీ నా కుటుంబ సభ్యులుగానే భావిస్తాను. అందుకే ప్రతి ఏటా అందరితో కలిసి పండుగలు జరుపుకుంటాను'' అని జగ్గారెడ్డి అన్నారు. వయసు పెరిగేకొద్దీ తల్లిదండ్రుల ఆరోగ్యంపై పిల్లలు మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పెద్దలు వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా చూడాలన్నారు. ఇంట్లో పెద్దల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, వారికి అవసరమైన సంరక్షణ అందించాలని కోరారు. కొడుకులు, కుమార్తెలతో పాటు కోడళ్లు కూడా కుటుంబంలోని పెద్దల ఆరోగ్యంపై బాధ్యతగా వ

మంత్రి తుమ్మలను కలిసిన భద్రాచలం మైనార్టీ నాయకులు

దమ్మపేట, అక్టోబర్ 21(మనం న్యూస్): దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో బుధవారం ఉదయం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును భద్రాచలం పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు కలిశారు. పట్టణంలో ముస్లిం మైనార్టీల కోసం గతంలో ఏర్పాటు చేసిన షాదీ ఖానా దర్గాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, భద్రాచలం నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎస్ ఏ రసూల్ నాయకత్వంలో ముస్లిం మైనార్టీ సోదరులు మంత్రి తుమ్మలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి పైడి వెంకటేశ్వరావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, ఎర్ర వసంతరావు, తదితరులు ఉన్నారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా ఆయుధపూజ

పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం, అక్టోబర్ 21(మనం న్యూస్): ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సిటీ అర్మ్డ్ రిజర్వ్‌డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆయుధపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఈ కార్యక్రమంలో పాల్గొని పోలీస్ శాఖ ఆయుధాలు, వాహనాలకు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీకగా నిర్వహించిన పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులు, సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏ ఆర్ అడిషనల్ డిసిపిలు కుమారస్వామి, విజయబాబు, ఏ ఆర్ ఏసీపీలు నర్సయ్య, సుశీల్ సింగ్, ఎస్సీ ఏసీపీ మహేష్, ఆర్ ఐ లు కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, ఇన్స్పెక్టర్లు రామకృష్ణ, శంకర్, అశోక్ పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయం

- శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం
- మారుతున్న నేరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో పోలీసింగ్
- విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులకు సన్మానం
- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా
- స్మృతి పరేడ్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, పోలీస్ కమిషనర్

ఖమ్మం, అక్టోబర్ 21(మనం బ్యూరో): పోలీసుల త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు భరోసా, రక్షణ కల్పించడంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా ఖమ్మం పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన స్మృతి పరేడ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్తో కలిసి పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్‌లోని పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద కలెక్టర్, పోలీస్ కమిషనర్, పోలీస్ అధికారులు, సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు పుష్పాంజలి ఘటించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరులను స్మరించుకుని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం లడక్ సరిహద్దు ప్రాంతంలో ప్రాణ త్యాగం చేసిన వీరుల స్ఫూర్తిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది పోలీస్ శాఖ నిత్యం ప్రదర్శించే నిబద్ధత, త్యాగం, గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న క్రమంలో ప్రగతికి తోడుగా ప్రజలకు భరోసా, రక్షణ కల్పిస్తూ శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు వారి కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో పోలీసులకు అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యుల త్యాగాలను కూడా ఈ సందర్భంగా స్మరించుకోవాలని తెలిపారు.

మారుతున్న నేరాలకు అనుగుణంగా ఆధునిక పోలీసింగ్

ప్రస్తుతం నేరాల స్వరూపం వేగంగా మారుతోందని, సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు సహా కొత్త తరహా నేరాలు వెలుగు లోకి వస్తున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా అరికట్టేందుకు పోలీసింగ్ విధానాలను ఆధునీకరిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్లో వినియోగించడంలో తెలంగాణ పోలీస్ శాఖ దేశంలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధనలో పోలీస్ శాఖ, జిల్లా యంత్రాంగం రెండు ముఖ్యమైన విభాగాలని, పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ అన్నారు.

అమరవీరుల త్యాగాలు దేశానికి స్ఫూర్తి

పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్ ప్రాంతంలో చైనా సైనికులతో పోరాడుతూ దేశ సరిహద్దులను కాపాడే క్రమంలో 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. చివరి శ్వాస వరకు దేశ రక్షణ కోసం పోరాడిన వారి త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకుంటున్నామని తెలిపారు.

శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు రక్షణ కల్పించడం, నేరాలను నియంత్రించడం వంటి బాధ్యతలను పోలీసులు నిరంతరం నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఒకప్పుడు తెలంగాణలో నక్సలిజం, తీవ్రవాద సమస్యలు తీవ్రంగా ఉండేవని, పోలీసుల నిరంతర కృషి, త్యాగాల ఫలితంగా ప్రస్తుతం రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

అనంతరం పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లు శాలువాలతో సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా నలుగురు పోలీసు సిబ్బంది తమ ఇంటి స్థలాలకు సంబంధించిన సమస్యలపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించడంతో పాటు సంబంధిత ఉత్తర్వులు కూడా జారీ చేసినట్లు తెలిపారు.

కేటాయించిన స్థలాలను స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏ ఆర్ డిసిపిలు కుమారస్వామి, విజయబాబు, ఏ ఆర్ ఏసీపీలు సుశీల్ సింగ్, నర్సయ్య, ఏసీపీలు రమణమూర్తి, మహేష్, సాంబరాజు, నర్సింహారావు సిఐలు, ఆర్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్లో వీరంగం..

- బాటిళ్లు ధ్వంసం చేసి మేనేజర్‌పై దాడి, సెల్ఫోన్ అపహరణ
- హవేలి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు: ఎస్ఐ

ఖమ్మం అర్బన్, అక్టోబర్ 21(మనం న్యూస్): ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బార్ అండ్ రెస్టారెంట్లో గొడవకు దిగి, బీర్ బాటిళ్లు, కూల్‌డ్రింక్స్ బాటిళ్లను ధ్వంసం చేసి, మేనేజర్‌పై దాడి చేసి సెల్‌ఫోన్ అపహరించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. ఈ నెల 20న ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీ, రోడ్ నంబర్ 3లో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్లో ముగ్గురు వ్యక్తులు మద్యం సేవిస్తుండగా, నీళ్ల విషయమై అక్కడి సిబ్బందితో గొడవకు దిగారు. గొడవను ఆపేందుకు బార్ మేనేజర్ శీలం వెంకట్రామిరెడ్డి ప్రయత్నించగా, సదరు వ్యక్తులు ఫోన్ చేసి మరికొందరిని అక్కడికి పిలిపించారు. టిఎస్ 04 డి 9375 నంబర్ గల నల్లరంగు మహీంద్రా థార్ రాక్స్ వాహనంలో అక్కడికి చేరుకున్న వారు బార్లోకి ప్రవేశించి బీర్ బాటిళ్లు, కూల్ డ్రింక్స్ బాటిళ్లను ధ్వంసం చేయడంతో సుమారు రూ.5,000 నష్టం వాటిల్లిందని, అనంతరం మేనేజర్, సిబ్బందిని అసభ్య పదజాలంతో దూషిస్తూ, మేనేజర్‌పై చేతులతో దాడి చేసి చంపుతామని బెదిరించినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో మేనేజర్కు చెందిన సుమారు రూ.30,000 విలువైన సెల్ఫోన్ కింద పడిపోగా, నిందితులు దానిని తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో తెలిపారు. అక్కడి నుంచి వెళ్లే సమయంలో బార్ ముందు పార్క్ చేసిన మరో కారును తమ వాహనంతో ఢీకొట్టి వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబర్ 583/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని, ఫిర్యాదులో కే. జ్ఞానేశ్వర్, బొడ్డు వరుణ్ అనే ఇద్దరు వ్యక్తులను గుర్తించినట్లు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ, సంబంధిత వ్యక్తులను గుర్తించి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఇన్స్పెక్టర్ తెలిపారు.

సమ్మక్క సారలమ్మ దేవాలయ ధ్వంసం

నిందితులపై చర్యలు తీసుకోవాలి..గ్రామస్తుల డిమాండ్..

ఆళ్లపల్లి అక్టోబర్ 21 (మనం న్యూస్): మండలం పరిధిలోని అనంతోగు గ్రామ శివారులో ఉన్న సమ్మక్క-సారక్క గుడిని గుర్తు తెలియని దుండగులు మంగళవారం అర్ధరాత్రి సమయంలో ధ్వంసం చేశారు. గుర్తు తెలియని దుండగులు గుడి పైకప్పును పగలగొట్టి, లోపల ఉన్న సమ్మక్క, సారలమ్మ అమ్మవార్ల విగ్రహాలను బయట పడేశారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా గ్రామంలో కొంతమంది మధ్య వాగ్వాదం జరిగిందని ఆ వాగ్వాదంలో ఒక వ్యక్తి గ్రామంలోని కొందరిపై దాడి చేశాడని, అదే కోపంతో అతనే ఈ గుడి పైకప్పును పగలగొట్టి, విగ్రహాలను బయట పడేసి ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూజా సామగ్రి గుడి ముందు చిందరవందరగా పడి ఉండడం, అమ్మవార్ల విగ్రహాలు గుడి బయటపడేసి ఉండడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీల ఆరాధ్య దేవతలైన సమ్మక్క-సారక్క గుడిని ఇలా ధ్వంసం చేయడంపై గ్రామస్తులు, భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమ్మక్క సారలమ్మ గుడి ధ్వంశానికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని, గుడి పునర్నిర్మాణానికి సహకరించాలని వారు కోరుతున్నారు.

ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

- జనసేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గడల శ్రీనివాసరావు

మంచుపల్లి అక్టోబర్ 21 (మనం న్యూస్): దేశ ప్రజల ప్రాణాలను కాపాడుతూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన వీర పోలీసుల త్యాగాలు మరువలేనివని జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, వరంగల్-నల్గొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వీర పోలీసు అమరవీరులకు ఆయన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజల భద్రతే పరమావధిగా భావించి, విధి నిర్వహణలో ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించి దేశం కోసం అమరులైన పోలీసుల సేవలు, త్యాగాలను దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేరని పేర్కొన్నారు. ప్రజల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తూ, ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొంటూ విధులు నిర్వర్తించే పోలీసుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఒక పోలీసు అధికారి విధులకు వెళ్లినప్పుడు తిరిగి వస్తాడని ఎదురుచూసే తల్లి, క్షేమంగా ఇంటికి చేరుకుంటాడని ఆశించే భార్య, నాన్న రాక కోసం ఆత్రుతగా ఎదురుచూసే పిల్లలు ఉంటారని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినప్పుడు ఆ కుటుంబాల్లో తీరని విషాదం, చెరిగిపోని జ్ఞాపకాలు, జీవితాంతం వెంటాడే వేదన మిగులుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రజల భద్రత కోసం తమ కుటుంబాల ప్రేమానురాగాలను పక్కనపెట్టి, కర్తవ్య నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిదని స్పష్టం చేశారు.

పోలీసు అమరవీరుల సేవలు ఒక్క రోజుకే పరిమితం కావు..

పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలను కేవలం ఒకరోజు స్మరించుకోవడంతో సరిపెట్టకూడదని, వారి ధైర్యసాహసాలు, అంకితభావం, సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డాక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు. దేశంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ప్రాణాలు మరియు ఆస్తుల రక్షణకు పోలీసులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న పోలీసుల సేవలను సమాజం గుర్తించాలని అన్నారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన ప్రతి వీర పోలీసు అమరవీరుడికి హృదయపూర్వక అశ్రునివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి త్యాగాలను యావత్ సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరులు భౌతికంగా మన మధ్య లేకపోయినా, వారు చూపిన ధైర్యసాహసాలు, చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. వారి త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల సేవలకు సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని డాక్టర్ గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ఐదున్నర దశాబ్దాలుగా అయ్యప్ప స్వామి సేవలో..

54 సంవత్సరాలుగా మాలధారణతో స్వామి సేవలో రాంబాబు గురుస్వామి

లక్షలాది మంది భక్తులకు మాలధారణ.. వేలాది పడిపూజల్లో భక్తిగీతాల ఆలాపన

కొత్తగూడెం అయ్యప్ప భక్తులకు ఆదర్శంగా నిలిచిన ఆధ్యాత్మిక వ్యక్తిత్వం

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 21(మనం న్యూస్): అయ్యప్ప స్వామిపై అచంచలమైన విశ్వాసం.. గురుస్వామిగా అపారమైన అనుభవం.. భక్తి మార్గంలో తరతరాలకు స్ఫూర్తినిచ్చే సేవాభావం.. ఇవన్నీ కలగలిపిన ఆధ్యాత్మిక వ్యక్తిత్వం అవుటుపల్లి రామలింగేశ్వరరావు అలియాస్ రాంబాబు గురుస్వామి. గత 54 సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి మాలధారణతో భక్తిశ్రద్ధలతో స్వామివారి సేవలో కొనసాగుతూ, ఎంతోమంది భక్తులకు అయ్యప్ప దీక్ష పట్ల ఆసక్తిని, భక్తిభావాన్ని పెంపొందించడంలో ఆయన విశేష పాత్ర పోషించారు. కొత్తగూడెం ప్రాంతంలో అయ్యప్ప భక్తి ప్రస్థానానికి తనదైన ముద్ర వేసిన రాంబాబు గురుస్వామి సేవలు భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి.

54 ఏళ్లుగా అయ్యప్ప స్వామి సేవలోనే జీవితం!

అయ్యప్ప స్వామి దీక్ష అనేది కేవలం మాలధారణకే పరిమితం కాదు. నియమ నిష్ఠలు, ఆధ్యాత్మిక చింతన, సాత్విక జీవనం, సమానత్వ భావన, సేవాతత్పరతతో కూడిన పవిత్రమైన మార్గం. ఈ మార్గంలో ఐదున్నర దశాబ్దాలకు పైగా కొనసాగడం రాంబాబు గురుస్వామి అచంచలమైన భక్తికి నిదర్శనం. 54 సంవత్సరాలుగా మాలధారణ చేస్తూ, అయ్యప్ప స్వామి ఆరాధనలో తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన ఎందరో భక్తులకు మార్గదర్శిగా నిలిచారు.

నగర సంకీర్తనకు కొత్త ఉత్సాహం.. భక్తులకు ఆధ్యాత్మిక ప్రేరణ!

కొత్తగూడెంలోని బాబు క్యాంప్ రామాలయం నుంచి మూరైటి వాగు అయ్యప్ప ఆలయం వరకు రాంబాబు గురుస్వామి ముందుండి నిర్వహించిన అయ్యప్ప నగర సంకీర్తనలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపేవి. అయ్యప్ప నామస్మరణతో, భక్తిగీతాల ఆలాపనతో సాగిన ఈ నగర సంకీర్తనలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తేవి. ఎన్నో సంవత్సరాలపాటు ఈ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అయ్యప్ప స్వామి నామాన్ని స్మరిస్తూ భక్తులను ఏకతాటిపైకి తీసుకురావడం, స్వామివారి పట్ల విశ్వాసాన్ని పెంపొందించడం, దీక్షల్లో ఉన్న భక్తులకు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని అందించడం ఆయన సేవల్లో ప్రధానమైనవి. నగర సంకీర్తనల ద్వారా అయ్యప్ప భక్తి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన విశేష కృషి చేశారు.

లక్షలాది మంది భక్తులకు మాలధారణ.. వేలాది పడిపూజల్లో భక్తిగీతాల సేవ!

రాంబాబు గురుస్వామి ఆధ్యాత్మిక ప్రస్థానంలో మాలధారణ కార్యక్రమాలు, పడిపూజలు ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయి. లక్షలాది మంది భక్తులకు మాలధారణ చేయించి అయ్యప్ప దీక్షా మార్గంలో నడిపించడంలో ఆయన సేవలు అందించారు. వేలాది పడిపూజల సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తిగీతాలను ఆలపిస్తూ భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించారు. ఆయన ఆలపించే అయ్యప్ప భక్తిగీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకునేవి. ఆ పాటలు వింటూ స్వామివారిపై భక్తిని పెంపొందించుకున్నవారు ఎందరో ఉన్నారు. ఆయన గానంతో ప్రేరణ పొంది అయ్యప్ప మాలధారణ చేపట్టిన భక్తులు కూడా ఎంతోమంది ఉన్నారు. భక్తిగీతాలను కేవలం ఆలపించడమే కాకుండా, వాటి ద్వారా అయ్యప్ప స్వామి మహిమను భక్తులకు చేరవేయడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది.

కొత్తగూడెం గురుస్వాములకు ఆదర్శప్రాయుడు!

ఒక వ్యక్తి భక్తి మార్గంలో సాగుతూ తన ఆచరణతో ఇతరులకు స్ఫూర్తిగా నిలవడం గొప్ప విషయం. ఆ కోవలోనే రాంబాబు గురుస్వామి తన సుదీర్ఘ ఆధ్యాత్మిక ప్రస్థానంతో కొత్తగూడెం ప్రాంతంలోని అయ్యప్ప భక్తులకు ఆదర్శంగా నిలిచారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని అనేకమంది గురుస్వాములు అయ్యప్ప పూజలు, మాలధారణ కార్యక్రమాలు, పడిపూజలు నిర్వహిస్తూ స్వామివారి సేవలో కొనసాగుతున్నారు. భక్తి, క్రమశిక్షణ, ఆచార వ్యవహారాలు, గురుస్వామిగా బాధ్యతలు నిర్వహించే విధానం వంటి అంశాల్లో ఆయన ప్రస్థానం కొత్తతరానికి స్ఫూర్తినిచ్చేలా ఉంది. అయ్యప్ప స్వామి సేవలో ఎన్నో సంవత్సరాల అనుభవాన్ని సంపాదించుకున్న ఆయన, భక్తుల మధ్య ఆధ్యాత్మిక అనుబంధాన్ని బలోపేతం చేయడంలో తనవంతు కృషి చేశారు.

భక్తి ప్రస్థానమే ఆయనకు గుర్తింపు!

కాలం మారుతున్నా.. తరాలు మారుతున్నా.. భక్తి మార్గంలో నిబద్ధతతో సాగిన వ్యక్తుల సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయి. 54 సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి మాలధారణ చేస్తూ, నగర సంకీర్తనలు, మాలధారణ కార్యక్రమాలు, పడిపూజల్లో తన సేవలను అందించిన రాంబాబు గురుస్వామి ప్రస్థానం కూడా అలాంటిదే. అయ్యప్ప స్వామిపై అచంచల విశ్వాసం, భక్తులకు సేవ చేయాలనే తపన, తన గానంతో స్వామివారి నామాన్ని అందరికీ చేరవేయాలనే సంకల్పం ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టాయి. కొత్తగూడెం ఆధ్యాత్మిక రంగంలో అయ్యప్ప స్వామి సేవకు తన జీవితంలోని కీలక భాగాన్ని అంకితం చేసిన రాంబాబు గురుస్వామి సేవలు భక్తులకు స్ఫూర్తిదాయకం. అయ్యప్ప స్వామి సేవే జీవిత ధ్యేయంగా.. భక్తి మార్గమే తన ప్రస్థానంగా సాగుతున్న రాంబాబు గురుస్వామి 54 ఏళ్ల ఆధ్యాత్మిక ప్రయాణం కొత్తగూడెం అయ్యప్ప భక్తుల చరిత్రలో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది.

అమరవీరుల త్యాగాలే పోలీస్ శాఖకు స్ఫూర్తి: ఎస్పీ రోహిత్ రాజు

- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఘన నివాళులర్పించిన ఎస్పీ

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 21 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అమరవీరుల స్తూపం వద్ద విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు శోక్ శస్త్ర నిర్వహించి అమరవీరులకు గౌరవ వందనం సమర్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల పాటు మౌనం పాటించి వీరమరణం పొందిన పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. గత ఏడాది నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల పేర్లను ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తూ, విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.

1959 అక్టోబర్ 21న లడఖ్లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైన్యంతో జరిగిన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీస్ సిబ్బంది త్యాగాలకు గుర్తుగా 1962 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు.2025 సెప్టెంబర్ 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 154 మంది పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా స్మరించుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగురు పోలీస్ సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. దేశ భద్రత, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఉగ్రవాదం, నక్సలిజం వంటి సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది సేవలు అభినందనీయమని అన్నారు.అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు.

మహానందిలో హైకోర్టు జడ్జి పూజలు

మహానంది, అక్టోబర్21,మనంన్యూస్. మహానంది పుణ్యక్షేత్రం లో అలహాబాద్ హైకోర్టు జడ్జి అచాయ్ సచ్ దేవ్ కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు.బుధవారం స్వామివారి దర్శనార్థమై వచ్చిన వారికి ఆలయ ముఖమండపం వద్ద ఆలయ ఏ ఈఓ మధు, వేదపండితులు రవిశంకర్ అవధానిలు స్వాగతం పలికారు. అనంతరం శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆనవాయితి ప్రకారం కళ్యాణ మండపంలో వేద మంత్రోత్సరణ మధ్య కండువాతో సన్మానించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

శ్రీ మఠంలో దసరా వేడుకలు



- జమ్మి చెట్టుకు పూజలు చేసిన పీఠాధిపతులు

మంత్రాలయం , అక్టోబర్ 21, మనం న్యూస్ : ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో విజయదశమి(దసరా) వేడుకలు పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు అధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విజయదశమి ని పురస్కరించుకుని పాత ఊరులోని వెంకటేశ్వరస్వామి దేవాలయం లో వెంకటేశ్వరస్వామికి పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం వెండి రథోత్సవం పై శ్రీనివాసుని ఆధిష్టించి ప్రత్యేక పూజలు చేసి భక్తులు హర్షధ్వానాలు మధ్య ప్రాకారం లో ఊరేగించారు. అంతకుముందు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవత మంచాలమ్మ దర్శించుకున్నారు. ఉత్సవానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని ,మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. భక్తులకు పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు ఫల మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. సాయంత్రం దసరా పండగ ను పురస్కరించుకుని మఠంలో ఉన్న జమ్మి చెట్టుకు పీఠాధిపతులు పూజలు చేసి జమ్మి గ్రామస్తులకు ఆందజేశారు. ఈ కార్యక్రమంలో మఠం అధికారులు , గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

టీడీపీలో మాజీ సర్పంచ్ బూదరు లక్ష్మీరెడ్డి చేరిక

మంత్రాలయం , అక్టోబర్ 21,మనం న్యూస్ ;- మండల పరిధిలోని బూదరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మీరెడ్డి , తమ్ముడు రాఘవ రెడ్డి , గౌతమ్ రెడ్డి టీడీపీ లో చేరారు. మంగళవారం మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ఆయనకు టీడీపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపు కు కృషి చేస్తాన్నానారు. అనంతరం టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డికి లక్ష్మీరెడ్డి శాలువా కప్పి , పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు అబ్రహం , దాసు , మోసే , రొగప్ప , ఈరన్న , జయన్న మాజీ సర్పంచ్ నాగరాజు , తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు



- భారీ ఊరేగింపు అనంతరం అమ్మవారు నిమజ్జనం
- భారీ అన్నదానం ప్రత్యేక పూజలు నిర్వహించాము ఎస్ రాంబాబు తెలిపారు

కొత్తపల్లి , సెప్టెంబర్ 21 (మనం న్యూస్) యు కొత్తపల్లి మండలం అమీనాబాద్ పల్లెటూళ్లలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మరియు దసరా వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలు, సంప్రదాయాల నడుమ ముగిశాయి. పట్టణాలకు దీటుగా పల్లెల్లో సైతం తొమ్మిది రోజుల పాటు దుర్గాదేవి మండపాలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. గత 15 సంవత్సరాల నుండి నవరాత్రి ఉత్సవాలు వీవర్స్ ఏరియాలో ఘనంగా నిర్వహిస్తున్నారు అయితే .ఈ సంవత్సరం అమ్మవారి దయవల్ల మా కుటుంబం అనుకున్నవన్నీ జరిగాయని ఈ సందర్భంగా మా సొంత నిధులతో నవరాత్రులకు దుర్గా దేవి అమ్మవారి విగ్రహం ప్రతిష్టించి శీలమంతుల రాంబాబు ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించామని రాంబాబు తెలిపారు. అదేవిధంగా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టమని ఈ తొమ్మిది రోజుల పాటు రాంబాబు కుటుంబ సభ్యులు ప్రతిరోజూ అమ్మవారికి ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రుల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఉత్సవాల్లో భాగంగా నవమి రోజున శీలమంతుల రాంబాబు కుటుంబ సభ్యులు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయు రారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులు ఉత్సవాలను భక్తిపూర్వకంగా నిర్వహించారు. దశమి ఉత్సవాలు ముగింపుతో బుధవారం గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఊరేగించి ఘనంగా నిమజ్జనం చేశారు.

రాఘవేంద్రున్నిసన్నిధిలో కలెక్టర్ సిరి

మంత్రాలయం , అక్టోబర్ 20,మనం న్యూస్ ;- విజయదశమిని పురస్కరించుకుని ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి కుటుంబ సభ్యులతో మంగళవారం వచ్చారు. వారికి మఠం ఏఏ.ఓ మాధవశెట్టి , మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు స్వాగతం పలికారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని , ప్రత్యేక పూజలు చేసి , మంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ,మొక్కులు తీర్చుకున్నారు. వారికి మఠం పీఠాధిపతులు పట్టు చీర , ఫల మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. వారి వెంట , మఠం అధికా రులు , ఎస్ఐ మల్లికార్జున , హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున , కానిస్టేబుల్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు

తొలిరోజు ఎంపీటీసీ నామినేషన్లు దాఖలు కాలేదు

బేతంచేర్ల అక్టోబర్21 (మనం న్యూస్): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు నామినేషన్ల స్వీకరణ సంబంధించి అధికారులు కార్యాలయంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టినప్పటికీ అభ్యర్థుల నుంచి ఎలాంటి నామినేషన్లు వెయ్యలేదు ఈ సందర్భంగా రిటర్నింగ్ ఆఫీసర్ బషీరున్నిసా బేగం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఫజుల్ రహిమాన్ ఎక్స్టెండిచర్ అబ్జర్వర్ సునీల్ కుమార్ నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రానున్న రెండు రోజుల్లోనూ కొనసాగనుంది అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తమ నామినేషన్లను దాఖలు చేయవచ్చు

భవానీ భక్తులకు ఘనంగా అల్పాహార పంపిణీ

జర్నలిస్టు మురా రాజశేఖర్ ఆర్థిక సహకారం.. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

ఏలేశ్వరం, అక్టోబర్,21:-(మనం న్యూస్): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏలేశ్వరం పట్టణంలోని చైతన్యనగర్ కాలనీలో మంగళవారం సాయంత్రం భవానీ భక్తులకు అల్పాహార వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేకానంద సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో, జర్నలిస్టు మురా రాజశేఖర్ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని దానాల కన్నా అన్నదానం అత్యంత పవిత్రమైనదని, మానవసేవే మాధవసేవ అనే భావనతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భవానీ భక్తుల సేవ కోసం ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందించిన జర్నలిస్టు మురా రాజశేఖర్ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులతో ఆయన కుటుంబ సభ్యులంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు, భవానీ దీక్షాపరులు పాల్గొన్నారు.

కర్నూలు అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించండి

- మంత్రి టీజీ భరత్

కర్నూలుఅక్టోబర్ 21(మనంన్యూస్)ః కర్నూలు నగర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కర్నూలు నగరంలోని 4, 5వ వార్డుల్లో కూటమి మేయర్ అభ్యర్థి బొల్లెద్దుల విజయ ప్రత్యూషతో కలిసి మంత్రి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల నుంచి వైసీపీకి మేయర్ అభ్యర్థి దొరకలేదా? అని ప్రశ్నించారు. వైసీపీ కార్పొరేటర్లు గెలిచినా చేసేదేమీ లేదని విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకోవడమే వైసీపీకి తెలుసని, ప్రజలకు మేలు చేయడం తెలియదని అన్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, నగర ప్రగతికి అడ్డంకులు లేకుండా ముందుకు సాగాలంటే కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కర్నూలు నగరంలో రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా నగర అభివృద్ధికి మరిన్ని అవకాశాలు కల్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో కర్నూలును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ప్రచారంలో 4వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సుశీల భాయి, 5వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి ఉట్ల రమేష్ బాబు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన టీడీపీ నాయకులు

ఏలేశ్వరం,అక్టోబర్, 21:-(మనం న్యూస్): ఏలేశ్వరం మున్సిపాలిటీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా 2, 3, 27, 28 వార్డుల నుండి బూడి సూరిబాబు, తుమ్మి విజయ్, యర్రంశెట్టి నాగబాబు, వీరబాబు, బంక రాజు, ఆటో యూనియన్ మాజీ ప్రెసిడెంట్ వసంత్ కుమార్, కొల్లి నాగేశ్వరావు, మాదేపల్లి దొరబాబు, ఇండియన్ రాజు తదితరులు టీడీపీ నుంచి వైసీపీలో చేరారు. ఏలేశ్వరం మున్సిపాలిటీ వైసీపీ చైర్మన్ అభ్యర్థి బదిరెడ్డి ఆశలత గోవింద్, నాయకులు సిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, పైల విజయ్, పేకల జాన్, డేగల చంద్రమౌళి, జువ్వినా వీర్రాజు, భజంతుల లక్ష్మణరావు, సిరిపురపు రాజేష్ తదితరుల ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ప్రత్తిపాడు వైసీపీ ఇన్చార్జి ముద్రగడ గిరిబాబు సమక్షంలో పార్టీలో చేరిన నాయకులకు ఆయన వైసీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ఏలేశ్వరం మున్సిపాలిటీలో వైసీపీ జెండా ఎగురవేసేందుకు ఇప్పటికే పార్టీలో ఉన్న నాయకులు, పార్టీలో నూతనంగా చేరిన నాయకులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పార్టీలో నూతనంగా చేరిన నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయి వైసీపీలో చేరినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, పెన్షన్ల విషయంలోనూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఏలేశ్వరం మున్సిపాలిటీలో వైసీపీ విజయానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దత్తి రాజా,లోగీసు శేఖర్, బీశెట్టి రాజా, గొడుగు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు..

దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ నేత ప్రదీప్ రెడ్డి

మంత్రాలయం ,అక్టోబర్ 21, మనం న్యూస్ : విజయ దశమిని పురస్కరించుకుని మంత్రాలయం లోని రాఘవేంద్ర పురం లోని ప్రధాన రహదారి పై కొలువుదీరిన దుర్గా మాత అమ్మవారిని వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతి ఇచ్చారు. అనంతరం ఆయన కు శ్రీ భవానీ యూత్ సభ్యులు, వేద పండితులు తీర్థ ప్రసాదాలను అందజేసి, శాలువ కప్పి సన్మానించారు. అదే విధంగా తాయమ్మ అవ్వకు, శ్రీ మల్లికార్జున స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు. పూజారులు హోటల్ పరమేష్, వీరేష్ స్వామి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వాదించారు. అనంతరం దుర్గా దేవి విగ్రహం ఏర్పాటు చేసిన శ్రీ భవానీ యూత్ రూ 20 వేలు, నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు మాజీ సర్పంచ్ భీమయ్య , మాజీ ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ , గోరుకల్లు కృష్ణ స్వామి, కురువ మల్లికార్జున, శివకుమార్, జనార్దన్ రెడ్డి, వీకేసీ రాఘవేంద్ర, వీరారెడ్డి, బాలరాజు, రామాంజి, గాలెప్ప, మారెప్ప, వీరేష్, భీమ, సుంకన్న, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా సాగుతున్న నామినేషన్ దాఖలు

జూపాడుబంగ్లా అక్టోబర్ 21 (మనం న్యూస్): జూపాడుబంగ్లా మండలంలోని ఎంపీడీవో కార్యాలయం మొదటి రోజు అక్టోబర్ 21వ తారీకున ఎంపీటీసీ, జడ్పిటిసి, నామినేషన్ దాఖలు ప్రశాంతంగా జరిగాయి. జూపాడుబంగ్లా మండలం తుడిచర్లకు చెందిన రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్ ఎంపిటిసి అభ్యర్థిగా జూపాడు బంగ్లా ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, త్రాగునీరు, రహదారులు, విద్యా, వైద్యం, సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు, నామినేషన్ సమయంలో నందికొట్కూరు రూరల్ సిఐ టి సుబ్రహ్మణ్యం, జూపాడుబంగ్లా ఎస్సై మల్లికార్జున, 144 సెక్షన్ అమలు చేసి భారీ పోలీసు బందోబస్తుతో ఎంపిటిసి, జడ్పిటిసి, నామినేషన్లను ప్రశాంత వాతావరణంలో ప్రశాంతంగా జరిగించారు.

పాలకొల్లు నియోజకవర్గం జడ్పిటిసి, ఎంపీపీ అభ్యర్థులు ఖరారు

- పేర్లు ప్రకటించిన మంత్రి నిమ్మల

పాలకొల్లు, అక్టోబర్ 21,మనం ప్రతినిధి: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం లోని పాలకొల్లు మండలం, ఎలమంచిలి మండలం, పోడూరు మండలం జడ్పిటిసి, ఎంపీపీ అభ్యర్థులను ఏపీ రాష్ట్ర జలవనరు ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం ఖరారు చేశారు. పాలకొల్లు జడ్పిటిసి అభ్యర్థిని గా మేడిది ఉషారాణి,పోడూరు మండలం జడ్పిటిసి అభ్యర్థిని గా దాసరి మిస్సమ్మ, పాలకొల్లు మండలం ఎంపీపీ అభ్యర్థి గా అంగర వీరభద్ర కుమార్, ఎలమంచిలి మండలం ఎంపీపీ అభ్యర్థులుగా పీతల శ్రీనివాస్, తాళ్ల నాగరాజులను మంత్రి నిమ్మల ఖరారు చేసి ప్రకటించారు.

మొదటి రోజు ఒకే నామినేషన్ దాఖలు

గూడూరు, అక్టోబర్ 21 (మనం న్యూస్): గూడూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి బుధవారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో మొదటి రోజు ఒకే నామినేషన్ దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి బీ. కర్రెన్న తెలిపారు.

గూడూరు మండలంలోని బూడిదపాడు గ్రామ ఎంపీటీసీ స్థానానికి అభ్యర్థి డి. సరస్వతి నామినేషన్ దాఖలు చేసినట్లు ఆయన వెల్లడించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థి సరస్వతి, టీడీపీ మండలాధ్యక్షుడు సురేశ్తో పాటు రామాంజనేయులు, బ్రహ్మయ్య, బీజేపీ నాయకుడు రాజూభాయ్ తదితరులు నామినేషన్ కేంద్రానికి వచ్చారు.

మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎన్నికల సందడి నెలకొంది. నిబంధనల ప్రకారం నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ వేగంగా పూర్తి చేయాలి

ఈ నెల 26వ తేదీలోపు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలి

ఓటర్లకు స్లిప్పులు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదు

చరవాణి ద్వారా వార్డు, పోలింగ్ కేంద్రం వివరాలుతెలుసుకునే సౌలభ్యం

అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 28న జరగనున్న పోలింగ్కు సంబంధించి ఓటరు స్లిప్పుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, ఈ నెల 26వ తేదీలోపు పూర్తి చేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్వీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో స్వర్ణ వార్డు కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి, ఓటరు స్లిప్పుల ప్రతులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో ఓటరు స్లిప్పుల పంపిణీ కీలకమైనదని, ప్రతి ఓటరుకు స్లిప్పు అందేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. స్లిప్పు ఇచ్చాక రశీదుపై కుటుంబంలో ఒకరి నుంచి సంతకం తీసుకోవాలని సూచించారు. ఓటర్లు తమ వార్డు, పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకోవాలంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్సైట్ ఖ్ఖఖ://ట్ఛఛి-ఛ్ఛుట్ఛఞజొఠి.ఙ్ఙి ద్వారా వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు.

ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సమాచారాన్ని అందిస్తూ, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి

ఐదేళ్ల విరామానికి తెర.. షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా దసరా!

కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని పిలుపు.

కామారెడ్డిలో 36 ఏళ్ల దసరా ఉత్సవాల సంప్రదాయానికి అండగా షబ్బీర్ అలీ ఫౌండేషన్.

కామారెడ్డి, అక్టోబర్ 21 (మనం న్యూస్); ఐదేళ్ల విరామం తర్వాత కామారెడ్డి పట్టణంలో దసరా ఉత్సవాలకు మళ్లీ వైభవం సంతరించుకుంది. షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన విజయదశమి వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజల మధ్య మతసామరస్యం, సోదరభావం, ఐక్యతను పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆయన దసరా పండుగ ప్రాముఖ్యతను వివరించారు.

36 ఏళ్ల సంప్రదాయానికి మళ్లీ ఊపిరి.

కామారెడ్డి పట్టణంలో దాదాపు 36 ఏళ్లుగా షబ్బీర్ అలీ ఫౌండేషన్, దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు నిర్వహిస్తున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. ప్రజలందరూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఒకే వేదికపై కలుసుకుని పండుగలను ఆనందంగా జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ సంప్రదాయాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కరోనా మహమ్మారి ప్రభావం, ఇతర పరిస్థితుల కారణంగా గత ఐదేళ్లుగా ఉత్సవాలను నిర్వహించలేకపోయామని చెప్పారు. ఇన్నాళ్ల విరామం తర్వాత మళ్లీ ఇందిరాగాంధీ స్టేడియంలో దసరా వేడుకలను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, సహకారం ఈ కార్యక్రమాల నిర్వహణకు ప్రధాన బలమని పేర్కొన్నారు.

ప్రజల ఐక్యతే లక్ష్యంగా ఉత్సవాల పునఃప్రారంభం.

దసరా వేడుకలను కేవలం పండుగ సంబరాలకే పరిమితం చేయకుండా, సమాజంలో ఐక్యతను చాటే వేదికగా నిర్వహించాలన్నదే తమ ఉద్దేశమని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. పండుగలు ప్రజలను దగ్గర చేస్తాయని, పరస్పర గౌరవం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. తెలంగాణకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన గంగా జమునా తెహజీబ్ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం సమాజానికి గర్వకారణమని వివరించారు.

చెడుపై మంచి విజయమే విజయదశమి.

విజయదశమి చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక అని షబ్బీర్ అలీ అన్నారు. దుర్గాదేవి మహిషాసురుడిపై సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ జరుపుకునే ఈ పండుగ ప్రజల్లో ధైర్యం, విశ్వాసం, న్యాయం పట్ల నిబద్ధతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడుస్తూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలి.

విజయదశమి సందర్భంగా అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు షబ్బీర్ అలీ తెలిపారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని కోరుకున్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి.

కామారెడ్డి పట్టణ ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సంతోషాలు నిండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల భాగస్వామ్యంతో భవిష్యత్తులోనూ ఇలాంటి సాంస్కృతిక, సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తూ మన సంస్కృతిని భావితరాలకు అందించేందుకు కృషి చేస్తామని మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. ఐక్యత, మతసామరస్యం, సంప్రదాయ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఐదేళ్ల విరామం తర్వాత నిర్వహించిన ఈ విజయదశమి వేడుకలు కామారెడ్డిలో పండుగ వాతావరణాన్ని నింపాయి.

పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం.

కారుణ్య నియామకాలను వేగవంతం చేస్తాం.

కలెక్టర్ ఇలా త్రిపాఠి, సిపి సాయి చైతన్య.

నిజామాబాద్, అక్టోబర్ 21 (మనం బ్యూరో): శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం నిజామాబాద్ పోలీస్ హెడ్క్వార్టర్స్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., అమరుల కుటుంబాలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అండగా ఉంటాయని, కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ., నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 1986 నుంచి ఇప్పటివరకు 21 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. ఇప్పటికే 11 మంది అమరుల కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించామని, మిగిలిన కుటుంబాలకు స్థలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అమరుల కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారిని నియమిస్తామని, పోలీసు అధికారులు వారి అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ శుభం ప్రకాష్, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అమరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు.

సీఎం మాన్ను 3 గంటలు నిర్బంధించారు: ఆప్ ఆరోపణలు

ఢిల్లీ, అక్టోబర్ 21 : పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పారిస్ వెళ్లి తిరిగొస్తుండగా ఢిల్లీ విమానాశ్రయంలో మూడు గంటల సేపు అడ్డుకున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఆరోపించింది. రూ.50వేలు చలానా విధించారని పేర్కొంది. మాన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, పదే పదే అడ్డంకులు సృష్టిస్తోందంటూ విమర్శలు గుప్పించింది. ఈ మేరకు ఆ పార్టీ మీడియా ఇన్ఛార్జి బల్తేజ్ పన్ను మీడియాతో మాట్లాడారు. 'మీ లగేజీ వస్తోంది. చెక్ చేస్తున్నాం' అంటూ మాన్ను కావాలనే విమానాశ్రయంలో ఆపారు. దాదాపు మూడు గంటల పాటు నిర్బంధించారు. తీరా లగేజీ వాహనంలో పెట్టుకుని వెళ్తుండగా ఓ అధికారి పరిగెత్తుకుంటూ వచ్చి రూ.50వేలు చలానా విధించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఇలా విమానాశ్రయంలో నిర్బంధించి, రూ.50వేలు చలానా విధించి అవమానిస్తారా?'' అని పన్ను ప్రశ్నించారు.అయితే, చలానా ఎందుకు విధించారనే దానిపై ఆప్ స్పష్టత ఇవ్వలేదు. పారిస్ 2026 ఫుడ్ ఎగ్జిబిషన్లో పంజాబ్ ఉత్పత్తులను ప్రమోట్ చేయడానికి మాన్ వెళ్లేందుకు కూడా కేంద్రం అనుమతి నిరాకరించిందని ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ ఎక్స్లో పోస్ట్ పెట్టారు. చివరికి హైకోర్టు జోక్యంతో వెళ్లారని పేర్కొన్నారు. మరోవైపు ఇదే అంశంపై శిరోమణి అకాలీ దళ్ నేత బిక్రం సింగ్ మజితియా మాట్లాడారు. పరిమితికి మించి అనుమతి లేకుండా డబ్బు లేదా లగేజీ తీసుకెళ్లారనే కారణంతోనే కస్టమ్స్ అధికారులు మాన్, ఆయన భార్య గుర్ ప్రీత్ కౌర్ ను దాదాపు మూడు గంటలు పాటు ఆపారని పేర్కొన్నారు. మాన్ ముఖ్యమంత్రి హోదాలో ఉండడంతో విడిచిపెట్టారని ఆయన తెలిపారు.

ఫ్రాన్స్ అల్లర్లలో అమెరికా తీవ్రవాదులు

పారిస్, అక్టోబర్ 21 : ధరల పెరుగుదల, దుర్భరమైన జీవన వ్యయం వంటి సమస్యలపై నిరసన ప్రదర్శనల సందర్భంగా ఫ్రాన్స్లోని సిటీ హాళ్లు, ఇతర ప్రభుత్వ భవనాలు, వేలాది వాణిజ్య సంస్థలపై ఉద్యమకారులు దాడులకు పాల్పడుతున్నారు. దీంతో అక్కడి ప్రభుత్వం కర్ఫ్యూలు విధించాల్సి వచ్చింది. అయినప్పటికీ అల్లర్లు ఆగట్లేదు. తీవ్రమవుతున్న ఈ ఆందోళనల్లో చేరడానికి అమెరికా నుంచి కొంతమంది యాక్టివిస్టులు, తీవ్రవాద భావజాలం ఉన్న వ్యక్తులు పారిస్కు వెళ్లినట్లు అగ్ర రాజ్యానికి చెందిన మీడియా సంస్థలు సంచలన కథనాలను వెలువరించాయి. వాటి ప్రకారం.. అల్లర్లలో పాల్గొనడానికి మిన్నెసోటా నుంచి ఓ ర్యాపర్ ఇటీవల ఫ్రాన్స్కు వెళ్లారు. అంతటితో ఆగకుండా పారిస్లో బీభత్సం సృష్టించాలని సోషల్ మీడియా వేదికగా శ్వేత జాతీయులకు పిలుపునిచ్చారు. అమెరికాలోనూ ఇటువంటి నిరసనలు లేవనెత్తాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు అమెరికాకు చెందిన కోడ్ పింక్ అనే సంస్థ ఫ్రాన్స్ను ఆదర్శంగా తీసుకొని అగ్ర రాజ్యంలోనూ ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. నవంబర్ 10 నుంచి 12 మధ్య వాషింగ్టన్లో 'పన్ను చెల్లింపుదారుల తిరుగుబాటు' నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఫ్రాన్స్లో నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో వారాంతంలో దేశవ్యాప్తంగా సుమారు 2,500 మంది ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా దాడుల్లో దాదాపు 1,000 మంది అధికారులు గాయపడినట్లు తెలిపారు. అల్లర్లపై ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ మాట్లాడుతూ.. తమ దేశంలో నెలకొన్న హింసకు తీవ్రవాద వామపక్ష బృందాలకు చెందిన తిరుగుబాటుదారులు, నేరగాళ్లు కారణమని ఆరోపించారు. ఫ్రాన్స్లో నిరసనలకు వలసదారులే కారణమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోపించిన నేపథ్యంలో మేక్రాన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

వాయు కాలుష్యం ఎఫెక్ట్
మళ్లీ ఆంక్షల చట్రంలోకి ఢిల్లీ



ఢిల్లీ, అక్టోబర్ 21 : దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మళ్లీ పడగ విప్పుతోంది. స్థానికంగా వాయు నాణ్యత సూచీ దిగజారడంతో 'సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్ మెంట్' ఈ సీజన్లో తొలిసారి ఆంక్షలు విధించింది. ఢిల్లీ - ఎన్సీఆర్ పరిధిలో 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-1 నిబంధనలను తక్షణమే అమల్లోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సీఏక్యూఎం చైర్ పర్సన్ రాజేశ్ వర్మ అధ్యక్షతన ఢిల్లీ ఉన్నతాధికారులు, పలు ప్రభుత్వ ఏజెన్సీలతో సమీక్షా సమావేశం జరిగింది. నగరంలో వాయు కాలుష్య సమస్యలను సమీక్షించడంతో పాటు రాబోయే రోజుల్లో కాలుష్య నివారణ చర్యల్ని బలోపేతం చేయడంపై చర్చించారు.

ఢిల్లీలో ఈ నెల 20న వాయు నాణ్యత సూచీ 179గా (మధ్యస్థ కేటగిరీ) నమోదు కాగా.. బుధవారం మధ్యాహ్నం 2గంటలకు 244 (పూర్ కేటగిరీ)కి ఒక్కసారిగా పెరిగిందని సీఏక్యూఎం ఓ ప్రకటనలో పేర్కొంది. రాబోయే రోజుల్లో వాయు నాణ్యత సూచీ 'పూర్' కేటగిరీలోనే ఉంటుందని భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు అంచనా వేసినట్లు తెలిపింది. వాయు నాణ్యత మరింతగా క్షీణించకుండా నిరోధించేందుకు జీఆర్ఏపీ-1 నిబంధనలను వెంటనే అమలు చేయాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రాప్-1 కింద హోటళ్లు, రెస్టారంట్లలో ఇంధనంగా బొగ్గు, వంట చెరకు వినియోగం నిషేధం, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డీజిల్ జనరేటర్ల వాడకానికి అనుమతించడం వంటి ఆంక్షలను అమలు చేస్తున్నట్లు పేర్కొంది.

వేరే దేశానికి యురేనియం తరలించే ప్రసక్తే లేదు

- **ఇరాన్ భద్రతా మండలి కార్యదర్శి మొహసెన్ రెజాయీ**

టెహ్రాన్, అక్టోబర్ 21 : పశ్చిమాసియాలో ఘర్షణలు ముగించేలా అమెరికా.. ఇరాన్ మధ్య పాకిస్థాన్ రాయబారం కొనసాగిస్తూనే ఉంది. సంధిపై ముందుకెళ్లే క్రమంలో తమ షరతులను పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్కు ఇరాన్ స్పష్టంగా చెప్పింది. తాము శుద్ధి చేసిన యురేనియాన్ని వేరే దేశానికి తరలించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది.

''శుద్ధి చేసిన యురేనియంలో ఒక్క గ్రాము కూడా ఇరాన్ నుంచి బయటకు వెళ్లదు. మాకు నమ్మకం కుదిరేలా అమెరికా చర్యలు తీసుకునే వరకు ఎలాంటి చర్చలు ఉండవు. ఇరాన్ విధించిన అన్ని షరతులను నెరవేర్చడంతోనే ఆ చర్చల ప్రక్రియ ప్రారంభం కావాలి'' అని ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహసెన్ రెజాయీ ఎక్స్లో పోస్టు పెట్టారు. మధ్యవర్తిత్వం కోసం ఇరాన్ వెళ్లిన జనరల్ మునీర్కు మొహసెన్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అప్పటి వరకు హర్మూజ్ మూసే ఉంటుంది..

''హర్మూజ్ జలసంధి విషయంలో ఎలాంటి గందరగోళ వైఖరి లేదు. అమెరికా మా షరతులు అంగీకరించేంత వరకు హర్మూజ్ మూసే ఉంటుంది. ఇప్పటికే వెళ్తున్న మార్గాల్లో ఓడలకు సమస్యలు ఎదురవుతాయి. గత హామీలను అమెరికా గౌరవించేవరకు కొత్తగా చర్చలు ఏమీ ఉండవు'' అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఓ ఇంటర్వ్యూలో పునరుద్ఘాటించారు.

వలసలపై ట్రంప్ ఉక్కు పాదం..
3 లక్షల వీసాల రద్దు



వాషింగ్టన్, అక్టోబర్ 21 : అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై ఉక్కు పాదం మోపుతున్న డొనాల్డ్ ట్రంప్.. వీసాల విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో రెండోసారి అధికారంలో వచ్చినప్పటి నుంచి ఆయన సుమారు మూడు లక్షల వీసాలను రద్దు చేసినట్లు తెలిసింది. వీటిలో 'బర్త్ టూరిజం' కోసం వచ్చినవారివే ఎక్కువ ఉన్నాయి. అలాంటి చర్యలకు సహకరించారని ఆరోపణలు ఉన్నవారికి సంబంధించిన నాలుగు వేల వీసాలూ అందులో ఉన్నట్లు సమాచారం.

మిగిలిన వారు హింస, ప్రజా భద్రతకు ముప్పు, మోసం, తప్పుడు సమాచార వ్యాప్తి, మద్యం తాగి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడినట్లుగా స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. వాటిని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ పిగాట్ ధ్రువీకరించారు. అయితే, రద్దు చేసిన వీసాదారుల్లో ఏ దేశీయులు ఎక్కువ మంది ఉన్నారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. చరిత్రలో మరే అధ్యక్షుడు చేయని విధంగా ట్రంప్ అత్యధిక వీసాలు రద్దు చేసినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. అమెరికాలో ఉంటూ చట్టాన్ని ఉల్లంఘించేలా, జాతీయ భద్రతకు ముప్పు కలిగించేలా వ్యవహరించే విదేశీ పౌరులపై తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. మొత్తం రద్దయిన మూడు లక్షల వీసాల్లో రెండున్నర లక్షలు గతేడాది జనవరిలో రద్దు చేసినట్లు తెలిపారు.

గతేడాది జనవరిలో ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం అక్రమ వలసదారులను వెనక్కి పంపించే కార్యక్రమం చేపట్టారు. దీంతోపాటు సోషల్ మీడియా వెట్టింగ్ (వీసా జారీ చేయడానికి ముందు అభ్యర్థి సోషల్ మీడియా ఖాతాలన్నీ పరిశీలించడం)తో పాటు స్క్రీనింగ్ను విస్తృతం చేశారు. స్థానిక చట్టాలను ఉల్లంఘించే వారి వీసాల రద్దును ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే వీసాల రద్దు గతంతో పోలిస్తే రెట్టింపు అయినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. గడువు ముగిసినా అక్రమంగా దేశంలో ఉండటం, స్థానిక చట్టాలను ఉల్లంఘించడం లాంటి పనులు చేస్తున్న విదేశీ విద్యార్థులపైనా ట్రంప్ యంత్రాంగం నిఘా పెట్టింది.

మస్క్ ఆదేశాలతోనే ఉక్రెయిన్కు 'స్టార్లింక్' షాక్

వాషింగ్టన్, అక్టోబర్ 21 : భారత్లో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందించాలని తహతహలాడుతున్న స్టార్లింక్ అధిపతి ఎలాన్ మస్క్కు సంబంధించి సంచలన విషయం ఒకటి వెలుగులోకి వచ్చింది. స్టార్లింక్ ఉపగ్రహ నెట్వర్క్ నెమ్మదించడం వల్లే ఇటీవల ఉక్రెయిన్లో డ్రోన్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. అయితే, ఆ సందర్భంలో నెట్వర్క్ వేగాన్ని తగ్గించాల్సిందిగా మస్క్ స్వయంగా ఆదేశించినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థ కథనం పేర్కొంది. ఈ మేరకు ఇద్దరు అమెరికా అధికారులు, సంబంధిత వర్గాలను ఉటంకించింది. ఉద్దేశపూర్వకంగా నెట్వర్క్ వేగాన్ని తగ్గించాలని మస్క్ ఆదేశించారని, ఆ నిర్ణయం ఉక్రెయిన్లో ఆందోళన రేకెత్తించిందని ఆ వర్గాలు వెల్లడించాయి. ఇదంతా అమెరికా యంత్రాంగాన్ని అయోమయానికి గురిచేసిందని పేర్కొన్నాయి. ఇటీవల రష్యాతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డీజిల్ ఒప్పందం కుదుర్చుకున్న సమయంలోనే యుద్ధ రంగంలో ఉక్రెయిన్ డ్రోన్లు వేగాన్ని కోల్పోయాయి. అమెరికా మద్దతు సన్నగిల్లడంతో రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ వాడుతున్న స్టార్లింక్ కమ్యూనికేషన్ పరికరాలపై మస్క్ నియంత్రణలు విధించినట్లు వార్తలు రాగా.. వాటిని ఆయన అప్పుడు తోసిపుచ్చారు. స్టార్ షీల్డ్ (సైనిక అవసరాల కోసం ఉపయోగించే స్టార్లింక్) అమెరికా ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటుందని నాడు మస్క్ వివరణ ఇచ్చారు. స్టార్లింక్ సేవల కోత విషయంలో తమకు ఎలాంటి సంబంధం లేదని యూఎస్ రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇప్పటికే స్పష్టం చేశారు. ''సేవల వేగం విషయంలో మేం ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. ఉక్రెయిన్ విజయం సాధించాలని మేం కోరుకుంటున్నాం'' అని వివరణ ఇచ్చారు.

పారిస్లో లగ్జరీ స్టార్ల లూటీ..
సెకండ్హ్యాండ్ మార్కెట్లో అమ్మకం..!

పారిస్, అక్టోబర్ 21 : ఆందోళనలతో అట్టుడుకుతున్న ఫ్రాన్స్లో వందల సంఖ్యలో దుకాణాలను, షోరూమ్లను అల్లరి మూకలు దోచుకొన్నాయి. దోచుకొన్న ఆ వస్తువులను అల్లరి మూకలు ఆన్లైన్ సెకండ్ హ్యాండ్ మార్కెట్లో విక్రయానికి పెట్టాయి. ఫ్రెంచి రీటైల్ అండ్ బ్రేడ్ ఫెడరేషన్ అంచనా ప్రకారం ఫ్రాన్స్లో ఈ ఆందోళనల వేళ సుమారు 1500 దుకాణాలు లూటీకి గురయ్యాయి. వీటిల్లో లగ్జరీ బ్రాండ్లయిన లూయిస్ విటాన్, ఎర్మెస్, రోలెక్స్, యాపిల్, సెలిన్ సెఫోరా, బర్బెర్రీ షోరూమ్లు కూడా ఉన్నాయి.

లగ్జరీ డిజైనర్ బ్యాగ్లు, వాచ్లు, ఫోన్లు ఫ్రాన్స్లోని ప్రఖ్యాత ఆన్లైన్ సెకండ్హ్యాండ్ వెబ్సైట్ వింటెడ్లో అమ్మకానికి దర్శనమిచ్చాయి. ఈ విషయాన్ని ఫ్రాన్స్ ప్రభుత్వం కూడా గుర్తించింది. సాధారణంగా ఫ్రాన్స్లోని డిజైనర్ వస్తువులు విక్రయించే రియల్ రియల్ వంటి వెబ్సైట్లలో లగ్జరీ వస్తువులను సెకండ్హ్యాండ్ మార్కెట్లో విక్రయానికి పెట్టినప్పుడు వాటిని నిపుణులు పరిశీలించి ధ్రువీకరిస్తారు. కానీ, వింటెడ్లో మాత్రం అమ్మకానికి ఉంచిన వ్యక్తి నేరుగా దానిని కొనుగోలుదారుడికి విక్రయించేలా (పీర్ టూ పీర్) అవకాశం ఉంది. దీంతో ఫ్రాన్స్లో అత్యధిక కస్టమర్ బేస్ ఉన్న వెబ్సైట్ ఇదే. ఈ అంశం అల్లరి మూకలకు అనువుగా మారింది.

ఈ వ్యవహారంపై ఫ్రాన్స్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఆ దేశ డిజిటల్ మినిస్టర్ అన్నె లెహన్నాఫ్ స్పందిస్తూ.. ''దోచుకొన్న లగ్జరీ

వస్తువులను కొన్ని ఆన్లైన్ ప్లాట్ఫామ్లో విక్రయిస్తున్నారు. అలాంటి చర్యలను చూస్తూ ఊరుకోం. ఈ ప్లాట్ఫామ్లే స్వచ్ఛందగా అటువంటి అనుమానాస్పద వస్తువులను తమ వేదికల నుంచి తొలగించాలి. వీటిని విక్రయించే వారిని పట్టుకొని శిక్షించేందుకు ఆన్లైన్ వేదికలు ప్రభుత్వానికి సహకరించాలి'' అని హెచ్చరించారు. దీనికి వింటెడ్ కూడా స్పందించింది. తాము అటువంటి వస్తువులను తొలగిస్తున్నామని పేర్కొంది. అల్లరి మూకల నుంచి తమ స్టోర్లను కాపాడుకోవడానికి డియోర్ సంస్థ ఏకంగా ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీని నియమించుకొంది. ఫ్రాన్స్లో అల్లర్ల వ్యాప్తిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. ప్రస్తుత అల్లర్లకు వలసలే కారణమని నిందించారు. ప్రపంచం మొత్తం నుంచి జనాభాను ఫ్రాన్స్కు తీసుకురావడం ఓ తప్పని మేక్రాన్ను తాను చాలా కాలం క్రితమే హెచ్చరించినట్లు తెలిపారు. ఫ్రాన్స్లో అల్లర్లకు స్కూళ్లతో సంబంధం లేదని ట్రంప్ పేర్కొన్నారు. అతి త్వరలోనే పారిస్ ముస్లిం నగరంగా మారిపోతుందని వ్యాఖ్యానించారు.

శత్రుడ్రోన్లకు చెక్పెట్టేలా...
ఉక్రెయిన్ కొత్త ఆయుధం!

కీవ్, అక్టోబర్ 21 : రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్న విషయం మనందరికీ తెలిసిందే. అయితే, శత్రుదేశాల డ్రోన్లను సమర్థంగా అడ్డుకునేందుకు ఉక్రెయిన్కు చెందిన బ్లూబర్డ్ టెక్ సంస్థ కొత్త ఆయుధాన్ని తయారు చేసింది. శత్రువుల దాడి జరిగినప్పుడు, ఎటువంటి ఆయుధం అందుబాటులో లేనప్పుడు, అత్యవసర సమయాల్లో ప్రాణరక్షణకు ఉపయోగపడేలా 'యాంటీ-డ్రోన్ నెట్ లాంచర్'ను అభివృద్ధి చేశారు. సరిహద్దుల్లోని సాధారణ పౌరుల భద్రతకు ఈ ఆవిష్కరణను అందుబాటులోకి తెచ్చారు

కిమ్ కోమాలో ఉన్నారంటూ వార్తలు..
ఫొటోలతో చెక్ పెట్టిన ఉత్తర కొరియా

ప్యాంగాంగ్, అక్టోబర్ 21 : ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ తీవ్ర అనారోగ్యంతో చైనాలో చికిత్స పొందుతున్నట్లు పలు మీడియాల్లో కథనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం ఆయన కోమాలో ఉన్నారని పేర్కొన్నాయి. మరోవైపు కిమ్ అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయారని.. ఆయన సోదరి కిమ్ యో జోంగ్ ఉత్తర కొరియాను తన అధీనంలోకి తీసుకున్నారని చైనా అసమ్మతివాది వాంజున్ షీ సోషల్ మీడియాలో వరుస పోస్టులు చేశారు. అందువల్లే ఆయన కొంతకాలంగా బహిరంగంగా కనిపించట్లేదన్నారు. దీంతో కిమ్ ఆరోగ్యంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఈ వార్తలకు ఉత్తరకొరియా ప్రభుత్వ మీడియా కిమ్ ఫొటోలతో చెక్ పెట్టింది. అందులో కిమ్ తన కుమార్తెతో కలిసి షాపింగ్ చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సోమవారం(రెండురోజుల క్రితం) వారు షాపింగ్కు వెళ్లిన సమయంలో ఈ ఫొటోలు తీసినట్లు తెలుస్తోంది.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం
- ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలను ఎప్పటికీ మరువంꣳ
- ప్రజలకు నిబద్ధతతో సేవ చేయడమే అమరవీరులకు నిజమైన నివాళిꣳ
- అమరవీరుల త్యాగం వృథా కానివ్వం
- ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం చట్టాన

సూర్యాపేట, అక్టోబర్ 21 (మనం ప్రతినిధి): ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో అమరులైన పోలీసు వీరుల త్యాగాలు చిరస్మరణీయమని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం, పోలీసు ఫ్లాగ్ డే సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో దేశ వ్యాప్తంగా ప్రాణాలు అర్పించిన 154 మంది అమరవీర జవాన్ ల పేర్లను అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి స్మరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కేవలం గతంలో ప్రాణత్యాగం చేసిన పోలీసు వీరులను స్మరించుకునే రోజు మాత్రమే కాదని, వారి త్యాగాల నుంచి స్ఫూర్తి పొంది ప్రజలకు మరింత నిబద్ధతతో సేవలు అందించాలని ప్రతిజ్ఞ చేసే రోజని పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబాలతో ప్రశాంతంగా జీవించడానికి, సమాజంలో శాంతిభద్రతలు కొనసాగడానికి, మహిళలు, పిల్లలు, వృద్ధులు భయం లేకుండా జీవించడానికి పోలీసు సిబ్బంది నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. పోలీసు ఉద్యోగం కేవలం ఒక ఉద్యోగం కాదని, అది బాధ్యత, నిబద్ధత, సేవాభావంతో కూడిన పవిత్రమైన వృత్తి అని అన్నారు. విధి నిర్వహణలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ఎదురవుతుందో తెలియని పరిస్థితుల్లోనూ ప్రజల రక్షణే లక్ష్యంగా పోలీసులు ముందుకు సాగుతారని పేర్కొన్నారు. పోలీసు యూనిఫాం కేవలం దుస్తులు మాత్రమే కాదని, ప్రజలు పోలీసు శాఖపై ఉంచిన నమ్మకానికి, గౌరవానికి ప్రతీక అని తెలిపారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యత అని స్పష్టం చేశారు. సూర్యాపేట గడ్డపై ప్రాణత్యాగం చేసిన పోలీసు వీరులుꣳ తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పై నక్సల్స్ చేసిన దాడిలో హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్ అమరుడైనారు. సూర్యాపేట పట్టణంలోని హైటెక్ బస్టాండ్ వద్ద 2015 ఏప్రిల్ 2న వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులపై ఉగ్రవాదులు దాడిలో కానిస్టేబుల్ ఎం. లింగయ్య, హోంగార్డు కె. మహేష్ తమ ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. నాగారం పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శీలం కమలాకర్ ను కారు డికొనడంతో అమరులైనారు. ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వారి త్యాగం పోలీసు శాఖకు, వారి కుటుంబాలకు తీరని లోటని పేర్కొన్నారు. వారి పేర్లను స్మరించుకోవడం అంటే కేవలం వారి సేవలను గుర్తుచేసుకోవడం మాత్రమే కాదని, ప్రజల భద్రత కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉండే పోలీసు ధర్మాన్ని గుర్తుచేసుకోవడమని అన్నారు. అమరులైన పోలీసు వీరుల త్యాగాలు ఎప్పటికీ వృథా కావని, వారి ధైర్యం, కర్తవ్యనిష్ఠ, సేవాభావం నేటి పోలీసు సిబ్బందికి మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించడంలో ప్రతి పోలీసు సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ అమరవీరుల ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

అమరవీరుల కుటుంబాలకు నిరంతరం అండగా ఉంటాం

విధి నిర్వహణలో ఒక పోలీసు అధికారి లేదా సిబ్బంది ప్రాణాలు కోల్పోయినప్పుడు వారి కుటుంబం అపారమైన బాధను ఎదుర్కొంటుందని ఎస్పీ పేర్కొన్నారు. ఒక కుటుంబం తన ఆత్మీయుడిని, ఒక భార్య తన జీవిత భాగస్వామిని, ఒక తల్లి తన బిడ్డను, ఒక చిన్నారి తన తండ్రిని కోల్పోయే పరిస్థితి ఎంతో బాధాకరమని అన్నారు. అమరవీరుల కుటుంబాలు ఎదుర్కొనే బాధను ఏ మాటలూ పూర్తిగా తీర్చలేవని, వారు కోల్పోయిన ఆత్మీయుల స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని తెలిపారు. అయితే, వారి కుటుంబాల సంక్షేమాన్ని పరిరక్షించడం, వారి పిల్లల భవిష్యత్తుకు అండగా నిలవడం, వారు గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించేలా సహకరించడం పోలీసు శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి త్యాగాలను గౌరవిస్తూ వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అమరవీరుల కుటుంబాలను గౌరవించడం, వారి సేవలను భావితరాలకు తెలియజేయడం మనందరి నైతిక బాధ్యత అని అన్నారు.

ꣳప్రజలకు న్యాయం చేయడమే అమరవీరులకు నిజమైన నివాళిꣳ పోలీసు అమరవీరులకు నిజమైన నివాళి కేవలం పుష్పగుచ్ఛాలు సమర్పించడం, స్మారక చిహ్నాల వద్ద నివాళులర్పించడం మాత్రమే కాదని, విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా, మానవీయ దృక్పథంతో నిర్వహించడమేనని ఎస్పీ స్పష్టం చేశారు. బాధితులు పోలీస్ స్టేషన్కు వచ్చినప్పుడు వారికి న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కల్పించాలని, మహిళలు, పిల్లలు, వృద్ధులు, బలహీన వర్గాలకు భరోసా ఇవ్వాలని సూచించారు. నేరస్తుల పట్ల చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తూనే, అమాయక ప్రజల పట్ల గౌరవం, సహానుభూతితో వ్యవహరించాలని తెలిపారు. పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు ప్రతి అధికారి, సిబ్బంది తమ ప్రవర్తనలో పారదర్శకతను, విధి నిర్వహణలో నిబద్ధతను ప్రదర్శించాలని అన్నారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తూ, బాధితులకు అండగా నిలుస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ను కొనసాగించాలని సూచించారు.ప్రస్తుత కాలంలో నేరాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకుంటూ సైబర్ నేరాలను అరికడుతున్నం అని ఎస్పీ తెలిపారు. సైబర్ మోసాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ, బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. యువతను మాదకద్రవ్యాల ముప్పు నుంచి కాపాడేందుకు సమష్టిగా కృషి చేయాలని, నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తన విధిని ప్రజాసేవగా భావించి పనిచేయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పోలీసు శాఖపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని మరింత పెంపొందిస్తూ, సమాజంలో శాంతి, భద్రతలకు భరోసా కల్పించాలని తెలిపారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాంꣳ పోలీసు అమరవీరులు తమ ప్రాణాలను అర్పించి పోలీసు శాఖ గౌరవాన్ని నిలబెట్టారని, నేటి పోలీసు సిబ్బంది తమ నిబద్ధత, నిజాయితీ, కర్తవ్యనిష్ఠతో ఆ గౌరవాన్ని మరింత పెంచాలని ఎస్పీ పిలుపునిచ్చారు. అమరవీరుల స్మారక చిహ్నం వద్ద అర్పించే నివాళి కార్యక్రమానికే పరిమితం కాకుండా, వారి త్యాగాలు ప్రతి పోలీసు అధికారి ఆలోచనల్లో, ప్రవర్తనలో, విధి నిర్వహణలో ప్రతిరోజూ ప్రతిబింబించాలని అన్నారు. అమరవీరుల ధైర్యం మనకు ఆదర్శం కావాలని, వారి త్యాగం మనకు స్ఫూర్తినివ్వాలని, వారి సేవాభావం మనకు మార్గదర్శకంగా నిలవాలని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ తరఫున విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన ప్రతి పోలీసు వీరుడికి హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు తెలిపారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు గౌరవపూర్వక వందనాలు తెలియజేస్తూ, వారి త్యాగాలను ఎప్పటికీ మరువబోమని స్పష్టం చేశారు.స్మృతి పరేడ్కు రిజర్వ్ ఇన్స్పెక్టర్ జానయ్య పరేడ్ కమాండర్గా వ్యవహరించగా, కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను ఆర్మ్డ్ డీఎస్పీ నరసింహాచారి నిర్వహించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమరులైన పోలీసు వీరులకు ఘనంగా నివాళులర్పించారు.స్మృతి పరేడ్లో పాల్గొన్న అధికారులు ఈ కార్యక్రమంలో పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, నరసింహాచారి, ఇన్స్పెక్టర్లు రామారావు, శివకుమార్, వెంకటయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్ రావు, చరమందరాజు, ప్రతాపలింగం, రామకృష్ణ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, నారాయణ రాజు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారులు, పోలీస్ సంఘం అధ్యక్షులు రమేష్, సెక్రెటరీ కిరణ్, సిబ్బంది, ఇతర శాఖల అధికారులు,పౌరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు ఎనలేనివి

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ -అక్టోబర్ 21(మనం ప్రతినిధి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేశ రక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఐఏఎస్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్, అమరవీరుల కుటుంబ సభ్యులు, అధికారులు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ꣳజిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ꣳ మాట్లాడుతూ, ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు కీలకమని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, పోలీస్ విధి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధతతో కూడిన పవిత్ర కర్తవ్యమని అన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్ లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నల్లగొండ జిల్లాలో విధి నిర్వహణలో ఇప్పటివరకు 15 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని, దేశవ్యాప్తంగా ఈ ఏడాది 154 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారని ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీ కె. శివరాం రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హరీష్ రావును కలిసిన బీఆర్ఎస్ ఇన్చార్జ్ ఆదర్శ్ రెడ్డి

దసరా శుభాకాంక్షలు తెలిపిన పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు

రామచంద్రాపురం, అక్టోబర్ 21 (మనం న్యూస్): దసరా పండుగను పురస్కరించుకుని పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి మాజీ మంత్రి, శాసనసభలో బీఆర్ఎస్ ఉపనేత హరీష్ రావును, తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు ఒకచోట చేరి శుభాకాంక్షలు తెలుపుకోవడం, ఆత్మీయంగా పలకరించుకోవడం సందడిగా సాగింది. ఈ సందర్భంగా హరీష్ రావుకు పార్టీ నాయకులు శాలువతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పటాన్చెరు మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డితో పాటు పటాన్చెరు నియోజకవర్గానికి చెందిన పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని శ్రీనివాస రావు
- కల్లూరు – సోమారం బీటీ రోడ్డుకు రూ.2.20 కోట్లు మంజూరు చేయడంపై హర్షం
- కల్లూరులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం

నేరేడుచర్ల,అక్టోబర్ 21 మనం న్యూస్: హుజూర్నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతూ, నిరంతరం ప్రజా సంక్షేమం, అభివృద్ధి కై శ్రమిస్తున్న నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత రాష్ట్ర ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి నిజమైన ప్రజా నాయకుడని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చలసాని శ్రీనివాస రావు కొనియాడారు. నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామం నుండి సోమారం వరకు 2 కిలోమీటర్ల బీటీ (ఆఖీ) రోడ్డు నిర్మాణానికి రూ.2.20 కోట్ల భారీ నిధులను మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా.. బుధవారం కల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుడిగె వెంకటేశ్వర్లు గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చలసాని శ్రీనివాస రావు మాట్లాడుతూ...

కల్లూరు గ్రామం నుండి సోమారం వరకు ఉన్న రహదారి అధ్వానంగా మారి, ఎన్నో ఏళ్లుగా స్థానిక ప్రజలు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన సానుకూలంగా స్పందించారు. ఏకంగా రూ.2.20 కోట్ల భారీ నిధులను మంజూరు చేసి, ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చారని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి హుజూర్నగర్ నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనుల జాతర కొనసాగుతోంది. ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అంతర్గత రహదారులు, బీటీ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నారు. కల్లూరు గ్రామాభివృద్ధికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినందుకు గ్రామ ప్రజల తరపున, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల తరపున మంత్రి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుడిగె వెంకటేశ్వర్లు గౌడ్, ఉప సర్పంచ్ ఉప్పెల్లి మహేష్, వార్డ్ మెంబర్ లు, కొడాలి పట్టయ్య, చలసాని మాధవరావు, కొడాలి భాస్కర్ రావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మేకపోతుల నాగరాజు, పిచ్చయ్య, బుడిగె రోశయ్య, సోమయ్య, హుస్సేన్ హరికృష్ణ, సిరికొండ జానకి రాములు, ప్రేమ్ కుమార్, ఉప్పెల్లి రాములు, వెంకటేశ్వర్లు, పెద్ద వెంకటయ్య, గుడుగుంట్ల వెంకటయ్య, శేఖర్, పుల్లెముల చంద్రయ్య, వీరస్వామి, గజగంటి ప్రవీణ్, అక్కయ్య బాబు, సుదర్శన్, అనంతు వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీరప్పగడ్డలో అంగరంగ వైభవంగా దుర్గమ్మ నిమజ్జనం!

- నాసిక్ డోలు దరువులతో మార్మోగిన వీధులు..
- 50 మందితో కన్నులపండువగా శోభాయాత్ర
- మహారాణి దుర్గా మాయ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు

జనగామ, అక్టోబర్ 23 మనం ప్రతినిధి: జనగామ జిల్లా కేంద్రంలోని బీరప్పగడ్డలో దుర్గమ్మ నిమజ్జన వేడుకలను మహారాణి దుర్గా మాయ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 50 మందితో చేపట్టిన శోభాయాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాసిక్ డోలు దరువులతో బీరప్పగడ్డ పరిసరాలు మార్మోగగా, భక్తుల ఉత్సాహంతో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రత్యేక పూజలు.. వైభవంగా శోభాయాత్ర

నిమజ్జన కార్యక్రమంలో భాగంగా తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళహారతులు సమర్పించారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల మధ్య శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. నాసిక్ డోలు వాయిద్యాల నడుమ సాగిన శోభాయాత్ర భక్తులను, స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది.

అమ్మవారి ఆశీస్సుల కోసం ప్రార్థనలు

దుర్గమ్మ ఆశీస్సులతో జనగామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిమజ్జన వేడుకలు స్థానికుల్లో ఉత్సాహాన్ని నింపాయి.

ఈ కార్యక్రమంలో దుర్గా దేవి కమిటీ సభ్యులు, స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ దసరా హరీష్ అన్న.!

- హరీష్ రావును కలిసిన నందారం నరసింహ గౌడ్
- దసరా శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానం

అమీన్పూర్, అక్టోబర్ 21 (మనం న్యూస్): విజయదశమి పండుగను పురస్కరించుకుని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమీన్పూర్కు చెందిన స్థానిక నాయకులతో కలిసి హరీష్ రావును కలిసిన నరసింహ గౌడ్ ఆయనకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు శాలువా కప్పి సన్మానించారు. విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు. దసరా పండుగ నేపథ్యంలో నాయకుల మధ్య ఆత్మీయ కలయికలు, శుభాకాంక్షల పరస్పర మార్పిడి సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో అమీన్పూర్కు చెందిన పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం!

- జనగామలో కొవ్వొత్తుల ర్యాలీ..
- అమరవీరులకు ఘన నివాళులు
- డీసీపీ రాజా మహేంద్ర నాయక్ ఐపీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం

జనగామ, అక్టోబర్ 23 మనం ప్రతినిధి: పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని జనగామ జిల్లా కేంద్రంలో పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జనగామ డీసీపీ రాజా మహేంద్ర నాయక్ ఐపీఎస్ ఆధ్వర్యంలో జనగామ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి ఈ ర్యాలీ చేపట్టారు. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీ

పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీ ద్వారా వారి సేవలను గుర్తుచేసుకున్నారు. విధి నిర్వహణలో ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

పోలీస్ శాఖకు అమరవీరులే స్ఫూర్తి

దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు ఎల్లప్పుడూ పోలీస్ శాఖకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే వారికి అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ సీఐ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా దసరా వేడుకలు

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- శ్రీ మహంకాళి ఆలయం వద్ద రావణాసురు దహనం
- భక్తిశ్రద్ధల మధ్య అమ్మవారి మండపాల మధ్య పూజా కార్యక్రమాలు

గజ్వేల్ అక్టోబర్ 21 మనం న్యూస్: గజ్వేల్ పట్టణంలో దసరా వేడుకలను అంగరంగ వైభవంగా ప్రజలు నిర్వహించుకున్నారు. దసరా అనగానే కొత్త బట్టలు పిండి వంటలు బంధువుల హడావిడి రాకపోగాలతో ఎంతో ఆహ్లాదంగా మారిపోతుంది. పండుగ రోజు ప్రతి ఒక్కరూ తమ తమ ఇండ్ల వద్ద వాహనాల శుద్ధితో పాటు ఇంటి అలంకారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తారు. దసరా ఉత్సవాలు అనగానే ఎంతో ఉత్సాహాన్ని యువకులు ప్రదర్శిస్తారు. దీనిలో భాగంగానే గజ్వేల్ పట్టణంలోని వివిధ ఆలయాల వద్ద శమీ వృక్షాలను ఏర్పాటు చేయడంతో భక్తులు అక్కడికి చేరుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించి శమీ వృక్షంలోని ఆకులను తీసుకొని ఒకరికి ఒకరు పంచుకుంటూ ఆలింగనం చేసుకోవడం జరుగుతుంది. గజ్వేల్ పట్టణంలోని అతి పురాతనమైన శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయం నుండి ఎప్పటిలాగానే పట్టణంలోని పుర ప్రముఖులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు చేరుకొని అక్కడ నుండి పాలపిట్టను చూచేందుకు వెళ్లడం జరిగింది. అలాగే శ్రీ మురళీకృష్ణ ఆలయంలో ఏర్పాటు చేసిన శమీ వృక్షం వద్ద ఆలయ కమిటీ వారు పూజలు నిర్వహించి శమీ ఆకులను పంచుకొని ఆలింగనం చేసుకోవడం జరిగింది. పట్టణంలోని శ్రీ సంతోషిమాత ఆలయం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం తోపాటు శ్రీ మహంకాళి ఆలయాల వద్ద ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం భక్తులు అమ్మవార్లను దర్శించుకోవడం కనిపించింది. అలాగే తొమ్మిది రోజులుగా అమ్మవారి మండపాలను గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేయడం జరిగింది ఆయా మండపాల వద్ద భజన కార్యక్రమాలు పూజా కార్యక్రమాలు ఓం హోమాలు నిర్వహించడం జరిగింది దసరా రోజు చివరి రోజు కావడంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు కూడా భారీ సంఖ్యలో మండపాల వద్దకు వచ్చి పూజ కార్యక్రమం నిర్వహించడం కనిపించింది. దసరా ఉత్సవాల్లో భాగంగానే శ్రీ మహంకాళి ఆలయం వద్ద రావణాసుర దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ పట్టణంలోని పుర ప్రముఖులతో పాటు ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా స్థానిక పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎల్ నినో ప్రభావంతో నీటి ఎద్దడి
తలెత్తకుండా ముందస్తు చర్యలు

ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టాలి.. తాగునీటికి ప్రథమ ప్రాధాన్యం

రామప్ప చెరువులో 29 అడుగుల నీటి నిల్వ.. పంపింగ్ ద్వారా నీటి సరఫరాకు చర్యలు

ఉపాధి హామీ పనులతో నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలి

అధికారులతో సమీక్షల ద్వారా తాగునీటి కొరత లేకుండా చూస్తాం: మంత్రి సీతక్క

ములుగు, అక్టోబర్ 21(మనం ప్రతినిధి): ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగి, వర్షాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో గత ఆరు నెలలుగా వివిధ శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ నీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం పరిధిలోని రామప్ప చెరువు, అక్కడి డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టును మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామప్ప చెరువులో ప్రస్తుతం 29 అడుగుల మేర నీరు అందుబాటులో ఉందని తెలిపారు. గోదావరి నుంచి నీటిని పంపింగ్ చేసి చెరువులు, పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా మెరుగుపరిచే అవకాశాలను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. నీటి నిల్వలు పెరిగేందుకు ఏటా ఇచ్చే విరామాన్ని దృష్టిలో ఉంచుకుని, మరో రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేలా సంబంధిత అధికారులను కోరినట్లు చెప్పారు.

రామప్ప నుంచి నీటిని డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసి ములుగు, వెంకటాపురం, గోవిందరావుపేట, మల్లంపల్లి పరిసర ప్రాంతాలతో పాటు భూపాలపల్లి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నీటి సరఫరా వ్యవస్థలు, చెరువులపై ఆధారపడిన గ్రామాలు, భూగర్భ జలాల పరిస్థితిని అధికారులు నిరంతరం పరిశీలిస్తున్నారని తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాలపై రాజకీయాలు తగవు

అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి పరిణామాలను ఏ శక్తీ పూర్తిగా నియంత్రించలేదని, ఇలాంటి పరిస్థితులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని మంత్రి సీతక్క అన్నారు. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పులు వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ప్రకృతి సవాళ్లను ఎదుర్కొనేందుకు రాజకీయ విమర్శల కంటే సమష్టి కార్యాచరణ అవసరమని స్పష్టం చేశారు.

ఉపాధి హామీతో నీటి సంరక్షణకు పెద్దపీట

వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, నీటి కుంటలు, చెక్డ్యామ్లు, చెరువుల పునరుద్ధరణతో పాటు బోర్ల రీచార్జ్ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద విస్తృతంగా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని, కూలీల సంఖ్యను పెంచి అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచులు, గ్రామస్థులకు పిలుపునిచ్చారు. ఇప్పటి నుంచే నీటి నిల్వలను పెంచుకుంటే భవిష్యత్తులో నీటి ఎద్దడి తీవ్రతను తగ్గించవచ్చని అన్నారు.

తాగునీటికి అత్యంత ప్రాధాన్యం

సాగునీటి అవసరాలతో పాటు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సీతక్క స్పష్టం చేశారు. ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

రామప్ప- లక్నవరం కాలువ వంటి ప్రతిపాదిత ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రత్యామ్నాయ నీటి వనరులను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్నినో ప్రభావంతో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తామని, నీటి సంరక్షణలో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

మృతుల కుటుంబాలకు మంత్రి సీతక్క పరామర్శ..
బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా

ములుగు, అక్టోబర్ 21(మనం ప్రతినిధి): ములుగు జిల్లాలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క పరామర్శించి, మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటాపూర్ మండలం కేశాపూర్ గ్రామానికి చెందిన భాషవేణి లావణ్య రోడ్డు ప్రమాదంలో, అదే గ్రామానికి చెందిన బొంకురి మల్లేష్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ములుగు మున్సిపాలిటీ పరిధిలోని బండారుపల్లి గ్రామానికి చెందిన సాయి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నగుంటూరుపల్లి గ్రామానికి చెందిన సమ్మక్క అనే వృద్ధురాలు మృతి చెందడంతో ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి సీతక్క, ఈ క్లిష్ట సమయంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కేశాపూర్ సర్పంచ్ తోట భద్రయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలి: మంత్రి సీతక్క

ములుగు, ఆగస్టు 21(మనం ప్రతినిధి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామాంజపూర్ గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ కాంగ్రెస్ పార్టీ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నీనో ప్రభావం రాష్ట్రం పైన ఉండకుండా ఉండాలి

అమ్మవారి ని దర్శించుకున్న ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి

మంగపేట, అక్టోబర్ 21, మనం ప్రతినిధి: బుధవారం రోజున రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు, ఈరోజు మంగపేట మండలం లోని రాజుపేట, రమణక్కపేట, వాడగూడెం గ్రామలలో గత పది రోజుల నుండి భక్తి శ్రద్దలతో నియమ నిష్టలతో దుర్గమాత అమ్మవారి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈరోజు అమ్మవారి నిమర్జన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి రేగా కళ్యాణి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని తెలంగాణ రాష్ట్ర లో ప్రకృతి తో జరగబోయే ఎల్ నీనో ప్రభావం తో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలి అని దుర్గమాత ను వేడుకుంటు ములుగు నియోజకవర్గం లో పాడి పంటలతో ప్రజలు సుఖసంతోషలతో ఉండాలి అని ఆకాంక్షిస్తూ దసరా శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో... మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సోషల్ మీడియా సెక్రటరీ కర్రి నాగేంద్రబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమరం బాలయ్య,సింగల్ విండో డైరెక్టర్ కోడం బాలకృష్ణ,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శానం నిర్మల,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బడిశా ఆదినారాయణ, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు కొంకతి సాంబాశివారావు,మల్లూరు హేమచల ఉత్సవ కమిటీ చైర్మన్ ఎర్రంగారి సురేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు ఇందారపు లక్ష్మన్, మండల సీనియర్ నాయకులు.. తుమ్మల ముఖర్జీ, బోనుగు హనుమంతరావు, చందర్లపాటి శ్రీనివాస్,చిట్యాల బాలకృష్ణ, మాటూరి నరహరి,వంశీ పాల్గొన్నారు

ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి

నల్లబెల్లి, అక్టోబర్ 21 (మనం ప్రతినిధి): భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆ పార్టీ నల్లబెల్లి మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి అన్నారు. బుధవారం నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి, సారంగపాణి ఆధ్వర్యంలో బీఆర్ఎస్లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు గూగులోతు రాజు, భూక్య శ్రీనులకు సారంగపాణి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు, అండదండలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మోరాల ప్రతాప్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మంద సుజాత రాజి రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జి గంది శ్రీనివాస్ గుప్తా, పోగుల చిరంజీవి, మాజీ ఎంపీటీసీ నూటెంకి సూరయ్య, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నునావత్ దేవా, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి మాసాని రవి, మాజీ ఉపసర్పంచ్ ఈర్ల రవి, ఈర్ల రామ్మూర్తి, ఊడుత సదానందం, వార్డు సభ్యులు అనిశెట్టి వినోద్, గంగారపు వినయ్, భూక్య భీముడు, గూగులోతు రవి, హింగే రమేష్, పార్టీ నాయకులు ఇంగ్లీ రవీందర్, తోట మొగిలి, గంగారపు రవి, బాబు, శంకర్, బిక్షపతి, సాంబయ్య, తరుణ్, గుడికందుల రాకేష్, గూగులోతు సాయి, బోనగిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

బీఆర్ఎస్ శ్రేణులకు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు

గోవిందరావుపేట, అక్టోబర్ 21(మనం ప్రతినిధి): త్వరలో జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విస్తృతంగా కృషి చేయాలని ఆ పార్టీ ములుగు జిల్లా మాజీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్బాబు పిలుపునిచ్చారు. బుధవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో పోరిక రవికిరణ్, పిన్నింటి మధుసూదన్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు కీలకమని, ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదనే అసంతృప్తి విద్యార్థులు, నిరుద్యోగులు, పట్టభద్రుల్లో ఉందని లక్ష్మణ్బాబు పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత బీఆర్ఎ స్కు అనుకూలంగా మారేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. యువతతోపాటు రైతులు, మహిళలు, ఇతర వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు వివరించాలని అన్నారు. గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన విషయాన్ని గుర్తుచేశారు. ఈసారి పార్టీ ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా, అందరూ సమన్వయంతో పనిచేసి విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సమయానికి పూర్తిస్థాయి కార్యాచరణ సిద్ధంగా ఉండేలా ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ చందులాల్, మాజీ ఎంపీటీసీ వెలిశాల స్వరూప, గాంధీ, సుజాత, బండి రాజశేఖర్, సర్పంచ్ బొల్లం ప్రసాద్, మాజీ సర్పంచుల ఫోరం గోవిందరావుపేట మండల అధ్యక్షుడు మోహన్ రాథోడ్, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ పృథ్వీరాజ్ ఉట్ల, నాంపూర్ణ, తాటికొండ శ్రీనివాస్, చారి, పస్రా సోషల్ మీడియా కన్వీనర్ అజిత్, ఫక్రుద్దీన్, బొల్లం శివ, వజ్జ్య, నరేందర్, గజ్జి ఎలంధర్, కొమురయ్య, రాజకుమార్, శ్రీను, రమేష్, విజయ్ పాల్గొన్నారు.

పస్రా, గోవిందరావుపేటలో అంబరాన్నంటిన దసరా సంబరాలు

రావణ వధ కార్యక్రమాన్ని ప్రారంభించిన పైడాకుల అశోక్

గోవిందరావుపేట, అక్టోబర్ 21(మనం ప్రతినిధి): చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి వేడుకలు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రా, గోవిందరావుపేట గ్రామాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన రావణ వధ కార్యక్రమాలను ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, పస్రా సీఐ పత్తిపల్లి దయాకర్, ఎస్ఐ తాజుద్దీన్ ప్రారంభించారు. ఈ వేడుకలను తిలకించేందుకు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రావణ వధ కేవలం సంప్రదాయ వేడుక మాత్రమే కాదని, చెడుపై మంచి, అసత్యంపై సత్యం సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అహంకారం, ద్వేషం, అన్యాయం వంటి దుర్గుణాలను విడనాడి ప్రేమ, మానవత్వం, సత్యం, ధర్మం వంటి సద్గుణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పైడాకుల అశోక్ ప్రజలతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు ప్రజలందరినీ ఒకచోట చేర్చి సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. పస్రా, గోవిందరావుపేట గ్రామాల్లో రావణ వధ కార్యక్రమాలు పండుగ సందడిని మరింత పెంచాయి. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కారును ఢీ కొన్న ఆర్టీసీ బస్సు
ఆర్ఎంపీ వైద్యుడికి తీవ్ర గాయాలు

కాటారం, అక్టోబర్ 2(మనం న్యూస్): భూపాలపల్లి జిల్లా కాటారం మండలం చింతకాని క్రాస్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. కారును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కాటారానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కుమారస్వామి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వివరాల ప్రకారం.. దసరా పండగ సందర్భంగా కుమారస్వామి కాటారం నుంచి తన స్వగ్రామమైన మహాముత్తారం మండలం సింగంపల్లికి కారులో బయల్దేరారు. చింతకాని క్రాస్ వద్ద టర్న్ తీసుకుంటుండగా కాటారం నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కారునుబలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు తీవ్రంగా దెబ్బతినగా.. బస్సు ముందు భాగం ధ్వంసమైంది. కారులో ఉన్న కుమారస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ లో భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు వివరాలు సేకరించి ఆర్టీసీ బస్సులు పోలీస్ స్టేషన్ కు తరలించారు.



ఘనంగా దసరా వేడుకలు

కాటారం, అక్టోబర్ 21 మనం న్యూస్: కాటారం మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మంగళవారం దసరా వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయుధ పూజ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక సమీపంలో రావణవధ ఘట్టం అట్టహాసంగా కొనసాగింది. పెద్దలు, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో రావణవధ కార్యక్రమానికి హాజరయ్యారు అనంతరం సమీపంలోని జమ్మి చెట్లకు పూజలు నిర్వహించి సంప్రదాయబద్ధంగా ఒకరికొకరు జమ్మిఆకు ఇచ్చి పుచ్చుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఘనంగా గ్రామ బొడ్రాయి వేడుకలు

హనుమకొండ , అక్టోబర్ 21(మనం న్యూస్): హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం బాలాజీ బంజారా కాలనీలో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో గ్రామ బొడ్రాయి వద్ద సంప్రదాయబద్ధంగా ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో కలిసి గ్రామ బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించి, గ్రామ శ్రేయస్సు, సుఖసంతోషాలు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ లావుడియా అనూష రవి నాయక్ యాటపోతును కోయగా, భూక్య కమల హరి సింగ్ నాయక్ సొరకాయను కోశారు. గ్రామ సంప్రదాయ లను కొనసాగిస్తూ పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లావుడియా పల్లవి రాజు నాయక్, హనుమంతు నాయక్, హరిలాల్ నాయక్, మంజీ నాయక్, కిషన్ నాయక్, తారాచంద్ నాయక్, రాజు చిన్న, సత్తయ్య నాయక్, మూడు రామ్ చందర్ నాయక్, దేవ్ సింగ్ నాయక్, రాజేందర్ బోడ, పులి రాజు, జెట్ మాల్ నాయక్, వెంకన్న నాయక్, కిషన్, శంకర్, శ్రీనివాస్, ప్రతాప్, కళ్యాణ్, రమేష్, ప్రమోద్, లోకేష్, తిరుపతి, ఈశ్వర్, బిక్షపతి, అరుణ్, రవి, అరవింద్, విజయ్, మురళి, రవి నాథ్, వెంకట్, కిరణ్, కిషోర్, యాకూబ్, ప్రసాద్, వినోద్, సైదులు, సుమన్, మోహన్ నాయక్, వెంకటేష్, రాజేందర్, రవీందర్, సునీల్, శ్రీను, సుశాంత్, పవన్ కుమార్, రంగన్న, మున్నా తదితరులు పాల్గొన్నారు.గ్రామ పెద్దలు, ప్రజల సమక్షంలో నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో ఐకమత్యాన్ని, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని చాటిచెప్పాయి.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

అమరుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటాం: ఎస్పీ కేకాన్

ములుగు, అక్టోబర్ 21(మనం ప్రతినిధి): దేశ రక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి వారి సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ విధి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధతతో కూడిన పవిత్రమైన కర్తవ్యమని పేర్కొన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి ఏటా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నక్సలిజం, ఉగ్రవాదం నిర్మూలనలో తెలంగాణ పోలీసులు చేసిన కృషి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత చేరువవుతున్నామని, యువత చెడు మార్గాల్లో పయనించకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. యువతకు సరైన మార్గనిర్దేశం చేయడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ఏవైనా సమస్యలు ఎదురైతే తనను సంప్రదించాలని సూచించారు. అనంతరం ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్ ఐపీఎస్ దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసుల వివరాలను చదివి వినిపించారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేసి గౌరవించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్ ఐపీఎస్, అదనపు ఎస్పీ సదానందం, డీసీఆర్బీ డీఎస్పీ కిషోర్కుమార్, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు దయాకర్, సురేష్, సూర్యప్రకాష్, రమేష్, ఆర్ఐలు స్వామి, వెంకటనారాయణ, శ్రీకాంత్, తిరుపతి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆయన సపోర్ట్ వల్లే ఈ స్థాయికి వచ్చాను.. - మమితా బైజు

మలయాళ బ్యూటీ మమితా బైజు, నివిన్ పౌలీ, కాంబినేషన్లో వచ్చిన 'బెత్లెహెం కుటుంబ యూనిట్' బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో ఘనవిజయాన్ని అందుకంది. కేవలం రూ. 25 కోట్ల బడ్జెట్తో తెరకెక్కిన ఈ చిత్రం, ఓనం కానుకగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ. 325 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి ఇండస్ట్రీ హిట్గా నిలిచింది. ఈ మూవీ అద్భుత విజయం సాధించిన సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించగా.. ఇందులో హీరోయిన్ మమితా బైజు పాల్గొని ఎమోషనల్ కామెంట్స్ చేశారు.

తన సినీ ప్రయాణంలో ప్రధాన పాత్రలు చేయగలననే నమ్మకం తనకే లేని సమయంలో, డైరెక్టర్ గిరీష్ ఏడీ తనపై ఎంతో నమ్మకం ఉంచారని చెప్పారు. ఏమీ తెలియని ఒక సామాన్య వ్యక్తికి ఎవరైనా అండగా నిలబడి ప్రోత్సహిస్తే ఆ వ్యక్తికి సమాజంలో ఒక ప్రత్యేక గౌరవం, విలువ లభిస్తాయని.. గిరీష్ విషయంలో తనకు సరిగ్గా అలాగే అనిపించిందని తెలిపారు. 'ప్రేమలు' చిత్రం నుంచి 'బెత్లెహెం కుటుంబ యూనిట్' వరకు తనను నమ్మి అవకాశాలు ఇచ్చినందుకు గిరీష్కి తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.

ఈ ముగ్గురిని ఊరిస్తున్న రికార్డులు!

న్యూజిలాండ్తో ఐదు టీ20ల సిరీస్ కోసం భారత్ సిద్ధమైంది. గురువారం ఇరు జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఇందుకు వేదిక క్రైస్ట్చర్చ్. దాదాపు నాలుగేళ్ల తర్వాత పునరాగమనం చేసిన భువనేశ్వర్తోపాటు యువ పేసర్ అర్ష్దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్ అరుదైన మైలురాళ్లకు చేరువగా ఉన్నారు.

భువీ ఇలా..

● టీ20ల్లో సెంచరీ వికెట్లు: ఇప్పటివరకు భారత్ తరఫున 87 టీ20 మ్యాచ్లు ఆడిన భువనేశ్వర్.. 23.10 సగటుతో 90 వికెట్లు పడగొట్టారు. ఈ పర్యటనలో మరో 10 వికెట్లు తీస్తే, పొట్టి ఫార్మాట్లో 100 వికెట్ల స్థాయిని అందుకున్న ఐదో భారత బౌలర్గా చరిత్రకెక్కుతాడు. అతడి కంటే ముందు అర్ష్దీప్ (145), బుమ్రా (126), హార్దిక్ పాండ్య (114), అక్షర్ పటేల్ (113) మాత్రమే శతక వికెట్లు తీశారు.

● అంతర్జాతీయంగా 300 వికెట్లు: అన్ని ఫార్మాట్లు కలుపుకొని భువీ ఖాతాలో ప్రస్తుతం 294 వికెట్లు ఉన్నాయి. మరో 6 వికెట్లు సాధిస్తే అంతర్జాతీయ క్రికెట్లో మొత్తం 300 వికెట్లు పూర్తి చేసుకున్న 14వ భారత బౌలర్గా (పేసర్ల విభాగంలో 9వ బౌలర్గా) ఘనత సాధిస్తాడు.

తొలి బౌలర్గా అర్ష్దీప్..

● 150 మార్క్: భారత టీ20 స్పెషలిస్ట్ పేసర్ అర్ష్దీప్ అరుదైన ఘనతకు చేరువగా ఉన్నాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 145 వికెట్లు ఉన్నాయి. పొట్టి ఫార్మాట్లో టీమ్ఇండియా తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్గానూ అతడే కొనసాగుతున్నాడు. మరో ఐదు వికెట్లు తీస్తే భారత్ తరఫున 150 వికెట్లు తీసిన తొలి బౌలర్గా అవతరిస్తాడు. ఓవరాల్గా తొమ్మిదో బౌలర్ అవుతాడు.

● వందో మ్యాచ్: న్యూజిలాండ్తో తొలి టీ20 మ్యాచ్ అతని కెరీర్లో వందోది కావడం గమనార్హం. ఇలా 100 అంతకంటే ఎక్కువ మ్యాచులు ఆడిన ఏడో భారత క్రికెటర్గా నిలుస్తాడు. రోహిత్ శర్మ (159) అందరికంటే ఎక్కువ ఆడాడు.

కుల్దీప్.. ఇంకో రెండు తీస్తే

చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ కూడా ఓ ఘనతను తన ఖాతాలో వేసుకొనేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. ప్రస్తుతం 56 మ్యాచులు ఆడిన కుల్దీప్ 98 వికెట్లు పడగొట్టాడు. మరో రెండు వికెట్లు తీస్తే వంద వికెట్ల రికార్డును అందుకొంటాడు.

పారా ఆసియా క్రీడలు.. 60+ మెడల్స్.. నాలుగో ప్లేస్కు భారత్

క్రీడలక సమయంలో భారత అథ్లెట్లు అదరగొట్టేస్తున్నారు. దీంతో పారా ఆసియా క్రీడల్లో భారత్ పతకాల సంఖ్య 61కి చేరింది. ఇందులో 14 స్వర్ణాలు, 21 రజతాలు, 26 కాంస్యాలు ఉన్నాయి. దీంతో పట్టికలో నాలుగో ప్లేస్కు చేరుకుంది. చైనా (211) టాప్లో కొనసాగుతోంది.

స్వర్ణాల వర్షం..

భారత అథ్లెట్లు స్వర్ణాల వేట కొనసాగిస్తున్నారు. దిలీప్ గావిట్ పురుషుల 100 మీ టీ47 రేసును 10.69 సెకన్లలో పూర్తి చేసి స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఇదే విభాగంలో మోర్సింగ్కత్ (10.72 సెకన్లు) రెండో స్థానంలో నిలిచి రజతం సొంతం చేసుకున్నాడు. మహిళల 100 మీటర్ల విభాగంలో 12.02 సెకన్లతో రేసును పూర్తి చేసిన సిమ్రాన్ కొత్త రికార్డు సృష్టించింది. దీంతో మరో స్వర్ణం ఆమె ఖాతాలో పడింది. ఇప్పటికే 200 మీ. టీ12

వైభవ్కు తుది జట్టులో చోటు కష్టమే..
భువీకి బాగా తెలుసు: శ్రేయస్

ఇప్పటికిప్పుడు భారత యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశాలు రావడం కష్టంగానే అనిపిస్తోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వ్యాఖ్యలను చూస్తే అలాగే ఉంది. వైభవ్ మరికొంత కాలం వేచి చూడాలనే ధోరణిలోనే శ్రేయస్ వ్యాఖ్యానించాడు. గురువారం నుంచి న్యూజిలాండ్తో ఐదు టీ20ల సిరీస్ మొదలుకానుంది. ఈ క్రమంలో శ్రేయస్ ప్రెస్ కాన్ఫరెన్స్లో మాట్లాడాడు. ''వైభవ్ వంటి అద్భుతమైన నైపుణ్యం కలిగిన ఆటగాడికి అవకాశాలు రాకపోయినా.. డ్రెస్సింగ్ రూమ్లో సంతోషంగా ఉంచడం ముఖ్యం. ఇంకా అతడు కుర్రాడే. అవకాశాలు పొందడానికి చాలా సమయం ఉంది. ఇప్పటికిప్పుడు అతడు జట్టులోకి వచ్చేస్తాడని చెప్పలేను. ప్రస్తుతం ఓపెనర్లు నిలకడగా పరుగులు చేస్తున్నారు. వారిద్దరూ ప్రపంచ కప్పు గెలిపించిన బ్యాటర్లు. ఇప్పుడు జట్టుతోపాటు వైభవ్ విదేశాలకూ వస్తే పిచ్లపై ఎలా ఆడాలో ఓ అవగాహన వస్తుంది. మరోసారి ఇక్కడ పర్యటించినప్పుడు అందుకు మెరుగ్గా సన్నద్ధమవుతాడు. మొదటిసారి వచ్చే సహచరులకూ సూచనలు ఇవ్వగలడు'' అని శ్రేయస్ వెల్లడించాడు.

నా శరీరం.. నా ఇష్టం.. - పాయల్

పాయల్ రాజ్పుత్ శరీరాకృతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ, కొన్నివీడియోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్న వారిపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన శరీరం, తన రూపం గురించి వ్యాఖ్యానించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం అర్ధరాత్రి ఎక్స్ లో ఘాటుగా స్పందించారు. 'నా శరీరం, నా సైజు, నా గర్వం. ఇవి మీకు సంబంధించిన విషయాలు కావు. మీ హద్దుల్లో మీరు ఉండండి. మీ పని మీరు చేసుకోండి' అంటూ బాడీ షేమింగ్కు పాల్పడుతున్నవారికి గట్టిగా బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె చేసిన పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది.

సినిమాల విషయానికి వస్తే.. తెలుగులో 'ఆర్ఎక్స్ 100' తర్వాత ఆమె వరుసగా 'ఆర్డీఎక్స్ లవ్', 'వెంకీ మామ', 'డిస్కో రాజా' వంటి సినిమాల్లో నటించింది. 2023లో వచ్చిన మంగళవారం సినిమాలో మరో సారి మంచి గుర్తింపు తెచ్చుకుంది. తర్వాత 'రక్షణ'చిత్రంలో పోలీస్ ఆఫీసర్గా మెప్పించింది.

మహాశక్తిగా నయన్ విశ్వరూపం..

నయనతార ప్రధాన పాత్ర చేసిన లేటెస్ట్ సినిమా 'మూకుతి అమ్మన్ 2'. సుందర్.సి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తెలుగులో 'మహాశక్తి' పేరుతో వచ్చే నెల 06న థియేటర్లలో రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ వదిలారు.

ఆర్జే బాలాజీ దర్శకత్వంలో మూకుతి అమ్మన్ తొలి భాగం సింపుల్గా తీసినప్పటికీ.. ఈసారి మాత్రం భారీ గ్రాఫిక్స్, దద్దరిల్లే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ పెట్టారు. అయితే గ్రాఫిక్స్పై సోషల్ మీడియాలో విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు స్టార్ హీరోలు చేసే సేవియర్ టైప్ కథతో దీన్ని తెరకెక్కించారు. ఓ ఊరు, అందులోని ఓ కుటుంబానికి ఆపద వస్తే స్వయంగా అమ్మవారు వచ్చి, వాళ్లని ఎలా కాపాడింది అనేది స్టోరీలా అనిపిస్తుంది. మరి నయన్ ఈ మూవీతో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి?

మౌళి 'దొంగ నా కొడుకు' టీజర్ విడుదలకు ముహూర్తం ఫిక్స్..

యంగ్ టాలెంటెడ్ యాక్టర్ మౌళి తనుజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'దొంగ నా కొడుకు'. ఈ చిత్రాన్ని టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. శ్రీను కంబాల దర్శకత్వంలో రాబరీ, క్రైమ్, కామెడీ జోనర్లో ఈ మూవీ తెరకెక్కుతోంది. నవంబర్ 13న ఈ సినిమాను థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించిన మేకర్స్.. తాజాగా ప్రమోషన్స్ స్పీడ్ పెంచారు. ఇందులో భాగంగా సినిమాకు సంబంధించిన టీజర్ అప్డేట్ను అఫీషియల్గా అనౌన్స్ చేశారు. అక్టోబర్ 21న ఈ మూవీ టీజర్ను విడుదల చేయబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 'అతని పిచ్చిని బిగ్ స్క్రీన్ ప్రదర్శించి నవ్వించడానికి మౌళి తనుజ్ రాబోతున్నాడు' అని రాసుకొచ్చారు.

ఇది కలలో కూడా ఊహించలేదు.. నాకు అత్యంత ప్రత్యేకమైన క్షణం.. - సమంత

సినిమాలకు కాస్త దూరం అయిన టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు కుకింగ్ రియాలిటీ షో 'సెలబ్రిటీ మాస్టర్చెఫ్ తమిళ'తో హోస్టా బుల్లితెరపై కొత్త ప్రయాణం ప్రారంభించారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఈ ప్రాజెక్ట్తో ఉన్న తన అనుబంధం గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. 'ఇది నాకు కచ్చితంగా అత్యంత ప్రత్యేకమైన క్షణం. నేను చిన్నగా ఉన్నప్పుడు 'మాస్టర్చెఫ్' చూడటం మా ఇంట్లో ఒక ఫ్యామిలీ ఈవెంట్ లాంటిది. మా అమ్మ, నేను కలిసి ఎప్పుడూ 'మాస్టర్చెఫ్' చూసేవాళ్లం, అది మా ఇద్దరి మధ్య మంచి బాండింగ్ టైమ్.

అలాంటిది ఇన్ని సంవత్సరాల తర్వాత, 'సెలబ్రిటీ మాస్టర్చెఫ్ తమిళ'కు సెలబ్రిటీ హోస్టా మారడం అనేది నేను కలలో కూడా ఊహించలేదు. ఇది అసలు జరుగుతుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. అందుకే ఇది నాకు చాలా స్పెషల్. 'సెలబ్రిటీ మాస్టర్చెఫ్ తమిళ' నేను ఇప్పటివరకు చేసిన వాటికి పూర్తిగా భిన్నమైనది, అందుకే దీన్ని నో చెప్పడం నా వల్ల కాలేదు. ఆహారానికి మనుషులను దగ్గర చేసే, జ్ఞాపకాలను సృష్టించే అద్భుతమైన శక్తి ఉంది'' అని చెప్పుకొచ్చారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.